
'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంతటి కృషికైనా సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 3

మంగళవారం 26-3-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఫుడ్ డెలివరీలోకి టాటా న్యూ

'టాటా న్యూ' యాప్‌కు కొత్త రూపునిచ్చే యోచనలో టాటా గ్రూప్ - 13లో



బెంగళూరు బల్లే బల్లే...

పంజాబ్ కింగ్స్‌పై ఆర్‌సీబీ విజయం.. మెరిసిన కోహ్లి, కార్తీక్.. - 12లో



ఆ నినాదాలను త్యజించగలరా?

జాతీయస్థాయి నినాదాలు పురుడు పోసుకోవడంలో ముస్లింల పాత్రా ఉందని కేరళ సీఎం పినరయి విజయన్ అన్నారు.

- వివరాలు 6లో



భారతీయ విద్యార్థిని దుర్మరణం

లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ పొలిటికల్ సైన్సెస్ వర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్న చేష్టా కొచ్చర్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు.

- వివరాలు 6లో



డ్రాప్ బాక్స్‌లో వేశారు..

ఎలక్టోరల్ బాండ్ల పథకం ద్వారా వందల కోట్ల విరాళాలను అందుకున్న టీఎంసీ.. తమ దాతలు ఎవరో తెలియదని చెప్పుకొచ్చింది.

- వివరాలు 6లో



తక్షణమే కాల్పుల విరమణ

రంజాన్ మాసంలో గాజాలో తక్షణమే కాల్పుల విరమణ అమలు చేయాలని కోరుతూ ఐరాస భద్రతా మండలి తీర్మానాన్ని ఆమోదించింది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

రాజకీయాలు మాని రైతులకు మేలు చేయండి



పంటలు ఎండుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రాజకీయాలు మాని రైతులకు మేలు చేయాలని డిమాండ్ చేశారు.

- వివరాలు 2లో

కొత్త గురుకులాలు ఇప్పట్లో లేనట్లే!



రాష్ట్రంలో కొత్త గురుకులాల ఏర్పాటుకు మరి కొంత సమయం పట్టే అవకాశం ఉంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీసీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ సమర్పించిన ప్రతిపాదనలకు ఆమోదం లభించడానికి వేచి చూడాల్సిందేనని నిపుణులు చెపుతున్నారు.

- వివరాలు 3లో

వెన్నుపోటు పొడుస్తారా?



తెలుగుదేశం పార్టీ మిత్రధర్మాన్ని సైతం పక్కనపెట్టి బీజేపీపైనా, ప్రధాని నరేంద్ర మోదీపైనా అసభ్య పదజాలంతో తీవ్ర దుష్ప్రచారానికి దిగడంపై కమల దళం తీవ్ర స్థాయిలో మండిపడుతోంది.

- వివరాలు 10లో

జేఎన్‌యూఎస్‌యూకు దళిత ప్రెసిడెంట్

- వివరాలు 6లో

• కాంగ్రెస్

'పాంచ్ న్యాయ్'తో ఎన్నికల గోదాలోకి..

లోక్‌సభ ఎన్నికల్లో 'గ్యారంటీ' హామీలపైనే ఆశలు

మహిళలు, రైతులు, యువ ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నం

'కులగణన' ప్రకటనతో బీసీలను ఆకర్షించే వ్యూహం..

సాక్షి, హైదరాబాద్: దక్షిణాదిలో రెండు రాష్ట్రాల్లో అధికారంలోకి రావడానికి కారణమైన 'గ్యారంటీ'లపైనే కాంగ్రెస్ అధిష్టానం ఆశలు పెట్టుకుంది. 'గ్యారంటీ' హామీలతో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ప్రజలను ఆకట్టుకున్న తరహాలోనే.. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల ఓటర్లను ఆకట్టుకునేందుకు వ్యూహాన్ని రచించింది. లోక్‌సభ ఎన్నికల్లో 'పాంచ్ న్యాయ్ (ఐదు న్యాయాలు)' పేరిట హామీలతో గోదాలో పోరాడేందుకు సిద్ధమైంది. ప్రధానంగా మహిళలు, రైతులు, యువ ఓటర్లను ఆకట్టుకునేలా.. కీలక హామీలతో మేనిఫెస్టోను రూపొందించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ దిశగా ఇప్పటికే కాంగ్రెస్ అధిష్టానం నేతలు.. మహిళలకు ఏటా రూ.లక్ష, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్ వంటి ప్రకటనలు చేశారు. దేశవ్యాప్తంగా కులగణన కూడా చేపడతామనీ పేర్కొన్నారు. ఈ రెండు మిగతా 2వ పేజీలో ▶

• బీఆర్‌ఎస్

నేటి నుంచి భేటీలతో దూకుడు

లోక్‌సభ సమన్వయ సమావేశాల నిర్వహణకు కేసీఆర్ ఆదేశం

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా 30 నాటికి పూర్తి చేయాలని సూచన

హైదరాబాద్ ఎంపీ స్థానానికి గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఎంపిక

సాక్షి, హైదరాబాద్: పార్టీ అభ్యర్థులంతా ఖరారైన నేపథ్యంలో ప్రచారంలో దూకుడు పెంచాలని, క్షేత్రస్థాయి శ్రేణులను సన్నద్ధం చేయాలని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం నుంచి లోక్‌సభ స్థానాల పరిధిలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు సమన్వయకర్తలుగా వ్యవహరించే ఈ భేటీలకు పార్టీ ఎంపీ అభ్యర్థులు హాజరవుతారని వివరించారు. ఈ నెల 30వ తేదీలోగా ఈ భేటీలను పూర్తిచేసి క్షేత్రస్థాయి ప్రచారంపై దృష్టి సారించాలని అభ్యర్థులను ఆదేశించారు. మరోవైపు మూడు రోజుల పాటు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం, కరువు పరిస్థితులను పరిశీలించి నివేదిక ఇవ్వాలని పార్టీ నేతలకు మిగతా 2వ పేజీలో ▶

• బీజేపీ

'యాక్షన్' ప్లాన్‌తో.. రెట్టించిన ఉత్సాహం

మిగతా పార్టీలకన్నా ముందే అభ్యర్థుల ఖరారు

రెండు దశల్లో ప్రచారానికి కార్యాచరణ

పోలింగ్ బూత్ స్థాయిలో ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ప్రణాళిక

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో 'ఎలక్షన్ యాక్షన్ ప్లాన్' రెడీకావడంతో బీజేపీ రెట్టించిన ఉత్సాహంతో కార్యక్షేత్రంలోకి దిగుతోంది. రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్‌ల కంటే ముందుగానే అభ్యర్థుల ఎంపిక పూర్తి చేసింది. ఎన్నికల సన్నద్ధతలో ఏమాత్రం ఆలస్యం చేయకుండా, అన్ని స్థాయిల్లోని నాయకులు, కార్యకర్తల మధ్య మెరుగైన సమన్వయం సాధించేందుకు కసరత్తు మొదలుపెట్టింది. పోలింగ్ బూత్ స్థాయి నుంచీ ప్రజల మద్దతు కూడగట్టేలా జాతీయనాయకత్వం పకడ్బందీ కార్యాచరణను రూపొందించింది. ఈ క్రమంలో భారీ ఎత్తున 'ఓటర్ మాస్ కాంటాక్ట్ ప్రోగ్రామ్' ద్వారా ఇంటింటి ప్రచారం చేపట్టాలని.. ప్రతీ ఓటర్‌ను కలసి పార్టీ అభ్యర్థికి ఓటేసేలా ఒప్పించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసింది. ప్రతి లోక్‌సభ స్థానం పరిధిలో శాసనసభ మిగతా 2వ పేజీలో ▶

బెదిరింపుల దందా!

ట్యాపింగ్ టీమ్ అక్రమ వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి

పలు కంపెనీల అధినేతలు, రియల్టర్లు, బిల్డర్లు, జ్యువెలర్ల ఫోన్లపై నిఘా



- ట్యాపింగ్ నేపథ్యంలో తెలుసుకున్న సమాచారం ఆధారంగా బెదిరింపులు
- వారి వ్యక్తిగత జీవితం, బలహీనతలు ఆసరాగా వసూళ్లు
- పలువురు ఐపీఎస్‌లతో పాటు ఐఏఎస్ అధికారుల పైనా నిఘా వేశారంటున్న సిట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా అక్రమ ట్యాపింగ్‌కు పాల్పడిన మాజీ ఓఎస్డీ టి.ప్రభాకర్‌రావు అండ్ టీమ్ సాగించిన దందాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ప్రతిపక్ష నేతలు, కీలక వ్యక్తులు, వారి కుటుంబీకులపై నిఘా ఉంచడంతో పాటు, ట్యాపింగ్ సందర్భంగా తెలుసుకున్న సమాచారం ఆధారంగా పలు కంపెనీలు, పలువురు రియల్టర్లు, బిల్డర్లు, జ్యువెలర్స్‌ను బెదిరించి భారీ స్థాయిలో వసూళ్లకు పాల్పడినట్లు సిట్ అధికారులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించిన ప్రాథమిక ఆధారాలు సైతం లభించినట్లు సమాచారం.

అనుకోకుండా దొరికిన అవకాశంతో..

ప్రభాకర్‌రావుతో పాటు హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు, అదనపు ఎస్పీలు నాయిని భుజంగరావు, మేకల తిరుపతన్న, డీఎస్పీ ప్రణీత్ రావు తదితరులు.. విదేశాల నుంచి అత్యాధునిక పరికరాలు దిగుమతి చేసుకున్న తర్వాత కొన్నాళ్ల వరకు వాటిని కేవలం విపక్షాలపై నిఘా కోసమే వాడారు. అయితే వారి ఫోన్లు రికార్డు చేస్తుండగా వెలుగులోకి వచ్చిన అంశాలను గమనించిన తర్వాత, వాటిని ఆర్థిక లబ్ధికి అనుకూలంగా మార్చుకోవాలని భావించారు. తమ వద్ద మిగతా 3వ పేజీలో ▶

డీజీపీ స్థాయి వారి ఫోన్లూ ట్యాప్

ఈ ట్యాపింగ్ టీమ్ పోలీసు విభాగంలోని వారిని కూడా వదిలిపెట్టలేదు. ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ఆయనకంటే తక్కువ, ఎక్కువ హోదాల్లో ఉన్న వారి ఫోన్లనూ ట్యాప్ చేసినట్లు సమాచారం. పలువురు ఐపీఎస్‌లతో పాటు ఐఏఎస్ అధికారుల పైనా నిఘా ఉంచినట్లు తెలిసింది. నగర పోలీసు కమిషనర్‌గా పని చేసి డీజీపీగా వెళ్లిన ఓ అధికారి సైతం ప్రభాకర్‌రావు చర్యల్ని అడ్డుకోలేకపోయారు. దీంతో ఆయన ఓ దశలో సాధారణ ఫోన్, వాట్సాప్‌లు కాకుండా సిగ్నల్ యాప్ వాడాలని ఎస్పీలు, ఇతర అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఆయనతో పాటు అప్పట్లో ఐజీలు, డీఐజీలుగా పని చేసిన వాళ్లు కూడా దీని ద్వారానే ఎస్పీలతో సంప్రదింపులు జరిపారంటే వారి అభద్రతా భావాన్ని అంచనా వేయవచ్చని ఓ అధికారి వ్యాఖ్యానించారు. కాగా శనివారం అరెస్టు అయిన అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నలను తదుపరి దర్యాప్తు నిమిత్తం 10 రోజుల కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పంజగుట్ట పోలీసులు మంగళవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు.



మనవడితో హోలీ ఆడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు - బంజారాహిల్స్



హోలీ వేళ రంగులు చల్లుకోవడం సహజం. కానీ, నిజామాబాద్ జిల్లా హున్సా గ్రామంలో పిడిగుద్దులాట ఆడతారు. సోమవారం ఒకరినొకరు పిడికిలి బిగించి కొట్టుకున్న జనం.. తర్వాత ఆలింగనం చేసుకుని హోలీ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. -5లో

పంటల బీమాకు కేంద్రం ఓకే

రాష్ట్ర ప్రభుత్వ విన్నపానికి అంగీకారం

- రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన అమలుకు ఏర్పాట్లు
- వచ్చే వానాకాలం సీజన్ నుంచి అమలు చేసే అవకాశం



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోనూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం అమలులోకి రానుంది. వచ్చే వానాకాలం సీజన్ నుంచి ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు అనుమతి కోరుతూ కేంద్రానికి లేఖ రాసింది. దీనికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. వచ్చే సీజన్ నుంచి అమలు చేయాలంటే తక్షణమే పథకాన్ని అమలు చేసే కంపెనీలను టెండర్ల ద్వారా ఆహ్వానించాలి. దీనికి నోటిఫికేషన్ జారీ చేయాలి. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇప్పుడు టెండర్ నోటిఫికేషన్ ఇవ్వాలంటే ఎన్నికల కమిషన్ అనుమతి తప్పనిసరి. పంటల బీమా పథకం ప్రారంభం అనేది ఎంతోమంది రైతులను ప్రభావితం చేయనున్నందున ఈసీ అనుమతి లేనిదే ముందుకు సాగలేమని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ఈసీ అనుమతి ఇవ్వకుంటే ఈ పథకం వచ్చే సీజన్ నుంచి అమలు మిగతా 5వ పేజీలో ▶

రాష్ట్రంలో తగ్గిన విద్యుత్ వినియోగం



రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పడిపోయింది. ఈ నెల 8న రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా 15,623 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదు కాగా, తాజాగా ఆదివారం నాటికి 13,769 మెగావాట్లకు తగ్గిపోయింది. అకాలవర్షాలతో వేసవి తాపం కొంత తగ్గగా, వ్యవసాయ విద్యుత్ వినియోగమూ స్వల్పంగా తగ్గింది. దీంతో రెండు వారాలుగా గరిష్ట విద్యుత్ డిమాండ్ తగ్గుముఖం పట్టిందని ట్రాన్స్‌కో వర్గాలు తెలిపాయి.

- వివరాలు 14లో



రిజర్వుడు స్థానాలు పోగా మిగిలిన జనరల్ స్థానాల్లో 40 శాతం సీట్లను బీసీలకే ఇచ్చిన సీఎం జగన్

- రాజ్యాంగపరంగా రిజర్వేషన్లు లేకున్నా బలహీన వర్గాలకు 48 శాసనసభ, 11 ఎంపీ సీట్లు
- అసెంబ్లీ, ఎంపీ కలిపి మొత్తం 200 స్థానాల్లో.. 100 సీట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకే
- 156 శాసనసభ, 20 ఎంపీ అభ్యర్థులను ఖరారు చేసిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి.. 33 శాసనసభ, 4 లోక్‌సభ స్థానాల్లోనే బీసీలకు చాన్స్.. బదుగులకు ఇచ్చింది 23 శాతమే

10లో

ఇదండీ సంగతి



ఎక్కడో ఓ చోట అతనికి టికెటివ్వండి సార్! లేకుంటే కొంపమునిగేట్లుంది!

ఫామ్ ల్యాండ్ బురిడీ

భువనగిరిలో నిబంధనలకు పలు రియల్ ఎస్టేట్ సంస్థల తూట్లు

వందల సంఖ్యలో అనధికార లేఅవుట్‌లు

సహకరిస్తున్న రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు

రూ.కోట్లలో ఆదాయం కోల్పోతున్న స్థానిక సంస్థలు, ప్రభుత్వం

అన్ని అనుమతులూ ఉన్నాయని కొనుగోలుదారులను మోసగిస్తున్న వైనం




ఆత్మకూర్(ఎం) రాయల్ గార్డెన్2లో ఫామ్‌ల్యాండ్ లేఅవుట్‌లో పెంచుతున్న శ్రీగంధం చెట్లు

సాక్షి, యాదాద్రి: ధరణిలోని లొసుగులను ఆసరాగా చేసుకున్న యాదాద్రి భువనగిరి జిల్లాలోని కొన్ని రియల్ ఎస్టేట్ సంస్థలు.. అధికారులతో కుమ్మక్కై ప్రధానంగా ఫామ్ ల్యాండ్ వెంచర్లు, అలాగే అనధికారిక లేఅవుట్లు, చట్టవిరుద్ధ రిజిస్ట్రేషన్లు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నాయి. స్థానిక సంస్థల స్థిరాస్తి ఆదాయానికి, అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి మిగతా 2వ పేజీలో ▶

70 ఎకరాల్లో అనధికార లేఅవుట్

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం ధర్మపురం రెవెన్యూ శివారులో శ్రీసిద్ధి వినాయక ప్రాపర్టీ డెవలపర్స్.. రాయల్ గార్డెన్-2 ఫామ్ ల్యాండ్ పేరుతో సర్వే నంబర్లు 26 నుంచి 28 వరకు, అలాగే 30 నుంచి 38 వరకు, 42, 49ల్లోని సుమారు 70 ఎకరాలు అనధికారికంగా లేఅవుట్ చేశారు. డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదు. వ్యవసాయ భూమిని కేవలం వ్యవసాయేతర భూమిగా మార్చి (నాలా కన్వర్షన్), 60, 40, 30 ఫీట్ల రోడ్లు వేసి, విద్యుత్ స్తంభాలు నాటి గజం రూ.4,600 చొప్పున విక్రయిస్తున్నారు. నిబంధనలు అతిక్రమించి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఓ 300 గజాల ప్లాట్ (నం.806)ను మోత్కూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో (డాక్యుమెంట్ నంబర్ 4716/19) సర్వే నంబర్లు మొత్తం వేసి రిజిస్టర్ చేశారు. ఈ ఒక్క వెంచర్‌లోనే వివిధ విస్తీర్ణాల్లో 2 వేలకు పైగా ప్లాట్లు ఉన్నాయి.



మిడ్‌మానేరు (సిరిసిల్ల జిల్లా కొదురుపాక)	సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	మార్చి 25, 2023
▶	27.50	9.43	19.42 (టీఎంసీల్లో)

ఎండలు మండుతున్నాయి. ప్రాజెక్టులు అడుగంటుతున్నాయి. పంటలు ఎండుతున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులన్నీ నీళ్లులేక వెలవెలబోతున్నాయి.

ప్రధాన ప్రాజెక్టుల నీటి మట్టాల వివరాలు.. -3,5లో

క్లుప్తంగా...

కవిత అరెస్టు రాజకీయ డ్రామా: పొన్నం



జహీరాబాద్: ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం రాజకీయ డ్రామా అని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కవిత అరెస్టుతో సానుభూతి కోసం బీఆర్‌ఎస్ ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 17 స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో సైతం కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి రావడం ఖాయమన్నారు. తెలంగాణ ఉద్యమం అంటే తెలియని ఎంపీ బీబీ పాటిల్‌ను బీఆర్‌ఎస్ నుంచి దిగుమతి చేసుకుని బీజేపీ జహీరాబాద్ ఎంపీ టికెట్ ఇచ్చిందని విమర్శించారు. మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ ఉద్యమంలో పాల్గొని తమతో కలిసి పోరాడారని చెప్పారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ అన్న విధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణకు ప్రధాని చేసిందేమీ లేదన్నారు.

ఓటమి భయంతోనే ప్రతిపక్షాలపై తప్పుడు కేసులు



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి భయంతోనే ప్రతిపక్షాలపై ప్రధాని నరేంద్రమోదీ నిఘా సంస్థలను ఉసిగొలిపి తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. మోదీ జేబు సంస్థలుగా ఈడీ, ఏటీఎం కార్డులుగా కార్పొరేట్ కంపెనీలు మారాయని సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. సీఎం అని కూడా చూడకుండా కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ప్రభుత్వాలపై కక్షగట్టి, గవర్నర్ల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు సాగకుండా ఆటంకం కలిగిస్తున్నారని జూలకంటి మండిపడ్డారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చరిత్రాత్మకం

- ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి



ముషీరాబాద్ (హైదరాబాద్): రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకమని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఇక్కడ జరిగిన ఓసీ సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయకుండా రెడ్లను నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తూ నిర్ణయించడం హర్షించదగ్గ పరిణామం అని పేర్కొన్నారు. రాష్ట్రంలోని నిరుపేద రెడ్లను ఆదుకునేందుకు వెంటనే రూ.2 వేల కోట్లు విడుదల చేయాలని, నిరుపేద ఓసీల అభివృద్ధికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పొందేందుకు సర్టిఫికెట్ల జారీలో నిబంధనలు సరళీకృతం చేయాలన్నారు. ఉచిత విద్యుత్, గ్యాస్ సిలిండర్‌కు రాయితీ తదితర పథకాల లబ్ధి పొందేందుకు పేద రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు అనర్హులుగా మిగిలిపోతున్నారని కరుణాకర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో రెడ్డి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు పటోళ్ల నాగిరెడ్డి, ఓసీ సంక్షేమ సంఘం నేత కరుణాకర్‌రెడ్డి, రెడ్డి సంక్షేమ నాయకుడు ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామిరెడ్డి, మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

77 ఏళ్ల వయసు.. 1,600 కిలోమీటర్లు

- హైదరాబాద్ నుంచి ఢిల్లీకి కాంగ్రెస్ వీరాభిమాని సైకిల్ యాత్ర



సాక్షి, న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయభేరి మోగించాలన్న ఆకాంక్షతో ఆ పార్టీ వీరాభిమాని రాములు గౌడ్ హైదరాబాద్ నుంచి ఢిల్లీకి సైకిల్ యాత్ర చేశారు. 77 ఏళ్ల రాములు 18 రోజులపాటు 1,600 కిలోమీటర్లు ప్రయాణించి సోమవారం ఢిల్లీకి చేరుకున్నారు. ఉప్పల్ రామంతాపూర్‌కు చెందిన రాములు గౌడ్ ఈనెల 6న సైకిల్ యాత్ర మొదలుపెట్టారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్‌లో జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. 18 రోజుల సైకిల్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసి రాములుగౌడ్ సోమవారం ఢిల్లీకి చేరుకున్నారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తాను ఢిల్లీకి చేరుకున్నానని, కాంగ్రెస్ పార్టీ పెద్దలు సోనియా, రాహుల్ గాంధీలను కలిసేందుకు పార్టీ నేతలు సహకరించాలని ఈ సందర్భంగా రాములు గౌడ్ కోరారు. గతంలోనూ ఎయిడ్స్‌పై అవగాహన కోసం, స్వచ్ఛభారత్ ప్రచారం కోసం రెండుసార్లు రాములు గౌడ్ హైదరాబాద్–ఢిల్లీ సైకిల్ యాత్ర చేశారు.

మరోసారి కస్టడీనా.. బెయిలా?

- ముగిసిన ఎమ్మెల్సీ కవిత ఈడీ కస్టడీ
- నేడు కోర్టులో హాజరు పరచనున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు
- కస్టడీతో పాటు బెయిల్ పిటిషన్‌పై కూడా వాదనలు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో ఆరోపణలను ఎదుర్కొంటూ ఈడీ కస్టడీలో ఉన్న ఎమ్మెల్సీ కవిత కస్టడీ సోమవారంతో ముగిసింది. మంగళవారం ఉదయం కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టులో హాజరుపరచనున్నారు. ఈనెల 15న కవితను అరెస్టు చేసిన ఈడీ అధికారులు మరుసటి రోజు కోర్టులో హాజరుపరచగా.. కోర్టు ఆమెకు ఏడు రోజుల పాటు ఈడీ కస్టడీకి ఇచ్చింది. అనంతరం శనివారం మరోసారి కవితను కోర్టులో హాజరుపరచిన ఈడీ అధికారులు మరిన్ని రోజులు తమకు కస్టడీకి ఇవ్వాలంటూ కోరారు. దీంతో మరో మూడు రోజుల పాటు కస్టడీ విధిస్తూ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. పదిరోజుల పాటు కవితను పలు అంశాలపై ఈడీ అధికారులు విచారించారు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణం ప్రారంభ దశ నుంచి ఒక్కో పాయింట్‌ను కవితను అడుగుతూ అధికారులు విచారించారు. ఈ కేసులో ఇతర నిందితులతో కవిత జరిపిన వాట్సాప్ చాటింగ్ అంశంపై తొలిరోజు ఆమెను విచారించారు. ఈ కేసులో అరెస్టు అయిన వారితో ఏరకమైన సంబంధాలు ఉన్నాయి, వారిని ఎక్కడెక్కడ కలిశారు, వారికి కవితకు మధ్య ఏవిధమైన సంభాషణ జరిగిందనే విషయాలపై విచారణ జరిగింది. వీటితో పాటు ఈ కేసులో అప్రూవర్‌లుగా మారిన వాళ్లు ఇచ్చిన సమాచారాన్ని ఆమె ముందు ఉంచి ఒక్కో ప్రశ్న అడిగారు. వీటిలో కొన్ని ప్రశ్నలకు సమాధానాలను ఇచ్చిన కవిత, మరికొన్ని ప్రశ్నలకు సమాధానాలను దాటవేసినట్లు సమాచారం.

మరికొద్ది రోజులు కస్టడీ కోరనున్న ఈడీ!

కవిత నుంచి మరింత సమాచారం రాబట్టే పనిలో ఉన్న ఈడీ అధికారులు మంగళవారం విచారణ సందర్భంగా మరికొన్ని రోజులు కస్టడీకి ఇవ్వాలంటూ కోర్టును కోరే అవకాశం ఉన్నట్లు అధికారుల నుంచి తెలుస్తోంది. ఇదే సందర్భంలో కవిత అరెస్టు అక్రమం అంటూ ఆమె తరఫు న్యాయవాదులు కోర్టులో పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ రెండు వాదనలను రౌజ్ అవెన్యూ కోర్టు మంగళవారం వినే అవకాశం ఉంది. దీంతో కవితను కోర్టు మరోసారి ఈడీ కస్టడీకి ఇస్తుందా లేక, జ్యుడీషియల్ కస్టడీ విధిస్తుందా? ఈ రెండూ కాక బెయిలు మంజూరు చేస్తుందా? అనే అంశాలపై నేడు స్పష్టత వస్తుందని చెపుతున్నారు.

కవితను కలిసిన భర్త అనిల్

ఈడీ కస్టడీలో ఉన్న ఎమ్మెల్సీ కవితను సోమవారం రాత్రి భర్త అనిల్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, న్యాయవాది మోహిత్‌రావు, పీఏ శరత్‌లు కలిశారు. సుమారు గంట పాటు కవితతో మాట్లాడారు. తొలుత కవిత భర్త అనిల్ ఆమె యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పినట్లు సమాచారం. అలాగే తాము అంతా అండగా ఉన్నామంటూ వద్దిరాజు రవిచంద్ర భరోసా ఇచ్చినట్లు తెలిసింది. మంగళవారం కవితను కోర్టులో హాజరుపరచనున్న నేపథ్యంలో.. న్యాయవాది మోహిత్‌రావు ఆమెతో పలు విషయాలను చర్చించినట్లు సమాచారం. ఈ చర్చల్లో ఆమె పీఏ శరత్ కూడా పాల్గొన్నారు.

గోవా క్యాంప్‌లో కేటీఆర్



గోవాలో ఏర్పాటు చేసిన శిబిరంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ చల్లా, ఎంపీ అభ్యర్థులు మన్నె, ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ తదితరులు

- బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులతో భేటీ
- సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని దిశానిర్దేశం
- రసవత్తరంగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఉపపోరు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: సిట్టింగ్ ఎమ్మెల్సీ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకోవాలని బీఆర్‌ఎస్ తీవ్రంగా పావులు కదుపుతోంది. ఇప్పటికే బీఆర్‌ఎస్ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లను గోవాకు తరలించారు. ఈ క్రమంలో గోవా క్యాంప్‌లో ఉన్న బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం సమావేశం కావడం హాట్‌టాపిక్‌గా మారింది. సిట్టింగ్ ఎమ్మెల్సీ స్థానాన్ని నిలబెట్టుకోవాలని, ఎవరికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా పార్టీ చూసుకుంటుందని హామీ ఇచ్చినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. సిట్టింగ్ ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకోవడం ద్వారా పార్లమెంట్ పోరులో ముందంజలో ఉంటామని.. ప్రతి ఒక్కరూ పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చినట్టు తెలిసింది. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పరిధిలో మొత్తం 1,439 ఓట్లు ఉన్నాయని.. ఇందులో వెయ్యికి పైగా ఓటర్లు బీఆర్‌ఎస్‌కు చెందిన వారేనని.. నవీన్‌కుమార్‌రెడ్డి గెలుపు ఖాయమని.. ఇందులో ఎలాంటి సందేహం లేదని.. ఎలాంటి ప్రలోభాలకు లొంగొద్దని.. వారిలో ఆత్మస్థైర్యం నింపేలా దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. కేటీఆర్ వెంట మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థులు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్

మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికను అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఈ నెల 28న పోలింగ్ జరగనుండగా.. ఆయా పార్టీలు ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లను ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యాంప్‌లకు తరలించాయి. బీఆర్‌ఎస్ గోవా, ఊటీ.. కాంగ్రెస్ గోవాతో పాటు ఏపీ, కర్ణాటకలో శిబిరాలు ఏర్పాటు చేసినట్టు సమాచారం. 100 మంది వరకు స్థానిక సంస్థల్లో ఓటర్లుగా ఉన్న బీజేపీ సైతం కొడైకెనాల్‌లో క్యాంప్ ఏర్పాటు చేయడం పోరు తీవ్రతకు అద్దం పడుతోంది. బీఆర్‌ఎస్ నుంచి మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ నవీన్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి యువ పారిశ్రామికవేత్త, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మన్నె జీవన్‌రెడ్డి పోటీపడుతున్నారు.

ఫామ్ ల్యాండ్ బురిడీ...

▶ మొదటి పేజీ తరువాయి

రూ.కోట్లలో గండి కొడుతున్నాయి. వాస్తవానికి అనధికారిక లే అవుట్లను అదుపు చేయడంతో పాటు, ఆదాయానికి గండి పడకుండా, ప్రజలు రియల్టర్ల మోసాల బారిన పడకుండా ప్రభుత్వం మెమో జారీ చేసింది. దీని ప్రకారం తహసీల్దార్ కార్యాలయంలో 0.20 ఎకరాల కంటే తక్కువ రిజిస్ట్రేషన్ చేయకూడదు. కానీ గుంట, రెండు గుంటల భూమిని కూడా ఫామ్ ల్యాండ్ వెంచర్ల కింద రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. అదేవిధంగా తహసీల్దార్ ఇచ్చిన నాలా కన్వర్షన్ పత్రాలతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్లాట్లను 2000 చదరపు గజాల కంటే తక్కువ రిజిస్ట్రేషన్ చేయకూడదు. కానీ 121 (గుంట), 242 (రెండు గుంటలు) గజాల ప్లాట్లనూ రిజిస్టర్ చేస్తున్నారు. అలాగే డీటీసీపీ, హెచ్‌ఎండీఏ, రెరా, వైటీడీఏల అప్రూవ్డ్ లేఅవుట్లలోనే ఆయా వెంచర్లకు సంబంధించిన మొత్తం సర్వే నంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేయాలి. కానీ ఓపెన్ ప్లాట్లకు నాలా కన్వర్షన్‌తో 121, 242, 363 గజాల ప్లాట్లకూ వెంచర్‌కు సంబంధించిన అన్ని సర్వే నంబర్లు వేసి, ఆ ప్లాటు చుట్టూ హద్దులు ఇతర ప్లాట్లకు సంబంధించిన నంబర్లు వేయడం ద్వారా అన్ని అనుమతులున్నాయని కొనుగోలుదారులను నమ్మిస్తూ ఫామ్ ల్యాండ్ పేరుతో యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు చేసేస్తుండటం గమనార్హం.

కొనుగోలుదారులకు ఎర: ఎలాంటి అనుమతులు లేకుండా కొత్త కొత్త పేర్లతో వేల ఎకరాల్లో లేఅవుట్‌లు అభివృద్ధి చేస్తున్నారు. కొనుగోలుదారులను ఆకర్షించడానికి వారాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే వెంచర్ ప్రారంభోత్సవం రోజునే ప్లాటు కొనుగోలు చేసిన మొదటి 50 మందికి నెలకు రూ.10 వేల చొప్పున 30 నెలల పాటు రెంటల్ చెల్లిస్తామని ఆఫర్ ఇస్తూ పెద్దయెత్తున ప్రచారం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

ఈ అక్రమ వ్యాపారంతో ప్రభుత్వానికి, స్థానిక సంస్థల ఆదాయానికి భారీగా గండి పడుతోంది. రియల్టర్లు డెవలప్‌మెంట్ చార్జీల చలాన్ల నిమిత్తం ఎకరానికి సుమారు రూ.లక్ష చొప్పున చెల్లించకుండా, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు 10 శాతం స్థిరాస్తి భూమిని గిఫ్ట్ డీడ్ చేయకుండా ఎగవేస్తున్నారు. గతంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జారీ చేసిన జీఓ ప్రకారం అప్పటి కలెక్టర్ పమేలా సత్పతి ఫాంల్యాండ్ రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేయడంతో కొంతకాలం నిలిచిపోయినా తిరిగి ఊపందుకున్నాయి.

900 వరకు అక్రమ వెంచర్లు!

జిల్లాలో ఫామ్ ల్యాండ్ పేరుతో వ్యాపారం చేస్తున్న సుమారు 900 వరకు అక్రమ వెంచర్లు ఉన్నట్లు అంచనా. యాదగిరిగుట్ట, ఆలేరు, భువనగిరి, చౌటుప్పల్, ఆత్మకూర్(ఎం) వలిగొండ, రాజాపేట, తుర్కపల్లి, బొమ్మలరామారం, బీబీనగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో అక్రమ వెంచర్లు సాగుతున్నాయి. ప్రధానంగా వంగపల్లి, సర్వేపల్లి, కాచారం, రఘునాథపురం, కొలనుపాక, యాదగిరిపల్లి, సైదాపురం, పెద్ద కందుకూరు శ్రీనివాసాపురం, పటేల్‌గూడెం, గుండ్లగూడెం ఆలేరులలో ఫామ్ ల్యాండ్ ప్లాట్లను నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.


ఇంటి నిర్మాణం కుదరదు..రుణం రాదు

ఫామ్ ల్యాండ్ పేరుతో రిజిస్ట్రేషన్లు జరిగిన ప్లాట్లలో ప్రధానంగా ఇంటి నిర్మాణాలకు అనుమతి లభించదు. డీటీసీపీ అనుమతి లేనందున బ్యాంకు రుణం రాదు. కొనుగోలుదారు ప్లాటు పొజిషన్‌కు స్థానిక సంస్థలు చట్టబద్ధతను సైతం ఇవ్వడం లేదు.

> **నా దృష్టికి రాలేదు**
>
> ఫామ్ ల్యాండ్ పేరుతో రిజిస్ట్రేషన్ల విషయం మా దృష్టికి రాలేదు. ధరణి పాస్‌బుక్‌తో స్లాట్ బుక్ చేసుకుంటే రిజిస్ట్రేషన్ చేస్తాం. రాయల్ గార్డెన్ –2 ఫామ్ ల్యాండ్ ప్లాట్‌ల రిజిస్ట్రేషన్‌ల గురించి నాకు ఏమీ తెలియదు. అలాంటిది ఏమైనా ఉంటే పంచాయతీరాజ్ అధికారులు చూస్తారు.
>
> **బి. రవికుమార్, తహసీల్దార్ ఆత్మకూర్ (ఎం)**

రైతులకు మేలు చేయండి: హరీశ్

- పంటలు ఎండుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు
- నేటి నుంచి బీఆర్‌ఎస్ నేతలు పంట పొలాలను పరిశీలిస్తారు...రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వకుంటే సచివాలయం ముట్టడి
- రుణాల వసూలు కోసం బ్యాంకుల నోటీసులతో ఒత్తిడిలో రైతులు



సాక్షి, హైదరాబాద్: పంటలు ఎండుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం రాజకీయాలు మాని రైతులకు మేలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలసి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఒక్కో రైతు 4–5 బోర్లు వేసి నష్టపోతున్నారని, తండాల్లో కనీసం తాగునీరు కూడా లేదని తన క్షేత్రస్థాయి పరిశీలనలో తేలిందన్నారు. 180 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడినా ప్రభుత్వం పరిశీలనకు కనీసం అధికారుల బృందాన్ని కూడా పంపడం లేదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

లీగల్ నోటీసులతో ఒత్తిడిలో రైతాంగం...

ఓవైపు కరువు కోరల్లో చిక్కుకొని రైతులు అప్పుల పాలవుతుంటే మరోవైపు బ్యాంకు అధికారులు లీగల్ నోటీసులు ఇస్తున్నారని హరీశ్ పేర్కొన్నారు. రుణమాఫీపై సీఎం రేవంత్ ఇచ్చిన హామీతో తమకు సంబంధం లేదని అందోల్ నియోజకవర్గం రేగోడ్ మండలంలో బ్యాంకర్లు స్పష్టం చేయడాన్ని హరీశ్ ప్రస్తావించారు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లుగా బ్యాంకు అధికారులు వ్యవహరిస్తున్నా సీఎం స్పందించడం లేదని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు నాలుగు ప్రధాన హామీలు ఇచ్చి నట్టేట ముంచిన కాంగ్రెస్.. లోకసభ ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతుందని హరీశ్‌రావు ప్రశ్నించారు.

పరిహారం ఇవ్వకుంటే సచివాలయం ముట్టడి..

మంగళవారం నుంచి మూడు రోజులపాటు క్షేత్రస్థాయిలో పంట పొలాలు పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిందిగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశించినట్లు హరీశ్‌రావు తెలిపారు. నష్టపోయిన రైతాంగానికి వెంటనే ఎకరాకు రూ. 25 వేల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో లక్ష మంది రైతులతో సచివాలయాన్ని ముట్టడిస్తామన్నారు. వరి కొనుగోలులో క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వకుంటే కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రైతులెవరూ రుణాలు చెల్లించొద్దని, ఒత్తిడిలో ఉన్న రైతాంగానికి తాము అండగా ఉంటామని హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. ఎన్నికల కోడ్ ఉన్నా రైతులకు పరిహారం ఇస్తే తాము కాంగ్రెస్ తరహాలో రాజకీయాలకు పాల్పడబోమని హామీనిచ్చారు.

'పాంచ్ న్యాయ్'తో గోదాలోకి కాంగ్రెస్!

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్రాలకు సంబంధించిన అంశాల ఆధారంగా కాంగ్రెస్ అధిష్టానం ముందుకు వెళ్తున్న నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్‌పై మరింత బాధ్యత ఉందని టీపీసీసీ కీలక నేతలు అంటున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు గెలుచుకోవాలనే పట్టుదలతో ముందుకెళ్తున్నట్టు చెప్తున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి లోక్‌సభ స్థాయి పార్టీ సమావేశంలో ఈ విషయాన్ని నాయకులకు వివరిస్తున్నారని గుర్తు చేస్తున్నారు.

రెండు రాష్ట్రాల్లో 'గ్యారంటీ'లతో..

కాంగ్రెస్ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఐదు గ్యారంటీ హామీలు ఇచ్చింది. అక్కడ విజయం సాధించిన తర్వాత జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆరు గ్యారంటీలను ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామని అధిష్టానం పెద్దలు స్వయంగా హామీ ఇచ్చారు కూడా. ఇది ప్రభావం చూపించి తెలంగాణలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇలా రెండు రాష్ట్రాల్లోనూ 'గ్యారంటీ' హామీలు ప్రభావవంతంగా పనిచేయడంతో.. జాతీయ స్థాయిలోనూ ఈ అంశంపై దృష్టి పడిందని కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు.

రాష్ట్రంలో ఎక్కువ సీట్లపై ఆశలు

తెలంగాణలో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లోని 13 అంశాలకు సంబంధించి ఐదు అంశాలను ఇప్పటికే అమల్లోకి తెచ్చామని, దీనితో ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ను ఆశీర్వదిస్తారని ఆ పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. పార్టీ అధిష్టానం 'పాంచ్ న్యాయ్' హామీలను ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారని అంటున్నాయి. వచ్చే నెల మొదటి వారంలో హైదరాబాద్ నగర శివార్లలో నిర్వహించే భారీ బహిరంగసభలో ఏఐసీసీ మేనిఫెస్టోను తెలుగులో ఆవిష్కరించి మరింతగా ప్రజల్లోకి తీసుకెళతామని పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షల పెంపు హామీలను అమలు చేశామని మంత్రులు, పార్టీ నేతలు చెప్తున్నారు.

మహిళలు, బీసీలను ఆకట్టుకునేలా..

'గ్యారంటీ'ల స్ఫూర్తితో దేశంలోని ప్రతి పేద కుటుంబంలోని ఒక మహిళకు ఏటా రూ.లక్ష ఆర్థిక సాయం చేస్తామని.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ జాతీయ నేతలు ప్రకటించారని రాష్ట్ర కాంగ్రెస్ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. ఈ హామీలు మహిళలను అమితంగా ఆకట్టుకుంటాయన్న ధీమాను రాష్ట్ర కాంగ్రెస్ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో బీసీల కులగణనకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సమాజంలో సగానికిపైగా ఉన్న బీసీ కులాల జనాభాకు దశాదిశను నిర్దేశిస్తుందన్న అభిప్రాయం ఉందని చెప్తున్నాయి. ఇదే తరహాలో దేశమంతటా కులగణన చేపట్టడాన్ని కాంగ్రెస్ ఎన్నికల ప్రచారాస్త్రంగా ఎంచుకుందని వివరిస్తున్నాయి. పంటల మద్దతు ధరలకు చట్టబద్ధత, అప్పుల బాధ నుంచి రైతులకు ఉపశమనం కల్పించేందుకు శాశ్వత రైతు రుణమాఫీ కమిషన్, పంట నష్టపోయిన రైతులకు 30 రోజుల్లో బీమా పరిహారం చెల్లింపు గ్యారంటీలు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు లబ్ధి చేకూరుస్తాయని నేతలు చెప్తున్నారు. ఉపాధి హామీ పథకం కింద కనీస రోజు కూలీ రూ.400 ఇవ్వాలని తీర్మానించడం, పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ పథకం అమలు చేస్తామని ప్రకటించడం వంటివి పట్టణ ప్రాంతాల్లోని అసంఘటిత కార్మికులను ఆకర్షిస్తుందని పేర్కొంటున్నారు.

'పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా మాట్లాడితే సహించం'

సాక్షి, హైదరాబాద్: పార్టీ తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా సహించేది లేదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ క్రమశిక్షణను ఉల్లంఘించి మీడియాలో ప్రకటనలు చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. పార్టీ నిర్ణయాలను అందరూ ఆమోదించాల్సిందేనని, ఏవైనా భేదాభిప్రాయాలు ఉంటే పార్టీ వేదికగా అంతర్గతంగా తెలపాలే తప్ప.. బహిరంగంగా మీడియాకు ఎక్కడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల ఖరారుపై కొందరు పార్టీ సీనియర్ నేతలు, కొన్ని సామాజిక వర్గాల నుంచి వస్తున్న ఆరోపణల నేపథ్యంలో టీపీసీసీ ఈ నిర్ణయం తీసుకుందన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

నీరా కేఫ్‌లను నిర్వీర్యం చేసే కుట్ర: రమేశ్‌బాబు గౌడ్

సాక్షి, హైదరాబాద్: నీరా కేఫ్‌లను నిర్వీర్యం చేయడానికి కొంత మంది కుట్రలు చేస్తున్నారని తెలంగాణ నీరా పాల్మెరా ప్రొడ్యూసర్స్ డెవలప్‌మెంట్ అధ్యక్షుడు మద్దెల రమేశ్‌బాబు గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. నీరా కేఫ్‌లు 2016 నుంచి నడుస్తున్నాయని, దీన్ని రాజకీయ కోణంలో చూడొద్దని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. గౌడలు ఆర్థికంగా ఎదిగేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తోడ్పాటు అందించాలని, మళ్లీ నీరా కేఫ్‌లు నిర్వహించడానికి టెండర్లు వేయాలని విజ్ఞప్తిచేశారు.

హిందూ పండుగలు జరుపుకునే స్వేచ్ఛ లేదా?: సంజయ్



కరీంనగర్ టౌన్: మేడ్చల్ జిల్లా చెంగిచర్ల ప్రాంతంలో గిరిజన మహిళలపై రజాకార్ల వారసులు, సంఘ విద్రోహ, దేశవిచ్ఛిన్నకర శక్తుల దాడిని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. 'ఇందిరమ్మ రాజ్యమంటే ఇదేనా? ఎమర్జెన్సీ సమయంలోని ఇందిరమ్మ రాజ్యాన్ని ఇలా చూపిస్తున్నారా? కేసీఆర్ పాలనలో రజాకార్ల అరాచకాలను చూపించారు.. మీరు ఎమర్జెన్సీ టైమ్‌లో ఇందిరమ్మ పాలన చూపించాలనుకుంటున్నారా?' అని ప్రశ్నించారు. చెంగిచర్ల ఘటనపై బండి సంజయ్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హోలీ పండుగలో భాగంగా హిందువులు కాముడిని దహనం చేయడం సంప్రదాయమని, చెంగిచర్లలో ఎస్టీ సామాజిక ప్రజలు కాముడి దహనంలో భాగస్వాములైతే.. ఒక వర్గానికి చెందిన కొందరు దాడి చేయడం దుర్మార్గమన్నారు. హిందువులపై దాడులు చేసిన వారిని పోలీసులు వదిలేసి.. బాధితులపైనే లాఠీచార్జ్ చేస్తారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇలాంటి పరిస్థితిని కోరుకుంటే బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఏవిధంగా బొంద పెట్టారో.. కాంగ్రెస్‌కు అదే గతి పడుతుందని సంజయ్ హెచ్చరించారు.

'యాక్షన్' ప్లాన్‌తో.. రెట్టించిన ఉత్సాహం

▶ మొదటి పేజీ తరువాయి

నియోజకవర్గ స్థాయిలో బూత్ కమిటీల సమ్మేళనాలు, ఓటర్లతో భేటీలు చేపట్టాలని ఆదేశించింది.

రెండు దశల్లో ప్రచారానికి ప్రణాళిక

రాష్ట్రంలో రెండు దశల్లో ప్రచారంతో ఎలక్షన్ మేనేజ్‌మెంట్ వైపు బీజేపీ అడుగులు వేస్తోంది. తొలిదశలో నామినేషన్ల పర్వం ముగిసే వరకు (ఏప్రిల్ 25దాకా) రాష్ట్ర ముఖ్యనేతలు మొదలు సామాన్య కార్యకర్త వరకు అనుసరించాల్సిన రూట్‌మ్యాప్‌ను ఆదివారమే ప్రకటించింది. రెండోదశలో అంటే ఏప్రిల్ 25 నుంచి మే 13న పోలింగ్ ముగిసేదాకా పోలింగ్ బూత్ స్థాయిలో చేపట్టాల్సిన ఎలక్షన్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టేందుకు ప్రణాళిక రూపొందించింది. రాష్ట్రంలోని మొత్తం 17 ఎంపీ సీట్లకు అభ్యర్థులను ప్రకటించి.. అన్నిచోట్లా పక్కా ప్లానింగ్‌తో ప్రచార కార్యక్రమాలకు రూపకల్పన చేస్తోంది. ఈ నెలాఖరులోగా ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. పోలింగ్‌కు ఇంకా నెలన్నరకుపైగా సమయం ఉండటంతో భారీ సభల కంటే ఎక్కడికక్కడ చిన్న చిన్న సభలు నిర్వహించాలని పార్టీ పెద్దలు భావిస్తున్నారు.

పోలింగ్ బూత్ స్థాయి నుంచీ..: బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకత్వాల దృష్టి అంతా పోలింగ్ బూత్ స్థాయి నుంచీ పార్టీ బలోపేతంతోపాటు, పార్టీ కేడర్ కార్యకలాపాలపైనే పెట్టాయి. పార్టీపరంగా చేపట్టే కార్యక్రమాలన్నీ కూడా పోలింగ్ బూత్ స్థాయిలో ఎక్కువ ఓట్లు సాధించేలా చేయడాన్ని టార్గెట్‌గా పెట్టుకున్నాయి. ఈ క్రమంలో టిఫిన్ బైఠక్‌లు, ఇంటింటి ప్రచారం వంటి కార్యాచరణతో నేతలు ముందుకు వెళ్తున్నారు. దీనికితోడు యువత, విద్యార్థులు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు, రైతులతో తరచూ సమావేశాలు నిర్వహించడం ద్వారా వారి మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రతీ ఇంటికి కనీసం మూడుసార్లు వెళ్లేలా 'హర్ ఘర్ తీన్ బార్' పేరిట కార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు.

జాతీయ, రాష్ట్రస్థాయి నేతల ప్రచారంతో..

రాష్ట్రంలో మిగతా పార్టీల కంటే ముందే తొలి విడత ఎన్నికల ప్రచారాన్ని పూర్తి చేయనుండటం, స్వయంగా ప్రధాని మోదీ, ఇతర జాతీయ నేతలు ప్రచార సభల్లో పాల్గొననుండటం బీజేపీకి కలిసి వస్తుందని ఆ పార్టీ ముఖ్యులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇది రాబోయే రోజుల్లో మరింతగా ప్రజల మద్దతు కూడగట్టేందుకు ఉపయోగపడుతుందని అంచనా వేస్తున్నారు.

నేటి నుంచి కేడర్‌తో...

▶ మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ సూచించారు.

ప్రచార షెడ్యూల్‌పై కొనసాగుతున్న భేటీలు

ఏప్రిల్ రెండో వారం నుంచి క్షేత్రస్థాయిలో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారాన్ని వేడెక్కించాలని కేసీఆర్ భావిస్తున్నారు. అందులో భాగంగా ఒక్కో లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో రెండు, మూడు బహిరంగ సభలు నిర్వహించాలని యోచిస్తున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి పరేడ్ మైదానంలో భారీ సభ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

కాంగ్రెస్, బీజేపీలు లక్ష్యంగా ఎజెండా..


ఎన్నికల ప్రచార షెడ్యూల్, ప్రచార ఎజెండా తదితరాలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేతలు హరీశ్‌రావు, మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులకు కేసీఆర్ పలు సూచనలు చేసినట్టు తెలిసింది. జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీలను లక్ష్యంగా చేసుకుని ప్రసంగాలు, ప్రచారం చేయాలని పేర్కొన్నట్టు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ హామీల ఉల్లంఘన, అప్రజాస్వామిక విధానాలు, బెదిరింపులు, వేధింపులు వంటి అంశాలను ప్రచారం చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. జాతీయ స్థాయిలో బీజేపీ నియంతృత్వం, అణచివేత విధానాలు, లౌకికత్వానికి పొంచి ఉన్న ముప్పు వంటి అంశాలనూ ఎత్తి చూపాలని భావిస్తున్నట్టు సమాచారం.

జెండా మోసిన వారికే పెద్దపీట

పార్టీ జెండా మోసిన వారికి పెద్దపీట వేస్తూ లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కసరత్తును కేసీఆర్ పూర్తి చేశారు. హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేరును సోమవారం ఖరారు చేశారు. మొత్తం 17 లోక్‌సభ సీట్లకు గాను ఇంతకుముందే నాలుగు విడతల్లో 16 మంది పేర్లను బీఆర్‌ఎస్ ప్రకటించింది. అందులో 13 మంది పార్టీలో సుదీర్ఘకాలం నుంచి పనిచేస్తున్న వారుకాగా.. ముగ్గురు గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీలో చేరినవారు. నాగర్‌కర్నూల్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఒక్కరే ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇక బీఆర్‌ఎస్ టికెట్ల కేటాయింపులో బీసీలకు ప్రాధాన్యత దక్కింది. రిజర్వ్‌డ్ స్థానాలు పోగా మిగిలిన సీట్లలో సగం బీసీలకే కేటాయించింది. మొత్తం 17 స్థానాల్లో ఎస్సీలకు మూడు (రెండు మాదిగ, ఒక మాల), ఎస్టీలకు రెండు (బంజారా, గోండులకు చెరొకటి), బీసీలకు ఆరు (మున్నూరుకాపు రెండు, ముదిరాజ్, గౌడ, యాదవ, కురుమలకు ఒక్కోటి), ఓసీలకు ఆరు (నాలుగు రెడ్డి, వెలమ, కమ్మకు చెరో స్థానం) సీట్లు కేటాయించింది.

> **కొత్త అభ్యర్థులు తెరమీదకు..!**
>
> బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీల్లో ఐదుగురు ఇతర పార్టీల్లో చేరగా.. కొందరు నేతలు కూడా పార్టీని వీడారు. ఈ క్రమంలో ముగ్గురు సిట్టింగులతోపాటు కరీంనగర్ మినహా మిగతా అన్ని స్థానాల్లో బీఆర్‌ఎస్ కొత్త అభ్యర్థులను రంగంలోకి దింపింది. ఎమ్మెల్సీ వెంకట్రామ్‌రెడ్డితోపాటు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పొందిన కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్య, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సోదరుడు కంచర్ల కృష్ణారెడ్డి తదితరులు లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగారు. ఇక అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన రాగిడి లక్ష్మారెడ్డి, కాసాని జ్ఞానేశ్వర్, గాలి అనిల్‌కుమార్‌లకు పోటీ అవకాశం దక్కింది. ఇక నేతలు పార్టీని వీడిన చోట కొత్తవారికి ఇన్‌చార్జులుగా బాధ్యతలు అప్పగిస్తున్నారు. సిర్పూరులో ఎమ్మెల్సీ విఠల్, కామారెడ్డిలో మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ఖైరతాబాద్‌లో మన్నె గోవర్ధన్‌రెడ్డిలకు సమన్వయ బాధ్యతలు అప్పగించారు.

ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు



నాగార్జునసాగర్ (నల్లగొండ జిల్లా)	సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	మార్చి 25, 2023
	312.5050	137.8642	168.1460 (టీఎంసీలు)



మల్లన్నసాగర్ (సిద్దిపేట జిల్లా తొగుట-కొండపాక)	సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	మార్చి 25, 2023
	50	9.9	12 (టీఎంసీలు)

(ప్రస్తుత పరిస్థితుల్లో బ్యారేజీని ఖాళీ చేశారు)



మేడిగడ్డ బ్యారేజీ (భూపాలపల్లి జిల్లా మహదేవపూర్)	సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	మార్చి 25, 2023
	16.17	0	6 (టీఎంసీలు)

(ప్రస్తుత పరిస్థితుల్లో బ్యారేజీని ఖాళీ చేశారు)



అన్నారం బ్యారేజీ (భూపాలపల్లి జిల్లా మహదేవపూర్)	సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	మార్చి 25, 2023
	10.87	0	5 (టీఎంసీలు)



సింగూరు (సంగారెడ్డి జిల్లా)	సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	మార్చి 25, 2023
	29.917	18.784	20.547 (టీఎంసీలు)



కొండపోచమ్మసాగర్ (సిద్దిపేట జిల్లా మర్కూక్)	సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	మార్చి 25, 2023
	15	5.5	9 (టీఎంసీలు)



రంగనాయకసాగర్ (సిద్దిపేట జిల్లా చంద్లాపూర్)	సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	మార్చి 25, 2023
	3	1.12	2 (టీఎంసీలు)

కొత్త గురుకులాలు ఇప్పట్లో లేనట్లే!

ఎన్నికల కోడ్ నేపథ్యంలో బీసీ గురుకులాలపై నిర్ణయం తీసుకోలేని సర్కార్

- దీంతో 2024–25 విద్యా సంవత్సరంలో కొత్త గురుకులాలు అనుమానమే
- ఇప్పటికే ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించిన గురుకుల సొసైటీ
- మండలానికో బీసీ గురుకులం ఏర్పాటును మేనిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్త గురుకులాల ఏర్పాటుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం లేకపోవడంతో గురుకులాల ఏర్పాటుకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. దీంతో మహాత్మా జ్యోతిభా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) సమర్పించిన ప్రతిపాదనలకు ఆమోదం లభించడానికి వేచిచూడాల్సిందేనని విద్యారంగ నిపుణులు చెపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రచారంలో భాగంగా ప్రతి మండలానికి ఒక బీసీ గురుకుల విద్యాసంస్థను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ మేనిఫెస్టోలో కూడా గురుకుల సొసైటీల అంశాన్ని ప్రస్తావించింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఆ తర్వాత మేనిఫెస్టోలోని హామీల అమలుపై దృష్టి సారించి. కొత్త గురుకులాల ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు పంపాలని బీసీ గురుకుల సొసైటీని ఆదేశించింది. ఇందులో భాగంగా కొత్త గురుకులాల ఏర్పాటు అవసరమున్న మండలాల వారీగా బీసీ గురుకుల సొసైటీ ప్రతిపాదనలు సమర్పించింది.



ప్రస్తుతం రాష్ట్రంలో 292 బీసీ గురుకులాలు..

రాష్ట్రంలో 594 మండలాలున్నాయి. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం 594 బీసీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాల్సి ఉంది. బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలో ప్రస్తుతం 292 గురుకుల పాఠశాలలు కొనసాగుతున్నాయి. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక బాలుర, ఒక బాలికల గురుకులాన్ని నిర్వహిస్తున్నారు. వీటికి అదనంగా జిల్లా కేంద్రాల్లో ఒకట్రెండు పాఠశాలలు నడుస్తున్నాయి. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రాష్ట్రంలో కొత్తగా మరో 302 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలి. క్షేత్రస్థాయిలో డిమాండ్‌కు తగినట్లుగా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న 292 బీసీ గురుకుల పాఠశాలలను మండలాల వారీగా విభజించి.. కొత్తగా ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనే కోణంలో పరిశీలన జరిపిన అధికారులు, మండలాల వారీగా ప్రాధాన్యత క్రమంలో జాబితాను తయారు చేశారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన బడ్జెట్ సన్నాహక సమావేశంలో కూడా ప్రాథమిక ప్రతిపాదనలను సమర్పించారు. ప్రస్తుతం గురుకులాల ఏర్పాటు అంశం ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది. ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంది. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ కొనసాగనుంది. దీంతో ఆలోపు ప్రభుత్వం కొత్తగా ఎలాంటి నిర్ణయాలు తీసుకునే అవకాశం లేదు. ఆ తర్వాత నిర్ణయం తీసుకున్నప్పటికీ భవనాల గుర్తింపు, నిర్వహణ ఏర్పాట్లు చేసేందుకు కనీసం మూడు నెలల సమయం పడుతుంది. దీంతో 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి కొత్త గురుకులాల ఏర్పాటుకు అవకాశం లేదని స్పష్టమవుతోంది. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ప్రభుత్వం అనుమతిస్తే వచ్చే ఏడాదిలో వీటిని అందుబాటులోకి తీసుకురావచ్చని అధికారులు చెబుతున్నారు.

బెదిరింపుల దందా!

▶ మొదటి పేజీ తరువాయి



ఉన్న టెక్నాలజీని దీని కోసం వినియోగించారు. బెదిరింపుల దందా ప్రారంభించేందుకు ప్రభాకర్‌రావు తనవారైన మరింత మందిని ఎస్ఐబీలోకి తీసుకువచ్చారు.

ఎలక్టోరల్ బాండ్లూ కొనిపించారు..

ప్రభాకర్‌రావు బృందం టార్గెట్ చేసిన వారిలో పలువురు ఫార్మా కంపెనీల యజమానులు, బడా బిల్డర్లు, నగల దుకాణాల యజమానులు, రియల్టర్లతో పాటు ప్రముఖ వ్యాపారులు ఉన్నట్లు సమాచారం. వీరి గురించిన సమాచారం తెలిసిన తర్వాత వారి కార్యాలయాలు, నివాసాల సమీపంలోకి ట్యాపింగ్ ఉపకరణాలతో బృందాలను పంపేవారు. బృందాల్లో ఉన్నవారు బాధితుల ఫోన్లలో జరిగే ప్రతి సంభాషణను రికార్డు చేసుకుని వచ్చి ప్రణీత్‌రావుకు అప్పగించేవారు. వీటిని విశ్లేషించేందుకు పర్వతనగర్‌లోని వార్‌రూమ్‌లో ఓ ప్రత్యేక బృందం పని చేసేది. ఇలా ఆయా వ్యాపారుల వ్యక్తిగత జీవితాలు, బలహీనతలు తదితరాలను గుర్తించే ప్రణీత్‌రావు.. విషయాన్ని ప్రభాకర్‌రావుతో పాటు రాధాకిషన్‌రావు దృష్టికి తీసుకువెళ్లేవారు. ఆపై రంగంలోకి దిగే వీరి సైన్యాలు వారిని బెదిరించి భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడేవారు. బెదిరింపులకు లొంగని కొందరు వ్యాపారుల వాట్సాప్‌లకు ట్యాపింగ్‌లో బయటపడిన సంభాషణల ఆడియోలను పంపి లొంగదీసుకున్నట్లు తెలిసింది. 2017–18 ఆర్థిక సంవత్సరం నుంచి ఎలక్టోరల్ బాండ్ల విధానం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో.. వివిధ రంగాలకు చెందిన వ్యాపారులు, కాంట్రాక్టర్లను బెదిరించి ఎలక్టోరల్ బాండ్లు ఖరీదు చేసేలా చేసినట్లు సమాచారం.

ఆ నలుగురూ ఉమ్మడి నల్లగొండలో పనిచేసిన వారే..

సాక్షి, యాదాద్రి: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో విచారణ ఎదుర్కొంటున్న నలుగురు పోలీస్ అధికారులు ఉమ్మడి నల్లగొండ జిల్లా పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రభాకర్‌రావు ఉమ్మడి నల్లగొండ ఎస్పీగా విధులు నిర్వర్తించారు. ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు, ఏఎస్పీలు భుజంగరావు, తిరుపతన్నలు ఇదే జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేశారు. తిరుపతన్న యాదగిరిగుట్టలో ఎస్ఐగా, భువనగిరిలో సీఐగా విధులు నిర్వర్తించారు. భుజంగరావు భువనగిరి ఏసీపీగా పనిచేశారు. ప్రణీత్ రావు బీబీనగర్, పోచంపల్లి పోలీస్‌స్టేషన్‌లలో ఎస్ఐగా పనిచేశారు. వీరి దందా వెలుగు చూసిన నేపథ్యంలో వారితో ఆ సమయంలో అంటకాగిన పోలీస్ సిబ్బందిలో ఆందోళన వ్యక్తమవుతోంది.

టెక్నాలజీ వాడకంలో భుజంగరావు దిట్ట

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన హాజీపూర్ బాలికల వరుస హత్యల నిందితుడు శ్రీనివాస్‌రెడ్డిని గుర్తించడంలో అప్పుడు డీఎస్పీగా ఉన్న నాయిని భుజంగరావు ట్యాపింగ్ సహా టెక్నాలజీ వాడకంలో తన నైపుణ్యాన్ని వినియోగించారు. కీలక సాక్ష్యాధారాలను సేకరించారు. వాటి ఆధారంగా జిల్లా కోర్టు నిందితునికి ఉరి శిక్ష విధించింది. 2021లో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మెడల్ ఫర్ ఎక్సలెంట్ ఇన్వెస్టిగేషన్ (అద్భుత పరిశోధన)తో సత్కరించింది. ప్రస్తుతం ఆయన జయశంకర్ భూపాలపల్లి అదనపు ఎస్పీగా పనిచేస్తున్నారు.

'స్పాట్' కేంద్రాల్లోకి మొబైల్ నో

ఇంటర్ బోర్డు తాజా నిర్ణయం.. మూల్యాంకనం జరిగే హాల్లో నిఘా పటిష్టం

- అధ్యాపకుల రాకపోకలు రిజిస్టర్‌లో నమోదు
- ఒక్కొక్కరికి రోజుకు 30 పేపర్లు మాత్రమే
- ఏప్రిల్ ఆఖరులో ఫలితాల వెల్లడి!



సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకనాన్ని (స్పాట్ వాల్యుయేషన్) ఇంటర్ బోర్డు మరింత కట్టుదిట్టంగా నిర్వహిస్తోంది. తాజాగా స్పాట్ కేంద్రాల్లోకి అధ్యాపకుల ఫోన్లను అనుమతించకూడదని ఆదేశించింది. గతంలో ఫోన్లను అనుమతించడం వల్ల సమస్యలు తలెత్తినట్టు ఇటీవల గుర్తించారు. ఈ నేపథ్యంలోనే స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాల్లోకి ప్రవేశించే ముందు అధ్యాపకులు తమ ఫోన్లను డిపాజిట్ చేయాలని బోర్డు స్పష్టం చేసింది. దీంతో పాటే హాలులో నిఘా వ్యవస్థను పటిష్టం చేశారు. మూల్యాంకనం చేసే సమయంలో బయటి వ్యక్తులతో ఎలాంటి సంబంధాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సమాధాన పత్రాలు తీసుకున్న దగ్గర్నుంచి, తిరిగి సంబంధిత అధికారికి ఇచ్చేవరకు హాలులోనే ఉండాలని, హాలు దాటి బయటకు వచ్చిన ప్రతిసారీ రిజిస్టర్‌లో నమోదు చేయాలని బోర్డు సూచించింది. విద్యార్థుల సమాధాన పత్రాల కోడింగ్ వ్యవస్థను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, కార్పొరేట్ కాలేజీల ప్రలోభాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకున్నామని బోర్డు అధికారులు తెలిపారు. అధ్యాపకులు చేసే మూల్యాంకన పత్రాల వివరాలు ఎప్పటికప్పుడు రాష్ట్ర కార్యాలయానికి అందేలా ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

మూల్యాంకనంలో 20 వేల మంది

ఈ ఏడాది 10 లక్షలకు పైగా విద్యార్థులు ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షలు రాశారు. మూల్యాంకనం కోసం రాష్ట్రవ్యాప్తంగా 16 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 60 లక్షల పేపర్లు ప్రస్తుతం మూల్యాంకన కేంద్రాలకు చేరగా.. సబ్జెక్టుల వారీగా దాదాపు 20 వేల మంది అధ్యాపకులు మూల్యాంకన ప్రక్రియలో నిమగ్నమయ్యారు. గతంలో ఎలాంటి ఆరోపణలు లేని ప్రభుత్వ అధ్యాపకులతో పాటు, ఇంటర్ బోర్డు గుర్తింపు పొందిన ప్రైవేటు కాలేజీల అధ్యాపకులను స్పాట్ కోసం ఎంపిక చేశామని అధికారులు చెబుతున్నారు. ఒక్కో అధ్యాపకుడికి ఉదయం 15 పేపర్లు, సాయంత్రం 15 పేపర్లు చొప్పున రోజుకు మొత్తం 30 పేపర్లు మాత్రమే మూల్యాంకనానికి ఇస్తున్నారు. దీనివల్ల నాణ్యమైన మూల్యాంకనం జరుగుతుందని పరీక్షల విభాగం అధికారులు చెబుతున్నారు.

పది రకాల పరీక్షల తర్వాతే ఆన్‌లైన్‌లోకి..

సమాధాన పత్రాలు మూల్యాకనం చేసిన అనంతరం పది రకాలుగా పరీక్షించిన తర్వాతే మార్కులను ఆన్‌లైన్‌లో ఫీడ్ చేసేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో అసిస్టెంట్ ఎగ్జామినర్ మొదలుకొని, అన్ని స్థాయిల అధికారులు సమాధాన పత్రాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. సరైన సమాధానం గుర్తించే విషయంలో ఒకరు పొరపడ్డా, మరో ఎగ్జామినర్ దాన్ని పరిశీలించడం వల్ల విద్యార్థి మార్కులు కోల్పోయే అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్ రెండో వారానికల్లా స్పాట్ పూర్తవుతుందని అధికారులు భావిస్తున్నారు. సగటు పరిశీలన తర్వాత, రెండు పరీక్షలు నిర్వహించి, సాంకేతిక లోపాలుంటే మూడో వారంలో సరిచేసుకుని నాల్గవ వారంలో ఫలితాలు వెల్లడించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు బోర్డు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఒకవేళ అలస్యమైతే ఖచ్చితంగా మే మొదటి వారంలో ఫలితాలు వెల్లడిస్తామని స్పష్టం చేశారు.

స్ఫూర్తిదాయక జర్నలిజానికి చిత్రాంజలి

- ప్రముఖ ఆర్టిస్టు విక్రమ్ రాజ్ సావటి సోలో ప్రదర్శన



వైఎస్ భారతీరెడ్డి పోట్రెయిట్ వద్ద విక్రమ్ రాజ్

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో మీడియా రంగంలో విశేష కృషి చేస్తూ సమాజ శ్రేయస్సు కోసం తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్న ప్రముఖులకు ప్రఖ్యాత తెలుగు ఆర్టిస్టు విక్రమ్ రాజ్ సావటి తన కుంచెతో చిత్రాంజలిని ప్రదర్శించారు. జర్నలిజం-మాస్ మీడియా వేదికగా పక్షపాతంలేని చట్టబద్ధమైన వార్తలను అందించడానికి కృషి చేస్తున్న స్ఫూర్తి ప్రదాతల 4X5 లైవ్ సైజ్ అతి పెద్ద ఆయిల్ పెయింటింగ్స్ వేసి నగరంలోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీ వేదికగా ఐకానో ఫ్రేమ్–2024 పేరుతో ప్రదర్శిస్తున్నారు. పోట్రెయిట్స్ ఆఫ్ పవర్ థీమ్‌తో కొనసాగుతున్న ఈ ప్రదర్శన కళాప్రియులను, మీడియా రంగ ఔత్సాహికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇందులో ఆశిష్(ఇండియా టుడే), జార్జ్ వర్గాస్(ఇండియన్ ఎక్స్‌ప్రెస్), ప్రణయ్ రాయ్(ఎన్డీటీవీ), వైఎస్ భారతీరెడ్డితో పాటు పలువురు తెలుగు మీడియా ప్రముఖుల పోట్రెయిట్స్ ఉన్నాయి. 'జర్నలిజంలోని బాధ్యతాయుత కృషికి రంగులద్దాలనే లక్ష్యంతోనే ఏడాదిన్నర కిందట ఈ ప్రాజెక్టును ప్రారంభించాను. ఒక్కో చిత్రానికి 20 నుంచి 30 రోజుల సమయం పట్టింది'అని విక్రమ్ రాజ్ సావటి అన్నారు.



త్వరలోనే నువ్వు అన్నీ మరిచిపోతావు.
త్వరలోనే ప్రతి ఒక్కరూ నిన్నూ మరచిపోతారు.
- మార్కస్ అరేలియస్

సాక్షి
మంగళవారం, 26 మార్చి 2024

ప్రపంచానికి మాస్కో పాఠం

ప్రపంచదేశాలు ఉలిక్కిపడ్డాయి. శుక్రవారం రాత్రి మాస్కో సమీపంలో క్రిక్కిరిసిన మాల్‌లోకి వచ్చి, ఓ సంగీత కార్యక్రమ హాలులోని జనంపై నలుగురు తీవ్రవాదులు జరిపిన విచక్షణారహితమైన దాడి ప్రపంచ భద్రతపై ప్రశ్నలు లేవనెత్తింది. గత రెండు దశాబ్దాల్లో రష్యాలో కనివిని ఎరుగని ఈ స్థాయి దాడిలో దాదాపు 140 మందికి పైగా అమాయకులు ప్రాణాలు విడిస్తే, కొన్ని పదుల మంది గాయాల పాలయ్యారు. రష్యా అధ్యక్షుడిగా పుతిన్ అయిదోసారి ఘనవిజయం సాధించిన కొద్ది రోజులకే ఈ దుశ్చర్య జరగడం గమనార్హం. యథేచ్ఛగా కాల్పులు జరిపి, భవనాన్ని తగులబెట్టిన దుండగులకు ఉక్రెయిన్‌తో లింకుందని రష్యా గూఢచర్య సంస్థల మాట. అయితే, 2022 నుంచి రష్యా యుద్ధంతో ఉక్కిరిబిక్కిరవుతున్న ఉక్రెయిన్ మాత్రం తమకు సంబంధం లేదని ఖండించింది. కాగా, ఈ దాడి తామే చేసినట్టు తీవ్రవాద 'ఐఎస్ఐఎస్'(ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాన్ అండ్ సిరియా) శాఖ అయిన 'ఇస్లామిక్ స్టేట్ – ఖొరసాన్ ప్రావిన్స్' (ఐఎస్ఐఎస్–కె) ప్రకటించడంతో కొత్త చర్చకు తెర లేచింది.

జనబాహుళ్యం ప్రాంతాల్లో ఇస్లామిస్ట్ ఉగ్రదాడుల ప్రమాదం ఉందని అమెరికా మార్చి 7 నాటికే హెచ్చరించింది. అయినా, రష్యా పెడచెవిన పెట్టింది. అలా ఈ దాడులు మాస్కో స్వీయ భద్రతా వైఫల్యానికి అద్దం పట్టడమే కాక, ఆ దేశానికి తలవంపులయ్యాయి. మాస్కో శివారులోనే తీవ్రవాదులు చులాగ్గా దాడి చేస్తుంటే, ఉక్రెయిన్‌పై యుద్ధంతో తీరిక లేని రష్యాకు తగిన ప్రత్యేక దళాలు అందుబాటులో లేకుండా పోయాయనే మాటా వినిపిస్తోంది. అయినా సరే, దేశంలో అసమ్మతిపై ఉక్కుపాదం మోపి, ఎన్నికల్లో ఎన్నడూ లేనంతగా 87.7 శాతంపైగా ఓట్లు తెచ్చుకొని, ఉక్రెయిన్‌పై యుద్ధానికి ప్రజామోదం ఉందని చెప్పుకుంటున్న రష్యా పాలకులు ఇప్పటికీ తప్పుడు దిశ వైపు చూస్తుండడం ఆశ్చర్యకరం. స్వయంకృతమని భావిస్తున్న తీవ్రవాద ముప్పుకూ పాశ్చాత్య ప్రపంచాన్నే నిందిస్తుండడం విచిత్రం. రెండు దశాబ్దాల పైగా ఉత్తర కాకసస్, చెచెన్యాలలో తీవ్రవాదంపై రష్యా తలపడుతోంది. సిరియా – ఇరాన్‌లతో దాని స్నేహం, మధ్యప్రాచ్యంలో దాని తీవ్రవైఖరి సరేసరి. ఇస్లామిజమ్ అణచివేతకూ దిగింది. దానికిప్పుడు మూల్యం చెల్లించాల్సి వస్తోందని విశ్లేషణ.

నిజానికి, ఇరాక్, సిరియా దేశాల యుద్ధక్షేత్రాల్లో అసలైన ఐఎస్ఐఎస్ చాలా వరకు ఓటమి పాలైంది. అయితే, ఆ మాతృసంస్థ తాలూకు రక్తసిక్త వారసత్వాన్ని అందిపుచ్చుకొన్న 'ఐఎస్ ఐఎస్–కె' పడగ విప్పి, బుసలు కొడుతోంది. అఫ్గానిస్తాన్ నుంచి పనిచేస్తున్నట్టుగా అందరూ భావిస్తున్న ఈ వర్గం నిదానంగా తన విషవృక్షపు ఊడలను విస్తరిస్తోంది. ఇప్పటికే అటు అఫ్గానిస్తాన్‌లోనూ, ఇటు పాకిస్తాన్‌లోనూ అది అనేక దాడులు జరిపింది. ఈ జనవరిలో సైతం ఇరాన్‌లోని కెర్మాన్‌లో ఇరానియన్ జనరల్ సంస్మరణ కార్యక్రమం సందర్భంగా అది జరిపిన బాంబు దాడుల్లో వందమందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. తాజా మాస్కో దాడితో ఈ తీవ్రవాద గ్రూపు భౌగోళికంగా తన పరిధిని విస్తరించుకుంటున్నట్టు కనిపిస్తోంది. 2015 నాటి సిరియా అంతర్యుద్ధంలో రష్యా సేనలు అక్కడి అధ్యక్షుడు బషర్ అల్–అసద్ ఏలుబడిని సమర్థిస్తూ, ఐఎస్ వర్గానికి వ్యతిరేకంగా నిలిచాయి. సిరియాలో ప్రస్తుతం సద్దు లేనందున 'ఐఎస్ఐఎస్–కె' సారథ్యంలోని తీవ్రవాదులు అక్కడ తమ ఓటమికి ఇప్పుడిలా దాడి రూపంలో రష్యాపై ప్రతీకారం తీర్చుకోవాలని భావించి ఉండవచ్చు.

ఉక్రెయిన్‌తో యుద్ధంలో మునిగిన పుతిన్ ఈ తాజా తీవ్రవాద దాడిపై స్పందించే తీరు రానున్న రోజుల్లో ప్రపంచ శక్తి సంబంధాలపై ప్రభావం చూపడం ఖాయం. అసలు దాడికీ, ఉక్రెయిన్‌కూ సంబంధం ఉందన్న రష్యా మాట నమ్మశక్యంగా లేకపోగా, మధ్య ఆసియా ప్రాంతానికి విస్తరించాలని 'ఐఎస్ఐఎస్–కె' పడుతున్న ఆరాటానికి బలమైన ఆధారాలు కనిపిస్తున్నాయి. తజిక్ వర్గాల్లో ఈ తీవ్రవాద వర్గానికి ఆకర్షణ పెరుగుతోందనీ, ఈ ప్రాంతానికి విస్తరించే సత్తా దానికి ఉందనీ జనవరిలోనే ఐరాస భద్రతా మండలి తన నివేదికలో హెచ్చరించడం గమనార్హం. గత రెండు దశాబ్దాల్లో వివిధ రకాల తీవ్రవాద ఘటనలు చూసిన మాస్కో కళ్ళు తెరిచి నిద్ర నటించడం మానాలి. ప్రస్తుత పరిస్థితుల్లో శుష్క ఆరోపణలు మానేసి, సమస్య అసలు మూలాలపై దృష్టి పెట్టాలి. సొంత పెరట్లోనే ఈ తీవ్రవాద వర్గంతో పోరాటం చేస్తున్న అఫ్గానిస్తాన్ పాలకులతో కలసి కార్యాచరణ చేపట్టాలి.

రష్యా ఘటన సాక్షిగా ఇప్పుడు కావాల్సిందల్లా... తీవ్రవాదంపై ప్రపంచ దేశాల మధ్య ఒక స్పష్టమైన అవగాహన, అంగీకారం. అంతర్జాతీయంగా ఐఎస్ఐఎస్–కె ఊడలు మరింత లోతుగా దిగక ముందే వివిధ ప్రపంచ దేశాలు నడుం బిగించాలి. మునుపు ఐఎస్‌ను మట్టి కరిపించడానికి కలసికట్టుగా కాలు కదిపినట్టే ఇప్పుడూ ముందుకు కదలాలి. ఐఎస్ఐఎస్–కె బలంగా వ్యతిరేకించే అఫ్గాన్ తాలిబన్‌తో అంతర్జాతీయ సమాజం సైతం సమన్వయం చేసుకోవాలి. సొంత గడ్డపై ఐఎస్ఐఎస్–కె, టీటీపీ లాంటి తీవ్రవాదుల కార్యకలాపాలను అనుమతించడం వల్ల చివరకు తమ దేశంతో పాటు, ఈ ప్రాంత భద్రతకే ప్రమాదమని అఫ్గానిస్తాన్ కూడా గ్రహించాలి. అందుకే, ఆ దేశం, దాని పొరుగునున్న ఈ తీవ్రవాద విషసర్పం కోరలు పీకే పనిలో ముందు వరుసలో నిలవాలి. ఇరాన్, చైనా, రష్యా, మధ్య ఆసియా దేశాలు కలిసొచ్చి, ప్రాంతీయంగా ముప్పుగా పరిణమిస్తున్న ఈ తీవ్రవాద భూతాన్ని నిర్వీర్యం చేయాలి. ఏకాగ్ర దృష్టితో సునిశితమైన కార్యాచరణకు దిగితేనే ఫలితాలుంటాయి. అప్పుడే అసువులు బాసిన అమాయకుల పక్షాన నిలిచి, దోషులను వెంటాడి వేటాడగలం. పొంచివున్న సరికొత్త తీవ్రవాద వర్గపు ప్రమాదం నుంచి ప్రపంచాన్ని కాపాడగలం.

ఓటు ప్రజాస్వామ్య జీవధాతువు

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

భారతదేశంలో రాజకీయాలు 2024 సార్వత్రిక ఎన్నికల శంఖారావంతో ఊపందుకున్నాయి. ఓటరు చైతన్యం ఇందులో కీలకం. ఓటు దేశ ప్రజలకు జీవధాతువు. మన జీవిత నిర్మాణానికి అది ఒక పనిముట్టు. ఓటుహక్కును మనం దుర్వినియోగం చేసుకుంటే, మన మిగిలిన హక్కులన్నీ కాల రాయబడతాయి. అందుకే ఓటు అనేది అత్యున్నతమైనది. దాని విలువ అమూల్యమైనది. ఆ విలువ మానవ విలువలతో సమానమైనది. భిన్న భావజాలాల ప్రభావం ఈ ఎన్నికల మీద ఉండబోతోంది. అంబేడ్కర్ వాదుల, సామ్యవాదుల, సోషలిస్టుల, కమ్యూనిస్టుల, స్త్రీవాదుల, దళిత బహుజన వాదుల, మైనారిటీ హక్కుల వాదుల, మానవ హక్కుల పోరాటవాదుల సిద్ధాంతాల ప్రజ్వలనం సమాజంలో అంతర్గతంగా బలంగా ఉందని చెప్పక తప్పదు.

వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) మళ్ళీ తెరపైకి వచ్చింది. సార్వత్రిక ఎన్నికలకు మరో మూడు నాలుగు రోజుల్లో షెడ్యూలు వస్తుందనగా... బీజేపీకి ఓట్లు కురిపిస్తుందని భావిస్తున్న సీఏఏను మోదీ సర్కారు బ్రహ్మాస్త్రంగా బయటికి తీసింది. పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు శరణార్థులుగా వచ్చిన ముస్లిమేతరులకు మనదేశ పౌరసత్వాన్ని కల్పించడం దీని లక్ష్యం. సీఏఏ చట్టం 2019 లోనే పార్లమెంట్ ఆమోదం పొందినా, రాష్ట్రపతి సమ్మతి కూడా లభించినా... విపక్షాల ఆందోళనలు, దేశవ్యాప్తంగా నిరసనల కారణంగా అమలులో జాప్యం జరిగింది. పూర్తిస్థాయి నిబంధనలపై సందిగ్ధం నెలకొనడంతో చట్టం కార్యరూపం దాల్చలేదు. సార్వత్రిక ఎన్నికలకు ముందే దీన్ని అమల్లోకి తీసుకొస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పలుమార్లు చెబుతూ వచ్చారు. సరిగ్గా అదను చూసి ఇపుడు దానిని తెరపైకి తెచ్చారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్ నుంచి 2014 డిసెంబర్ 31 కంటే ముందు మన దేశానికి వచ్చిన హిందువులు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్శీలకు ఈ చట్టం వర్తిస్తుంది.

భారతదేశంలోకి అనేక మతాలవారు ఆయా కాలాల్లో వచ్చారు. భారతీయ జన జీవనంలో కలసిపోయారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి అన్ని మతాలవారు, కులాల వారు కలసి పోరాడారు. భారతదేశానికి మొదటి ఎన్నికలు జరిగినప్పటి నుండి ముస్లింలకు పార్లమెంట్‌లోనూ, అసెంబ్లీలోనూ ప్రాతినిధ్యం ఇస్తూ వస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1952లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో ముస్లిం సభ్యులు 76 మంది ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో ముస్లిం ఎంపీలు గణనీయంగా ఎన్నికయ్యారు. ఆనాడు ముస్లింల జనాభా 6 శాతం కంటే తక్కువ. మొదటి రాజ్యసభలో సుమారు 10.5 శాతం ముస్లిం సభ్యులున్నారు. 2014లో బీజేపీ స్వల్ప మెజారిటీతో లోక్‌సభ ఎన్నికలలో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. బీజేపీ అధికారానికి వచ్చిన నాటి నుండి ముస్లింల ప్రాతినిధ్యం అత్యల్పం. అందుకే 2024 ఎన్నికల్లో ముస్లింలు ఏకమై సెక్యులర్ పార్టీలకు ఓట్లు వేస్తారని ఒక పరిశోధనా పత్రం పేర్కొంది. బీజేపీపై పోటీ చేసే బలమైన అభ్యర్థికి ఓట్లు వేస్తారని ఆ పరిశోధన అంచనా వేసింది. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 27 మంది ముస్లిం అభ్యర్థులు గెలవగా (17వ లోక్‌సభ), 16వ లోక్‌సభలో 23 మంది ముస్లిం సభ్యులున్నారు. పార్లమెంట్ చరిత్రలో ఇది ముస్లింలు తక్కువ సంఖ్యలో వున్న రెండోసభ. ప్రపంచంలో భారత్ మూడవ అతిపెద్ద ముస్లిం జనాభా (17.22 కోట్లు) కలిగివున్న దేశం. నిజానికి ముస్లింలు ఈ దేశ స్వాతంత్ర్యంలో పాల్గొన్న ప్రధానమైన శక్తులు. వారిని నిర్లక్ష్యం చేయడం దేశ అభివృద్ధికి, సౌభాగ్యానికి గొడ్డలిపెట్టు.

క్రైస్తవులు భారతదేశానికి ఇతర దేశాల నుండి వలస వచ్చినవారు కాదు. హిందూమతంలో అస్పృశ్యతకు, నిరాదరణకు గురైనవారు ఆ మతంలోకి వెళ్ళి అక్షర విద్యను నేర్చుకున్నారు. దళితులు ఎక్కువ మంది క్రైస్తవ మతంలో చేరి అక్షర విద్యను నేర్చుకున్నారు. వారిని నిరాకరించడం వల్ల, జనరల్ సీట్లలో ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం వల్ల లౌకికవాదం దెబ్బతింటుంది. ఇక బౌద్ధం భారతదేశంలో సామాజిక, సాంస్కృతిక విప్లవాన్ని తీసుకువచ్చింది. సమసమాజ భావాన్ని ప్రజ్వలింప చేసింది. మానవతా ధర్మాన్ని ప్రబోధం చేసింది. భారతదేశ వ్యాప్తంగా బౌద్ధ సంస్కృతి వికాసం జరిగింది. భారతదేశం నుండి ప్రపంచ దేశాలకు బౌద్ధం విస్తరించింది. భారతదేశ వ్యాప్తంగా బౌద్ధులు కోట్లాది మంది వున్నారు. వారు ప్రత్యక్షంగా లేకపోవచ్చు. పరోక్ష రాజకీయ ఉద్యమంలో వున్నారు. తప్పకుండా భారత రాజకీయాల్లో వీరి ప్రభావం స్పష్టంగా వుంది. ఇకపోతే రామ్ మనోహర్ లోహియా ప్రభావం దళిత బహుజన రాజకీయాల మీద బలంగా వుంది. మండల కమిషన్ రిపోర్టును బయటికి తీసుకొచ్చిన వి.పి. సింగ్ ప్రభావం కూడా బలంగా వుంది. కమ్యూనిస్టులు, అంబేడ్కర్ వాదుల అశేషమైన భావజాలం కూడా 2024 ఎన్నికల మీద వుంది. భారతదేశంలో అనేక భావజాలాల ప్రభావానికి ఈ ఎన్నికలు గురవుతాయి అనడంలో సందేహం లేదు. పూలే, అంబేడ్కర్, రామ్ మనోహర్ లోహియా, పెరియార్ రామస్వామి నాయకర్, వి.పి. సింగ్, కాన్షీరామ్... వీరందరి ప్రభావం తప్పక ప్రజల మీద ఉంది.



ఇకపోతే 2014లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గడిచిన తొమ్మిదేళ్ళ పది మాసాల్లో పెరిగిన నిరుద్యోగం, చుక్కలనంటిన నిత్యావసరాల ధరలు, నల్ల ధనాన్ని వెనక్కి తీసుకురావడంలో విఫలం కావడం, సామాన్య మధ్య తరగతి ప్రజలు ఎదుర్కొన్న అష్టకష్టాలను ప్రధానాంశాలుగా ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' విస్తృతంగా ప్రచారం చేయాలి. మాజీ ఎన్నికల కమిషనర్ టి.ఎన్. శేషన్ చెప్పినట్లుగా దశ మహాపాతకాలు దేశ ఎన్నికల వ్యవస్థను కరకర నమిలేస్తున్నాయి. భారతదేశంలో ఎన్నికలు కొత్త కాదు. ప్రజలు చైతన్యవంతులు, ఆలోచనాపరులు. అయితే, యువతకు ఉద్యోగ వసతి కల్పిస్తారనీ, ఆర్థిక అభివృద్ధి చేస్తారనీ ఎక్కువమంది మోదీకి ఓట్లు వేశారు. కానీ పేద ప్రజలకు భరోసాని ఇచ్చే 'జాతీయ గ్రామీణ ఉపాధి హామీ' పథకాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం నీరుగార్చింది.

స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు నిర్వహించడమనేది కేంద్ర ఎన్నికల సంఘం రాజ్యాంగ బద్ధ విధి. ఏడు దశల్లో లోక్‌సభ ఎన్నికలు నిర్వహించడం వల్ల కొంత మేలు ఉన్నప్పటికీ, లోపాలు కూడా లేకపోలేదు. సున్నితమైన నియోజకవర్గాల్లో, ఎన్నికల సంబంధ హింసాకాండ చోటు చేసుకొనే అవకాశమున్న పోలింగ్ కేంద్రాల్లో తగిన సంఖ్యలో కేంద్ర బలగాలను మోహరించడానికి విడతలవారీ ఎన్నికల నిర్వహణ దోహదపడుతుంది. 85 ఏళ్ళ వయస్సు పై బడిన వారందరూ ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. 85 వయస్సు పైబడిన ఓటర్లు దేశ వ్యాప్తంగా 82 లక్షల మంది ఉన్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. ఇందులో వందేళ్ళు దాటిన ఓటర్లు 2 లక్షల 18 వేల మంది వున్నారు.

భారతదేశ రాజకీయాల్లో ఈనాడు అనివార్యంగా ఓబీసీలకు సీట్లు పెంచవలసిన చారిత్రక అవసరం ముందుకు వచ్చింది.

బీసీలు వృత్తికారులే కాక, శ్రామికశక్తులు! చాలామంది బీసీలు తమ విముక్తిదాతైన పూలే గూర్చి తెలుసుకోలేకపోతున్నారు. మహాత్మా పూలే ఓబీసీలకు అర్థమైనపుడే వారిలో సామాజిక, రాజకీయ చైతన్యం వస్తుంది. స్త్రీలకు కూడా మునిపటి కంటే ఎక్కువ సీట్లు ఇస్తారు. విద్యాధికులు, రిటైర్డ్ ఆఫీసర్లు, అడ్వకేట్లు, పాత్రికేయ ప్రముఖులు, రిటైర్డ్ జడ్జిలు, రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లు కూడా ఇప్పుడు రాజకీయ రంగంలోకి దూకారు. ఆంధ్రప్రదేశ్‌లోకి బీజేపీని ఆహ్వానించడం వల్ల చంద్రబాబు ముస్లింల, క్రైస్తవుల, సోషలిస్టుల, కమ్యూనిస్టుల ఓట్లు కోల్పోతున్నారు. రాజ్యాంగేతరమైన భావజాలం ఎన్నికలలో పెరగడం ఆశ్చర్యకరం. అయితే భారతదేశంలో ఇవన్నీ అనేక సందర్భాలలో జరుగుతూ వచ్చాయి. వాటన్నింటినీ భారతదేశం తట్టుకొని నిలబడుతూ వచ్చింది. బీజేపీ తన వ్యూహ ప్రతి వ్యూహ రచనల్లో ప్రధానంగా పార్టీలను చీల్చడం, లొంగదీసుకోవటం వంటి అనేక వ్యూహాలతో ముందుకువెళ్తోంది. కానీ భారత రాజ్యాంగాన్ని దాటి వెళ్లే శక్తి ఏ వ్యక్తికీ, ఏ పార్టీకీ లేదని మనం తప్పక నమ్మాలి. దాని అంతర్గత శక్తి బౌద్ధ సూత్రాలతో నిండి ఉంది. అందుకే 2024 ఎన్నికలకు దళిత బహుజన లౌకికవాద భావజాలంతో ముందుకు నడవాల్సిన చారిత్రక సందర్భం ఇది.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు । 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పట్టించుకోవాలి!



లద్దాఖ్‌ను కాపాడండి అని పిలుపు నిస్తూ సోనమ్ వాంగ్‌చుక్ 20 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. ప్రభుత్వం కచ్చితంగా చర్చలు ప్రారంభించాలి. పట్టించుకోకుండా ఉండకూడదు.

– శివ్ అరూర్, జర్నలిస్ట్

దారుణ వారం



కశ్మీర్‌కు ఈ వారం ప్రత్యేకమైనది. 1997 మార్చ్ 21న సంగ్రామ్‌పోరా నరమేధంలో ఏడుగురు పండిట్లను కాల్చి చంపారు. 2000 మార్చ్ 20న చిత్తిసింగ్‌పుర నరమేధంలో 36 మంది సిక్కులను కాల్చిచంపారు. 2003 మార్చ్ 23న నంది మార్గ్ నరమేధంలో 24 మంది పండిట్లను కాల్చి చంపారు. 1990 మార్చ్ 23న చడూరా ఎమ్మెల్యే మీర్ ముస్తఫానూ, కవి నాయకుడు అబ్దుల్ సత్తార్ రంజూర్‌ను కాల్చి చంపారు. వాళ్లందరి ఆత్మలకు శాంతి కలగాలి!

– అహ్మద్ అలీ ఫయాజ్, జర్నలిస్ట్

కడుపులోకి రంగులా?



ఒక్క రోజు జరుపుకొనే హోలీలోనే చర్మం పాడు కాకుండా జనాలు హెర్బల్ రంగులు కొంటారు. కానీ 365 రోజులు కడుపులోకి వెళ్లే రంగుల గురించి ఆలోచించరా? దారుణ ప్రభావాన్ని కలిగించే కొన్ని ఫుడ్ కలర్స్‌ను ప్రపంచంలో కొన్నిచోట్ల నిషేధించారు. ఇండియాలో మాత్రం వాటిని అనుమతిస్తున్నారు.

– రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

తిరుగుబాటు హోలీ



రెండు సంస్కృతుల మేళనంలోని అందం. బలూచిస్తాన్ (పాకిస్తాన్)లో బలూచీ నృత్యం 'దోచపీ' చేస్తూ హోలీ జరుపు కొన్నారు (వీడియో షేర్ చేశారు). 'నేను రెబెల్‌ను, నేను బలూచీ ఫ్రీడమ్ ఫైటర్‌ను' అని పాట! హిందూ అన్నాచెల్లెళ్లకు హోలీ శుభాకాంక్షలు.

– ఫాజిలా బలూచ్, యాక్టివిస్ట్

మళ్లీ బలపడేనా?



పశ్చిమాసియా గందరగోళంగా ఉంది. చాలామంది ఐసిస్ జిహాదీలు అఫ్గానిస్తాన్‌కు తరలారు. తాలిబన్ పష్తూన్ ప్రభుత్వం మీద తజికిస్తాన్, ఉజ్బెకిస్తాన్‌లోని నిర్దిష్ట జాతులు కోపంగా ఉన్నాయని కథనాలు! ఆఫ్రికాలో కొన్ని భాగాలు 'స్టేట్‌లెస్'గా ఉన్నాయి. ఐసిస్ పునరుద్ధరణ అవకాశాలు కనబడుతున్నాయి.

– స్టాన్లీ జానీ, జర్నలిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఇన్ బాక్స్

చట్టసభల వైఫల్యం కొనసాగుతోంది

కమ్యూనిస్టు విప్లవ యోధుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి తన శాసనసభ సభ్యత్వానికి 1969 మార్చి నెలలో రాజీనామా చేస్తూ సంచలనాత్మకమైన ఉపన్యాసాన్ని అసెంబ్లీలో ఇచ్చారు. ఆయన ఉపన్యాసం ఇచ్చి ఇప్పటికి 55 ఏళ్లు పూర్తయినాయి. ఆయన ఆనాడు ఉపన్యాసంలో చెప్పిన విషయాలన్నీ నేటికీ అక్షర సత్యాలే.

దళారీ పాలక వర్గాలు దేశాన్ని సామ్రాజ్యవాదులకు తాకట్టు పెడుతున్నారని చెప్తూ కామ్రేడ్ నాగిరెడ్డి గణాంకాలతో వివరించారు. దేశంలో పెరిగి పోతున్న విదేశీ అప్పుల గురించి క్లుప్తీకరించారు. ఈ సందర్భంగా, దేశాభివృద్ధికంటే రక్షణ చర్యలకే ప్రాధాన్యతనిస్తూ పెరుగుతున్న ఆర్థిక సంక్షోభాన్ని నివారించే చర్యలను అసెంబ్లీ, పార్లమెంటులు చేపట్టకుండా ఈ సంక్షోభ తీవ్రతను మరింతగా పెంచే విధానాలను అవలంబిస్తున్నాయని ఆయన అన్నారు. పంచవర్ష ప్రణాళికలు సామ్రాజ్యవాదుల దయా దాక్షిణ్యాలపై ఆధారపడుతున్నాయనీ, దేశ సంపద విదేశాలకు తరలి పోతున్నదనీ నాగిరెడ్డి వివరించారు. దేశంలోని పాలక వర్గాల వారు భూస్వాముల ప్రయోజనాలను పరిరక్షించే విధానాలను అనుసరిస్తున్నారని ఉదాహరణలతో వివరించారు. ప్రజల్ని విప్లవ కార్యాచరణకు కదిలించడమే నేటి తక్షణ కర్తవ్యమనీ, ప్రజలు కదిలితే తప్ప ఈ దోపిడీలు, అన్యాయాలు అరికట్టబడవని తెల్పి చెబుతూ తన ఉద్వేగభరితమైన ఉపన్యాసాన్ని ముగించారు.



తరిమెల నాగిరెడ్డి

తరిమెల నాగిరెడ్డి ఈ విషయాలు చెప్పి నేటికి ఐదున్నర దశాబ్దాలు పూర్తవుతున్నా నేడు దేశంలో భూస్వాముల, సామ్రాజ్య వాదుల, స్వదేశీ పెట్టుబడిదారుల దోపిడీలు స్వైర విహారం చేస్తున్నాయి. విదేశీ రుణాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి.

ప్రజలెదుర్కొంటున్న మౌలిక సమస్యలను పాలకులు పరిష్కరించటంలో పూర్తిగా వైఫల్యం చెందారు. దేశంలో ఆర్థిక, రాజకీయ సంక్షోభం తీవ్ర రూపం దాలుస్తున్నప్పటికీ ఈ సంక్షోభాల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా పాలకులు రక్షణ చర్యలకే అత్యధిక ప్రాధాన్యత నిచ్చే విధానాలను అనుసరిస్తున్నారు. ప్రజాస్వామ్యం పేరుతో జరుగుతున్న ఎన్నికలు డబ్బు సంచుల మధ్య పోటీగా తయారై ఒక ప్రహసనంగా మారాయి. పార్లమెంటు, అసెంబ్లీలు ప్రజా సమస్యలను పరిష్కరించటంలో విఫలం చెందుతూనే ఉన్నాయి.

ఒక్క మాటలో చెప్పాలంటే కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 55 ఏళ్ళ క్రితం చెప్పిన విషయాలన్నీ నేటికీ అక్షర సత్యాలే. ప్రజల్ని విప్లవ కార్యాచరణకు కదిలించటమే నేటి తక్షణ కర్తవ్యమని ఆయన చెప్పిన మాట నేటికీ వర్తిస్తుంది.

– సి. భాస్కర్, యూసీసీఆర్ఐ (ఎం–ఎల్)

ఇదెక్కడి మేధావితనం?

అభిప్రాయం



పి. విజయబాబు

గతంలో కమ్యూనిస్టులు బలంగా ఉన్న రోజుల్లో, 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి!' అనే నినాదం గోడల మీద విస్తృతంగా దర్శనం ఇచ్చేది. ఆ నినాదం నిజమైందో లేదో తెలియదు కానీ, ఇప్పుడు అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో తిరిగి చంద్రబాబు నాయుడిని అధికారంలోకి తీసుకురావడానికి ప్రపంచంలో ఉన్న ఒక వర్గం 'మేధావులంతా ఏకం కండి!' అనే నినాదాన్ని అందిపుచ్చుకొని వాళ్లంతా ఏకమవుతూ తమ సర్వశక్తుల్నీ ఒడ్డుతున్నారు. ఆ క్రమంలోనే తాజాగా లోక్ సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ అలియాస్ జేపీ హైదరాబాదు నుంచి విజయవాడ విచ్చేసి, ప్రెస్‌మీట్ పెట్టి తన మద్దతు ఎన్డీయే కూటమికే అంటూ దానికి బహు నిర్వచనాలు ప్రవచించారు. అంతటితో ఆగకుండా 'గాంధీ మహాత్ముడు, అంబేడ్కర్‌లకు కులం అంటగడతామా?' అంటూ పరోక్షంగా తను కూడా అంతటి మహాత్ముడినే అని ప్రకటించుకున్నారు. అక్కడే చంద్రబాబుతో అంటకాగడంలో అపరాధ భావం ప్రస్ఫుటమవుతోంది. ఇంకా త్రిపురనేని రామస్వామి చౌదరి, గిడుగు రామ్మూర్తి పంతులు పేర్లు కూడా ఉటంకించారు. అసలు ఆయన మాట్లాడేదానికీ, ప్రస్తుత రాజకీయాలకూ; నాటి సంఘ సంస్కర్తలూ, భాషా వేత్తలైన త్రిపురనేని, గిడుగులకు సంబంధం ఏంటో బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు.

ఈ జేపీ లోక్‌సత్తా పార్టీని ఎప్పుడో చుట్ట చుట్టేశారు. లోక్ సత్తా ఇకపై రాజకీయ పార్టీ కాదని ప్రకటించేశారు కూడా! అయితే, చంద్రబాబు కోసం అర్జెంటుగా మళ్లీ పార్టీని వెలుగులోకి తెచ్చారు కాబోలు!

నిజానికి ఈ పార్టీ పుట్టుక పరిశీలిస్తే, ఒక దశలో చంద్రబాబు నాయుడుతో రామోజీరావుకి తేడాలు వచ్చి, "నేను కింగ్ మేకర్‌ని. ఎన్టీఆర్ నుంచి పీఠాన్ని అప్పజెప్పింది నేను. అటువంటిది నాకే 'మింగుడు పడకపోతే' ఎలా? మీలాంటి వాడిని జాతీయ స్థాయిలో మరొకడిని తయారుచేస్తా!" అని ఈ జేపీని తెర మీదకు లోక్‌సత్తా పేరుతో తీసుకురావడంలో రామోజీరావు కీలక పాత్ర వహించారని అంటారు పరిశీలకులు. అందుకే కాబోలు! అప్పట్లో 'ఈనాడు'లో జేపీ వార్తలు పుంఖానుపుంఖాలుగా వచ్చేవి.



ఆ పబ్లిసిటీ ప్రభావంతో విద్యావంతులు చాలా మంది లోక్‌సత్తా పట్ల ఆకర్షితులయ్యారు. అయితే జేపీ 'హై వోల్టేజ్ యారొగెన్సీ'కి షాక్ అయి స్వల్పకాలంలోనే జారుకున్నారు. జేపీని ఒకసారి గెలిపించిన హైదరాబాద్ కుకట్‌పల్లి ప్రజలు కూడా అతడి మేధా అహంకారానికి బెదిరిపోయారు. కాగా, మల్కాజ్‌గిరిలో మైండ్ బ్లాక్ అయ్యే జవాబు ఇచ్చారు జనం. దాంతో రాజకీయాలకు దూరంగా తన మేధాతనాన్ని అప్పుడప్పుడు మాత్రమే ప్రదర్శిస్తూ రోజులు గడుపుతున్నారు జేపీ. ఎంతైనా పబ్లిసిటీకి అలవాటైన ప్రాణం కదా! పైగా తను పెద్ద లౌకికవాదినని కూడా చాటుకోవాలయ్యె! అందుకే, చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు, ఒకసారి పవన్ కల్యాణ్‌తో కలిసి 'ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ' అంటూ నాలుగు రోజులు హడావిడి చేసి మళ్లీ సైలెంట్ అయిపోయారు. ఆ మధ్య జగన్ ప్రభుత్వంలో పథకాలను ప్రశంసించారు. ఇప్పుడు మళ్లీ 'ప్రపంచ మేధావులారా ఏకం కండి!' అన్న నినాదాన్ని అందిపుచ్చుకొని చంద్రబాబుకు మద్దతుగా ప్రకటన చేశారు. ఈ క్రమంలోనే, గాంధీ, అంబేడ్కర్, వైశ్య కులం, దళిత కులం; త్రిపురనేని రామస్వామి చౌదరి, గిడుగు రామ్మూర్తి అంటూ మోకాలికీ బోడి గుండుకీ ముడిపెడుతూ తన మేధాతనాన్ని ప్రదర్శించడానికి చాలా ప్రయాసపడ్డారు.

ప్రకటన వికటించింది. చంద్రబాబుకి వర్గ పరంగా బహిరంగ మద్దతు ఇస్తున్నాను అని ఆయన ప్రకటిస్తే ఎవరికీ పెద్ద అభ్యంతరం ఉండేది కాదు. కానీ ఏదేదో మాట్లాడేసేసి, ఆంధ్ర ప్రదేశ్‌లో ఏదో అరాచకం జరిగి పోతుందని తన భాషా ప్రావీణ్యమంతా ప్రదర్శించే సరికి, ఆయన మీద విమర్శల జడి మొదలైంది.

పాపం జేపీని చూసినప్పుడల్లా విదురుడు చెప్పిన పద్యం ఒకటి గుర్తుకు వస్తుంది.

"ధనమును, విద్యయు, వంశంబును, దుర్మతులకు మదంబు ఒనరించును / సజ్జనులైన వారికి అణకువయును, వినయము ఇవియే తెచ్చును ఉర్వీ నాథా!" అంటాడు. ధనం, విద్య, ఉత్తమ కులంలో పుట్టాననే భావన దుష్టులకు మదాన్నీ, అహంకారాన్నీ కలిగిస్తాయి. ఇవే శిష్టులకు అణకువ, వినయం కలిగిస్తాయి అని విదురుడు ధృతరాష్ట్రుడికి బోధిస్తాడు. ఈ పద్యం చదివితే జేపీ ఏ బాపతు మేధావో చెప్పనవసరం లేదనుకుంటాను. జనానికి ఏమి కావాలో అది చెప్పాలి. లేదంటే నేల విడిచి సాము చేసినట్టు ఉంటుంది. జనం ఏమైనా 'జేపీలా'?

వ్యాసకర్త పూర్వ సంపాదకులు

నమ్మకం ముఖ్యం

ఓ ఆశ్రమంలో విద్య నభ్యసిస్తున్న పిల్లల్లో ఒకరికి గురువుగారి పట్ల బొత్తిగా నమ్మకం లేకుండా పోయింది. దీంతో అతడు చదువులో వెనకబడిపోయాడు. ఈ విషయాన్ని గురువుగారు గ్రహించి అదను కోసం వేచి చూస్తున్నారు. ఒకరోజు గురువుగారు శిష్యులందరితో కలసి అడవిలో ప్రయాణిస్తుండగా... ఒక తండ్రి తన ముగ్గురు పిల్లలతో వెళ్తుండడాన్ని చూశారు. చిన్నవాడిని తండ్రి తన భుజం మీద కూర్చోపెట్టుకోగా, రెండోవాడు తండ్రి చేయి పట్టుకుని నడుస్తున్నాడు. వారి వెనుక పెద్ద పిల్లాడు నడుస్తున్నాడు.



జ్యోతిర్మయం

గురువుగారు తమ శిష్యులను ఆ తండ్రీ–పిల్లలను గమనించి వారేమి గ్రహించారో చెప్పమన్నారు. తండ్రి భుజాల మీద కూర్చున్న చిన్నపిల్లాడు పువ్వులు, పక్షులను చూస్తూ ఆనందంగా ఆస్వాదిస్తున్నాడు. తండ్రి చేయి పట్టుకుని నడుస్తున్న రెండో పిల్లాడు దారిలో కనిపించినవన్నీ చూస్తున్నాడు తప్ప అతనిలో పెద్దగా స్పందన లేదు. ఇక వారి వెనుక నడుస్తున్న పెద్ద పిల్లాడు వేటినీ చూసి ఆస్వాదించడం లేదు. అతడి కళ్లలో ఏదో భయం కూడా కనిపిస్తోంది.

అయితే అందరూ చెప్పిన జవాబేమిటంటే తండ్రి భుజం మీదున్న చిన్న పిల్లాడిలా సంతోషంగా ఉండాలని. ఎవరిలా ఉండకూడదు అనడానికి తండ్రి వెనుక మెల్లగా నడుస్తూ భయపడుతున్న వాడిని పేర్కొన్నారు.


శిష్యుల మాటలన్నీ విన్న గురువుగారు, 'ఎవరైతే దేవుని మీద పూర్తి నమ్మకం ఉంచి భారం వేస్తారో వారికే కైవల్యం ప్రాప్తిస్తుంది. అలాగే శిష్యులనేవారు తమ గురువుగారి బోధనలపై పూర్తి విశ్వాసం ఉంచినప్పుడే వారు చదువులోనూ, ఆ తర్వాత జీవితంలోనూ పైకి వచ్చి తండ్రి భుజంపై ఉన్న చిన్న పిల్లవాడిలా ఆనందంగా ఉంటారు. గురువుగారి పట్ల నమ్మకం లేనివారు తండ్రి వెనుక భయం భయంగా నడుస్తున్న పెద్దపిల్లాడిలా ఉంటార'ని అన్నారు.

దీంతో గురువుగారి పట్ల విశ్వాసం లేని శిష్యుడికి జ్ఞానోదయం అయ్యింది. ఆ క్షణమే అతను తనను క్షమించమని గురుదేవుని పాదాలకు నమస్కరించాడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** బ.పాడ్యమి ప.1.33 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** హస్త ప.12.28 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** రా.9.13 నుండి 10.57 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.27 నుండి 9.15 వరకు, తదుపరి రా.10.55 నుండి 11.43 వరకు, **అమృతఘడియలు:** లేవు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.03, **సూర్యాస్తమయం:** 6.07.

ప్రాజెక్టుల్లో నీటి మట్టాలు



పులిచింతల (సూర్యాపేట జిల్లా నెమలిపురి) ▶ సామర్థ్యం 45.77 | ప్రస్తుత నిల్వ 4.70 | మార్చి 25, 2023 43.99 (టీఎంసీలు)




శ్రీరాంసాగర్ (నిజామాబాద్ జిల్లా) ▶ సామర్థ్యం 90 | ప్రస్తుత నిల్వ 17.5 | మార్చి 25, 2023 31.5 (టీఎంసీలు)




ప్రియదర్శిని జూరాల (జోగులాంబ గద్వాల జిల్లా) ▶ సామర్థ్యం 9.657 | ప్రస్తుత నిల్వ 3.476 | మార్చి 25, 2023 4.11 (టీఎంసీలు)



శ్రీపాద ఎల్లంపల్లి (పెద్దపల్లి జిల్లా రామగుండం) ▶ సామర్థ్యం 20.175 | ప్రస్తుత నిల్వ 8.73 | మార్చి 25, 2023 12 (టీఎంసీలు)



కుమురంభీం (ఆసిఫాబాద్ జిల్లా అడ) ▶ సామర్థ్యం 10.393 | ప్రస్తుత నిల్వ 5.094 | మార్చి 25, 2023 5.095 (టీఎంసీలు)



మూసీ (నల్లగొండ జిల్లా కేతేపల్లి) ▶ సామర్థ్యం 645 | ప్రస్తుత నిల్వ 620.55 | మార్చి 25, 2023 623 (అడుగులు)



పాలేరు రిజర్వాయర్ (ఖమ్మం జిల్లా కూసుమంచి) ▶ సామర్థ్యం 23 | ప్రస్తుత నిల్వ 7.20 | మార్చి 25, 2023 21.05 (అడుగులు)



తాలిపేరు (భద్రాద్రి జిల్లా చర్ల) ▶ సామర్థ్యం 74 | ప్రస్తుత నిల్వ 1.85 | మార్చి 25, 2023 2.95 (మీటర్లు)

హోలీ మిగిల్చిన విషాదం

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నీటమునిగి 11 మంది మృతి

మరో నలుగురి ఆచూకీ గల్లంతు.. రోడ్డు ప్రమాదాల్లో ఇంకో ముగ్గురి దుర్మరణం

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో సోమవారం జరిగిన హోలీ పండుగ సంబరాలు పలు కుటుంబాల్లో పెను విషాదం నింపాయి. నీటి ప్రమాదాలతోపాటు రోడ్డు ప్రమాదాల రూపంలో 14 మందిని బలిగొన్నాయి. మరో నలుగురి ఆచూకీ గల్లంతైంది.



పనస కమలాకర్



ఉప్పుల సంతోష్



ఆలం సాయి



ఎల్ములె ప్రవీణ్



కార్తీక్



జగన్



సురేందర్



గల్లంతైన శ్రవణ్, శంకర్



రాజేశ్

స్నానాల కోసమని వెళ్లి..

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తాటిపల్లి వద్ద వార్ధా నదిలో మునిగి నలుగురు యువకులు మృతిచెందారు. మృతులంతా కౌటాల మండల కేంద్రానికి చెందినవారే. పోలీసుల కథనం ప్రకారం.. కౌటాల మండల కేంద్రంలోని దిమాబాద్‌కు చెందిన పనస కమలాకర్ (22), ఎల్ములె ప్రవీణ్ (23), ఆలం సాయి (22), ఉప్పుల సంతోష్ (25)తోపాటు మరో ఇద్దరు హోలీ ఆడాక స్నానం చేసేందుకు వార్ధా నది వద్దకు వెళ్లారు. నదిలోకి నలుగురు దిగగా నీటిమట్టం ఎక్కువగా ఉండటంతో మునిగి మృతిచెందారు.

- మహబూబాబాద్ జిల్లా రామన్నగూడెం గ్రామానికి చెందిన అబ్బోరి వినోద్‌రెడ్డి, పద్మ దంపతుల కుమారుడు రిత్విక్‌రెడ్డి (10) హోలీ ఆడాక స్నేహితులతో కలసి ఈత కొట్టేందుకు స్థానిక గణేష్ చెరువులోకి వెళ్లగా అందులోని పెద్ద గుంతలో కూరుకుపోయి ఈత రాక మునిగి చనిపోయాడు.
- సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడ గ్రామానికి చెందిన శ్రవణ్, శంకర్‌లతోపాటు మరో 10 మంది స్నేహితులు హోలీ అనంతరం స్నానం చేసేందుకు వీరన్నచెరువులోకి వెళ్లారు. కాసేపటికి తోటి స్నేహితులు బయటకు రాగా శ్రవణ్, శంకర్ ఆచూకీ గల్లంతైంది.
- సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి చెందిన దాదాపు 10 మంది స్నేహితులు హోలీ సంబురాల తర్వాత సదర్ చెరువులో స్నానానికి వెళ్లారు. శివ అనే వ్యక్తి ఈత రాకపోవడంతో చెరువులోని పుట్టి (గంప) ఎక్కాడు. అది గాలి వేగానికి ముందుకెళ్తుండటంతో గమనించిన సత్యనారాయణ కుమారుడు బండి రాజేష్ (28) ఈత సరిగ్గా రాకపోయినా పుట్టిను వెనక్కి తెచ్చేందుకు ముందుకెళ్లి నీటమునిగి గల్లంతయ్యాడు.
- రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నందుపల్లి గ్రామానికి చెందిన యువకులు సంగెం జగన్ (27), కొమ్ము సురేందర్ (28), లింగి సాయి, దేశపాగ శివ, లింగి సతీష్, పెద్ద గోల్కొండకు చెందిన చంటి మరికొందరు స్నేహితులతో కలసి గ్రామ శివారులోని చెరువు వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో జగన్, సురేందర్ ఈత కొడుతూ చెరువు మధ్యలోకి వెళ్లి తిరిగి ఒడ్డుకు వస్తుండగా ఆయాసం రావడంతో ఒకరినొకరు పట్టుకొని నీటిలో మునిగిపోయి మృతిచెందారు.
- ఆదిలాబాద్ పట్టణంలోని జై జవాన్‌నగర్ కాలనీకి చెందిన గుమ్ముల సాత్విక్ (14) హోలీ వేడుకల్లో పాల్గొన్నాక స్నానం చేసేందుకు మిత్రులతో కలసి సమీపంలోని వాగులోకి దిగాడు. ఈత రాక నీటమునిగిన అతన్ని ఈతగాళ్లు వాగు నుంచి తీసి రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.
- మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం ధర్మారం గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి గోపులపురం కార్తీక్(18) పాత మామిడిపల్లిలోని అమ్మమ్మ ఇంటికి ఇటీవల వచ్చాడు. హోలీ వేడుకల్లో పాల్గొన్నాక గూడెం ఎత్తిపోతల డెలివరీ పాయింట్ వద్ద కడెం ప్రధాన కాలువలో స్నానం చేసేందుకు వెళ్లి ఈత రాక నీటిమునిగి మృతిచెందాడు.
- హోలీలో రంగులు చల్లుకున్నాక హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పలివేల్పులలోని ఎస్సారెస్పీ కాల్వలో స్నానానికి వెళ్లి ఇద్దరు యువకులు మృతిచెందారు. మృతులను దామెర మండలం ఊరుగొండకు చెందిన తక్కళ్ల కేదారేశ్వర్ (45), ముప్పు క్రాంతికుమార్ (35)గా గుర్తించారు.
- హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శ్రీరాముపల్లికి చెందిన రాపాక బ్రహ్మచారి (40) హోలీ వేడుకల అనంతరం కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం హసన్‌పర్తి మండలం గుండ్లసింగారం సమీపంలోని ఎస్సారెస్పీ కాల్వలోకి దిగి గల్లంతయ్యాడు.
- ములుగు జిల్లా వెంకటాపురం (ఎం) మండలం లక్ష్మీదేవిపేటకు చెందిన ఎంబడి శృశాంత్ (21), తిమ్మాపూర్‌కు చెందిన ఉమ్మడి ఉమేష్ (21) స్థానిక మిత్రులతో కలసి హోలీ ఆడిన అనంతరం రామప్ప చెరువు దగ్గర కాల్వలో స్నానాలు చేశారు. ద్విచక్రవాహనంపై రామప్ప నుంచి వెంకటాపురం వైపు వస్తుండగా లక్ష్మీపురం వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొట్టారు. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు.
- హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గోపాల్‌పూర్ శివారులో నలుగురు స్నేహితులు హోలీ వేడుకలు జరుపుకుని వస్తుండగా ఆటో బోల్తా పడింది. దీంతో నడికూడ మండలం చెర్లపల్లికి చెందిన శనిగరపు వంశీ (27) మృతిచెందాడు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.

అప్పులు తీరడం లేదని.. యువ రైతు ఆత్మహత్య



పెద్దేముల్: సోదరి వివాహం కోసం చేసిన అప్పులు తీరడం లేదని మనస్తాపానికి గురైన ఓ యువరైతు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మారేపల్లి వెంకటయ్యకు ఇద్దరు భార్యలు పుష్పమ్మ, పద్మమ్మ ఉన్నారు. వీరికి ఆరుగురు సంతానం. రెండో భార్య కుమారుడు శ్రీనివాస్ (28)కు వివాహం కాలేదు. వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబ పోషణ చూసుకుంటున్నాడు. నాలుగేళ్ల కిందట సోదరి వివాహానికి అప్పు చేశాడు. సమయం దాటినా అప్పు తీర్చకపోవడంతో ఒత్తిడి ఎక్కువైంది. పది రోజులుగా ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు చెబుతూ బాధపడ్డాడు. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. శ్రీనివాస్ బాబాయి కృష్ణయ్య సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లగా.. చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. మృతుడి తల్లి పద్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరి తెలిపారు.

ఉత్కంఠగా పిడిగుద్దులాట

- హోలీ పండుగ వేళ...ఆనవాయితీ
- రెండు గ్రూపులుగా విడిపోయి బాదుకున్న హున్సా గ్రామస్తులు



మెదక్ జిల్లా శివ్వంపేట మండలం కొంతన్‌పల్లిలో పిడిగుద్దుల ఆట

బోధన్: హోలీ పండుగ వేళ హున్సా గ్రామస్తులు రెండు గ్రూపులుగా విడి పోయి పిడిగుద్దులాడుకున్నారు. 130 ఏళ్ల నుంచి మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న నిజామాబాద్ జిల్లా సాలూర మండలం హున్సా గ్రామంలో ఇది ఆనవాయితీగా సాగుతోంది. గ్రామ సుభిక్షం ఉండాలనే మా పూర్వీకుల నుంచి దీనిని జరుపుకుంటున్నామని గ్రామపెద్దలు తెలిపారు. గ్రామం మధ్యలోని హనుమాన్ మందిరం ఎదుట సోమవారం వేదిక ఏర్పాటు చేశారు. నాలుగైదు ఫీట్ల ఎత్తయిన కర్ర స్తంభాలు పాతి, మధ్యలో పొడువున గట్టి తాడు కట్టారు. సాయంత్రం గ్రామ శివారులో కుస్తీ పోటీలు ముగించుకొని ఈ ఆటకు సిద్ధమయ్యారు. గ్రామస్తులు రెండు గ్రూపులుగా విడిపోయి పిడిగుద్దులాట ప్రారంభించారు. బిగిపిడికిలి బిగించి ఒకరినొకరు బాదుకున్నారు. సాయంత్రం 6.22 గంటల నుంచి 15 నిమిషాల పాటు ఆట కొనసాగింది. గ్రామ పెద్దల సూచన మేరకు ఆటను విరమించారు. తదనంతరం ఇరుపక్షాల వారు ఆలింగనం చేసుకుని హోలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

కొంతన్‌పల్లిలోనూ...

శివ్వంపేట(నర్సాపూర్): మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధిలోని కొంతన్‌పల్లిలో సోమవారం హోలి సంబురాలు ప్రత్యేకంగా జరుపుకున్నారు. గ్రామంలోని ప్రధాన కూడలి వద్దకు గ్రామస్తులు చేరుకొని రెండు గ్రూపులుగా విడిపోయి తాడు కట్టి లాగారు. అనంతరం పరస్పరం పిడిగుద్దులు గుద్దుకున్నారు. ఈ ఆటను చూసేందుకు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

పంటల బీమాకు కేంద్రం ఓకే

▶ మొదటి పేజీ తరువాయి

అయ్యే అవకాశాలు తక్కువగానే ఉన్నాయని అంటున్నారు.

క్లస్టర్ల వారీగా అమలు

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతులకు అనుకూలంగా లేదన్న భావనతో ఈ పథకం నుంచి 2020లో బయటకు వచ్చింది. అయితే ఏదో ఒక పంటల బీమా పథకం ఉండటమే మేలన్న భావన కొందరు రైతుల్లో ఉంది. దీంతో చివరకు కాంగ్రెస్ ప్రభుత్వం పాత పథకాన్నే అమలు చేయనుంది. దీంతో ప్రకృతి వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ పథకాన్ని క్లస్టర్ల వారీగా అమలు చేయనున్నారు. గతంలో అప్పటి ప్రభుత్వం ఆరు క్లస్టర్లు ఏర్పాటు చేసింది. ఆ ప్రకారమే ఈసారి కూడా ముందుకు సాగే అవకాశాలున్నాయి.

ప్రీమియం ఇలా...

వానాకాలం సీజన్‌లో సాగుచేసే ఆహారధాన్యాల పంటలకు 2 శాతం ప్రీమియం రైతులు చెల్లించాలి.

- పత్తి, మిర్చి సహా ఇతర వాణిజ్య, వాతావరణ ఆధారిత పంటలకు మాత్రం 5 శాతం రైతులు ప్రీమియం చెల్లించాలి.

అయితే జిల్లాలను బట్టి, అక్కడి వాతావరణ పరిస్థితులను బట్టి ప్రీమియం రేటు మారుతుండేది. అయితే ఈసారి రైతు వాటా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుందని ఇప్పటికే పలువురు మంత్రులు ప్రకటించారు. కాబట్టి రైతులంతా ఈ పథకంలోకి వస్తారు. మరోవైపు ఈ పథకాన్ని అమలు చేసేందుకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో కమిటీలు ఏర్పాటు కానున్నాయి. దీనికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

బీమా అమలుకు సూచనలు

పంటల బీమా పథకం రాష్ట్రంలో అమలు చేయాలంటే ప్రభుత్వం కొన్ని చర్యలు చేపట్టాలని పలువురు అధికారులు, వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

క్లస్టర్–1: ఆదిలాబాద్, మంచిర్యాల, కొమురంభీం, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట
క్లస్టర్–2: నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, యాదాద్రి, రంగారెడ్డి
క్లస్టర్–3: పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ
క్లస్టర్–4: ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, సంగారెడ్డి, మెదక్
క్లస్టర్–5: భద్రాద్రి, వరంగల్, హనుమకొండ, వనపర్తి
క్లస్టర్–6: మేడ్చల్, మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, వికారాబాద్, మహబూబాబాద్ జిల్లాలున్నాయి.

- బీమా కంపెనీలు ప్రీమియం ధరలను ఏటేటా భారీగా పెంచుతుంటాయి. ఈ పద్ధతి మార్చాలి.
- కంపెనీలు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు, సిబ్బందిని ఏర్పాటు చేసుకోవడం లేదు. జిల్లా స్థాయిలో అధికారులు ఉండటం లేదు. దీంతో రైతులకు బీమాపై అవగాహన కల్పించే పరిస్థితి లేకుండా పోయింది.
- కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బీమా ప్రీమియం చెల్లించిన మూడు వారాల్లోగా రైతులకు పరిహారం ఖరారు చేయాలి. గతంలో నెలల తరబడి ఆలస్యం చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు.
- రైతుల ఫిర్యాదులు వినడానికి, పరిష్కరించడానికి కచ్చితమైన యంత్రాంగం జిల్లా, రాష్ట్రస్థాయిలో నెలకొల్పాలి.
- చిన్నచిన్న అంశాలను ఆధారం చేసుకొని పంటల బీమాను రైతులకు అందకుండా చేస్తున్నారు. ఇది పథకం అమలును నీరుగారుస్తుంది.
- వివిధ దశల్లో విధిస్తున్న షరతులు, నిబంధనల కారణంగా బీమా నష్టపరిహారం పొందడం గగనంగా మారింది. వీటిని మార్చాలి.

మున్నూరుకాపు నాయకులను టార్గెట్ చేయడం సరికాదు

ఎస్.పి.క్రాంతికుమార్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉందని, ఏ అంశాలపైనైనా నేతలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తూనే ఉంటారని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు యువమండలి ప్రధాన కార్యదర్శి ఎస్.పి.క్రాంతికుమార్ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. మున్నూరుకాపు సామాజిక వర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు తమ అభిప్రాయాలు చెబితే వారిని టార్గెట్ చేయడం సరికాదన్నారు. మున్నూరుకాపు సామాజిక వర్గం నాయకులకు స్వేచ్ఛ లేనట్లు వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో ఏళ్లు కష్ట పడిన, పార్టీ బలోపేతం కోసం కష్టపడిన నాయకులకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ టికెట్ నిరాకరించిందన్నారు. కేవలం నలుగురికే అసెంబ్లీ టికెట్ ఇచ్చారని క్రాంతికుమార్ తెలిపారు. ఇది మున్నూరుకాపు సీనియర్ నేతలను తీవ్రంగా అవమానించినట్లేనన్నారు.

హోలీ సంబరాల్లో మహిళపై దాడి

ఆస్పత్రికి తరలింపు.. పరిస్థితి విషమం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమ

జగిత్యాల క్రైం: హోలీ వేడుకల సందర్భంగా జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటలో రెండువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బోగు ప్రకాశ్ హోలీ ఆడుతూ కోడిగుడ్డు విసిరాడు. అది రిషి అనే వ్యక్తికి తగిలింది. ఎందుకు కొట్టావని ప్రకాశ్‌ను రిషి నిలదీయడంతో ఆగ్రహంతో ప్రకాశ్ రిషిపై దాడిచేశాడు. తన కుమారుడిని ఎందుకు కొడుతున్నావని రిషి తల్లి మాడిశెట్టి రమ అడ్డుకోబోగా ఆమెపై ప్రకాశ్ కొడవలితో దాడి చేశాడు. మెడపై తీవ్ర గాయాలైన రమను స్థానికులు జగిత్యాల ఆస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. రమ కుటుంబానికి, ప్రకాశ్ కుటుంబానికి పాత కక్షలు ఉండటంతోనే దాడి జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. రూరల్ ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మహిళ పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు.




సోమవారం హోలీ సందర్భంగా ఓయూలో విద్యార్థుల సంబరాలు

బీజాపూర్ జిల్లాలో దారుణం

- పట్టపగలే ముగ్గురిని నరికిన గుర్తుతెలియని వ్యక్తులు
- అక్కడికక్కడే ఇద్దరు మృతి, ఆస్పత్రిలో ఇంకొకరు కన్నుమూత
- మావోయిస్టు పార్టీ యాక్షన్ టీం సభ్యుల పనేనని అనుమానాలు



చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో సోమవారం దారుణం చోటుచేసుకుంది. అంతా హోలీ వేడుకల్లో మునిగి ఉన్న సమయంలో మావోయిస్టులుగా భావిస్తున్నవారు ముగ్గురిపై కత్తులు, గొడ్డళ్లతో దాడి చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా బాసగూడలో హోలీ వేడుకలు జరుపుకున్న యువకులు సమీపంలోని నదిలో స్నానానికి వెళ్లారు. ఈ సమయంలో సాధారణ దుస్తుల్లో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు.. మిడియం చంద్రయ్య, బండారి అశోక్, కారం రమేశ్‌పై కత్తులు, గొడ్డళ్లతో దాడికి దిగారు. దీంతో మిగిలిన యువకులంతా పారిపోయారు. ఈ దాడిలో చంద్రయ్య, అశోక్ తీవ్రంగా గాయపడి ఘటనాస్థలిలోనే మృతి చెందారు. కొంతసేపటి తర్వాత దాడికి పాల్పడిన వారు వెళ్లిపోగా గ్రామస్తులు అక్కడికి చేరుకొని ప్రాణాపాయ స్థితిలో ఉన్న రమేశ్‌ను బాసగూడలో ప్రథమ చికిత్స అనంతరం బీజాపూర్ జిల్లా కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన సోమవారం రాత్రి మృతి చెందాడు. కాగా, ఈ ఘటనపై పోలీసులు ఎలాంటి ప్రకటన చేయలేదు. మావోయిస్టు పార్టీ యాక్షన్ టీం సభ్యులే ఘటనకు పాల్పడి ఉండొచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు.


చిరాగ్

అబ్బాయి వర్సెస్ బాబాయి

పశుపతిపై చిరాగ్ పాశ్వాన్ పోటీ • హాజీపూర్‌లో ఆసక్తికర వారసత్వ పోరు

జాతీయ రాజకీయాల్లో మరో ఆసక్తిక రమైన వారసత్వ పోరుకు తెర లేచింది. బిహార్లో దిగ్గజ నేత దివంగత రాం విలాస్ పాశ్వాన్ వారసత్వం కోసం ఆయన కుమారుడు చిరాగ్, సోదరుడు పశుపతి కుమార్ పారస్ మధ్య జరుగుతున్న పోరు తుది దశకు చేరుకుంది. పాశ్వాన్ ఏకంగా ఎనిమిది సార్లు ఎంపీగా నెగ్గిన హాజీపూర్ లోక్‌సభ స్థానంలో ఈసారి వారిద్దరూ నేరుగా అమీతుమీ తేల్చుకోనున్నారు...

పాశ్వాన్ల కంచుకోట

హాజీపూర్ లోక్‌సభ స్థానంతో పాశ్వాన్‌లది విడదీయరాని బంధం. లోక్ జనశక్తి పార్టీ వ్యవస్థాపకుడు రాం విలాస్ పాశ్వాన్ 1977 లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారిగా అక్కడ విజయం సాధించారు. మధ్యలో 1984, 2009 మినహా మరో ఏడుసార్లు హాజీపూర్ నుంచే నెగ్గారు. అనారోగ్య కారణాలతో పాశ్వాన్ రాజ్యసభకు వెళ్లడంతో తమ్ముడు పశుపతి 2019లో తొలిసారి హాజీపూర్ నుంచి పోటీ చేసి నెగ్గారు. చిరాగ్ 2014తో పాటు 2019లోనూ జముయ్ లోక్‌సభ స్థానం నుంచి నెగ్గారు. 2020లో పాశ్వాన్ మృతి చిరాగ్, పశుపతి మధ్య వారసత్వ పోరుకు దారితీసింది. పాశ్వాన్ వారసుడిని తానేనని పశుపతి ప్రకటించుకోవడంతో ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరిస్తానని చిరాగ్ హెచ్చరించారు. పశుపతి మిగతా నలుగురు ఎల్జేపీ ఎంపీలతో కలిసి తిరుగుబావుటా ఎగరేయడంతో వారందరినీ పార్టీ నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించారు. చివరికి వివాదం ఎన్నికల సంఘం వద్దకు చేరింది. ఎల్జేపీ పేరును, పార్టీ గుర్తును ఈసీ స్తంభింపజేసి పశుపతి వర్గానికి రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ (ఆర్ఎల్జేపీ), చిరాగ్‌కు ఎల్జేపీ (రాం విలాస్) పేర్లు కేటాయించింది. 2020 బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఎన్డీఏతో చిరాగ్ తెగదెంపులు చేసుకున్న నేపథ్యంలో పశుపతి 2021లో ఎన్డీఏలో చేరి కేంద్ర మంత్రి అయ్యారు.

చిరాగ్ ఇన్, పశుపతి ఔట్

ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బిహార్లో 40 స్థానాలనూ క్లీన్‌స్వీప్ చేయడం లక్ష్యం పెట్టుకున్న బీజేపీ మరోసారి చిరాగ్‌ను చేరదీసింది. అలా మళ్లీ ఎన్డీఏలో చేరిన చిరాగ్, పొత్తులో భాగంగా తమకు కేటాయించే 5 స్థానాల్లో హాజీపూర్ ఉండాల్సిందేనని పట్టుబట్టి సాధించుకున్నారు. దాంతో పశుపతి తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. దీనికి తోడు ఆర్ఎల్జేపీకి బీజేపీ ఒక్క సీటు కూడా కేటాయించకపోవడంతో వారం క్రితం కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారు. తాను హాజీపూర్ నుంచి పోటీ చేయడం ఖాయమని ప్రకటించారు. తనతో పాటు మిగతా నలుగురు ఎంపీలు కూడా మళ్లీ బరిలో దిగి తీరతారని స్పష్టం చేశారు. బాబాయిని ఓడిస్తే పాశ్వాన్ల కంచుకోటైన హాజీపూర్ హస్తగతమవడమే గాక తండ్రి వారసత్వం పూర్తిగా తనదేనని రుజువవుతుందనే భావనతో చిరాగ్ అక్కడి నుంచి బరిలో దిగుతున్నారు.

హాజీపూర్‌లో ఎస్సీ సామాజిక వర్గానికి దాదాపు 4 లక్షల ఓట్లున్నాయి. దీనికి తోడు 1.5 లక్షల దాకా ముస్లిం ఓట్లున్నాయి. యాదవులు, రాజ్‌పుత్‌లు, భూమిహార్లతో పాటు కుష్వాహాలు, పాశ్వాన్లు, రవిదాస్ వంటి అత్యంత వెనకబడ్డ సామాజిక వర్గాలకు కూడా చెప్పుకోదగ్గ ఓటు బ్యాంకుంది. ఈ వర్గాలకు రాం విలాస్ పాశ్వాన్ తిరుగులేని నేతగా కొనసాగారు. 1977లో ఆయన సాధించిన 4.69 లక్షల మెజారిటీ గిన్నిస్ రికార్డుకెక్కింది! 1989లో ఏకంగా 5 లక్షల పై చిలుకు మెజారిటీ సాధించారాయన.


పశుపతి

– సాక్షి, నేషనల్ డెస్క్

గాజాలో తక్షణమే కాల్పుల విరమణ



- ఐరాస భద్రతా మండలి తీర్మానం
- అనుకూలంగా ఓటేసిన రష్యా, చైనా సహా 14 దేశాలు
- ఓటింగ్‌లో పాల్గొనని అమెరికా

ఐక్యరాజ్యసమితి: ఇజ్రాయెల్–హమాస్ మధ్య వివాదం మొదలైన అయిదు నెలల తర్వాత సోమవారం కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రస్తుత రంజాన్ మాసంలో గాజాలో తక్షణమే కాల్పుల విరమణ అమలు చేయాలని సంబంధిత వర్గాలను కోరుతూ ఐరాస భద్రతా మండలి తీర్మానాన్ని ఆమోదించింది. 15 సభ్యదేశాలతో కూడిన మండలిలోని 10 తాత్కాలిక సభ్యదేశాలు ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టాయి. రష్యా, చైనా సహా 14 దేశాలు అనుకూలంగా ఓటేశాయి. ఎవరూ వ్యతిరేకించనప్పటికీ శాశ్వత సభ్య దేశం అమెరికా ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయింది. 'గాజా విషయంలో ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న తీర్మానాన్ని భద్రతా మండలి ఆమోదించింది. తక్షణమే కాల్పుల విరమణ జరగాలని, బేషరతుగా బందీలందరినీ విడుదల చేయాలని కోరింది' అని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ 'ఎక్స్'లో తెలిపారు. అలాగే, గాజాలో చిక్కుకున్న పాలస్తీనియన్ల వైద్య, ఇతర మానవతా అవసరాలను పరిష్కరించాలని, నిర్బంధించిన వారందరికీ అంతర్జాతీయ చట్టాల ప్రకారం కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత వర్గాలపై ఉందని తీర్మానం పేర్కొంది. 'ఈ తీర్మానాన్ని కచ్చితంగా అమలు చేయాల్సిందే. వైఫల్యం క్షమించరానిది' అంటూ అని గుటెరస్ వ్యాఖ్యానించారు. మండలి తీర్మానంపై ఇజ్రాయెల్ తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందని ఐరాస హ్యూమన్ రైట్స్ వాచ్ డైరెక్టర్ ల్యూయిస్ పేర్కొన్నారు. పాలస్తీనా ప్రజల ఆకలిచావులను ఆపేందుకు మానవతా సాయం అందించేందుకు వీలు కల్పించాలని, చట్ట విరుద్ధ దాడులను ఆపాలని ఇజ్రాయెల్‌ను కోరారు.

అమెరికా పర్యటనను రద్దు చేసుకున్న నెతన్యాహు

ఐరాస తీర్మానానికి నిరసనగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఉన్నత స్థాయి బృందంతో తన అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. పాలస్తీనా శరణార్థుల ఏజెన్సీకి సహకారం నిలిపివేయాలని కూడా ఇజ్రాయెల్ నిర్ణయించింది. గతేడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులు చేయడం, ప్రతిగా గాజాపై ఇజ్రాయెల్ తీవ్రస్థాయి యుద్ధంతో విరుచుకుపడుతుంటం తెలిసిందే.

వాట్సాప్‌లో త్వరలో ఏఐ ఇమేజ్ ఎడిటర్!

వాషింగ్టన్: కృత్రిమ మేధ (ఏఐ) అందుబాటులోకి వచ్చాక దానిని విరివిగా వాడేందుకు జనం ఎంతో ఉత్సాహం చూపిస్తున్నారు. తాము వాడే యాప్‌లలో ఏఐ ఉంటే దాని సాయంతో సరదా సరదా ప్రయోగాలు చేస్తుంటారు. దీంతో ఫొటోలు, ఇమేజ్‌లను ఎడిట్ చేసే ఏఐ ఆధారిత ఫీచర్ త్వరలో ప్రముఖ సామాజిక మాధ్యమం వాట్సాప్‌లో అందుబాటులోకి వచ్చే అవకాశ ముంది. బీటా వెర్షన్ వినియోగదారులకు మొదట దీనిని వాడే అవకాశం ఇవ్వొచ్చని 'వెబ్‌బీటాఇన్ఫో' తన కథనంలో పేర్కొంది.

ఆ ఫీచర్ అందుబాటులోకి వస్తే..

యాప్‌లోని ఆప్షన్లను తమ అభిరుచికి అనుగుణంగా వాడుకుంటున్న యూజర్లు.. ఈ కొత్త ఫీచర్ కోసం ఎదురుచూస్తున్నారు. ఇది అంబుబాటులోకి వస్తే ఇమేజ్‌ను తమకు నచ్చినట్లుగా ఎడిట్ చేసుకోవచ్చు. ఇమేజ్ సైజు, బ్యాక్‌గ్రౌండ్‌లను మార్చుకోవచ్చు. ఆండ్రాయిడ్ 2.24.7.13 వెర్షన్‌ను అప్‌డేట్ చేసుకున్న వాళ్లకు ఏఐ ఇమేజ్ ఎడిటర్ ఫీచర్ ప్రాథమిక కోడ్‌ను అందుబాటులోకి తేవచ్చు. బేటా ప్రోగ్రామ్‌లో భాగస్వాములైన టెస్టర్లనే తొలుత దీనిని వాడేందుకు అనుమతిస్తారు. సెర్చ్ బార్‌లో టైప్‌చేసి నేరుగా ఏఐ సర్వీస్‌తోనే చాటింగ్ చేసి కావాల్సిన ఫలితాలు పొందే ఫీచర్‌పైనా వాట్సాప్ కసరత్తు చేస్తోంది. వాయిస్ నోట్ వచ్చే సందేశాలనూ ఓపెన్ చేయకుండానే టెక్స్ట్ రూపంలో చదవగలిగేలా మరో ఫీచర్‌ను యూజర్లకు అందివ్వాలని వాట్సాప్ భావిస్తోంది.

ఆ నినాదాలను త్యజించే దమ్ము సంఘ్ పరివార్‌కు ఉందా?

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సవాల్



మలప్పురం(కేరళ): స్వాతంత్రోద్యమ వేళ దేశాన్ని ఒక తాటి మీదకు తెచ్చిన జాతీయస్థాయి నినాదాలు పురుడుపోసుకోవడంలో ముస్లింల పాత్ర కూడా ఉందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించారు. సంఘ్ పరివార్ శ్రేణుల్లో ఎప్పుడూ ప్రతిధ్వనించే రెండు నినాదాలను వాస్తవానికి ముస్లింలు తొలిసారిగా ఎలుగెత్తి చాటారని విజయన్ అన్నారు. వివాదాస్పద పౌరసత్వ(సవరణ)చట్టాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) నేతృత్వంలో నాలుగురోజులుగా జరుగుతున్న ర్యాలీలో విజయన్ పాల్గొని ప్రసంగించారు. ముస్లింల జనాభా ఎక్కువగా ఉండే మలప్పురం జిల్లాలోనే ఈ సభ జరగడం గమనార్హం. ''ముస్లిం పాలకులు, సాంస్కృతిక సారథులు, ముస్లింలు ఉన్నతాధికారులు ఎందరో దేశ చరిత్ర, స్వతంత్ర సంగ్రామంలో పాలుపంచుకున్నారు. వీటిపై ఏమాత్రం అవగాహన లేని సంఘ పరివార్ నేతలు ఇక్కడికొచ్చి భారత్ మాతాకీ జై అని నినదించాలని డిమాండ్లుచేస్తున్నారు. వాస్తవానికి భారత్ మాతాకీ జై, జైహింద్ అని నినదించింది ముస్లింలని సంఘ పరివార్‌కు తెలీదనుకుంటా. తెలిస్తే ఆ నినాదాలను ఇవ్వడం సంఘ్ పరివార్ మానుకుంటుందా? అజీముల్లా ఖాన్ భారత్ మాతాకీ జై అంటే, అబిద్ హసన్ అనే భారత దూత 'జైహింద్' అని నినదించారు. మొఘల్ చక్రవర్తి షాజహాన్ తనయుడు దారా షికోహ్ సంస్కృతంలో ఉన్న 50 ఉపనిషత్తులను పర్షియన్‌లోకి తర్జుమాచేశారు. అలా భారతీయ రచనలు విశ్వవ్యాప్తమయ్యేలా తన వంతు కృషిచేశారు. ఇవేం తెలియని సంఘ్ నేతలు భారత్‌లోని ముస్లింలను పాకిస్తాన్‌కు పంపేయాలని మొండిపట్టు పడుతుంటారు. సీఏఏతో ముస్లింలను రెండో శ్రేణి పౌరులుగా మార్చాలని మోదీ సర్కార్ కుట్ర పన్నింది. వీటిని కేరళ పౌరులు సహించరు'' అన్నారు. సీఏఏ వ్యతిరేక ఉద్యమాన్ని ఉధృతం చేయంపై కాంగ్రెస్‌కు పెద్దగా ఆసక్తి లేదని ఆరోపించారు. హిట్లర్ నియంతృత్వ పోకడల నుంచే ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు పురుడుపోసుకున్నాయని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. క్రైస్తవులు, ముస్లింలు, కమ్యూనిస్టులు దేశ అంతర్గత శత్రువులని ఆర్ఆర్ఎస్ సిద్ధాంతకర్తల్లో ఒకరైన ఎంఎస్ గోల్వాల్కర్ గతంలో ఒక పుస్తకంలో వ్యాఖ్యానించారని విజయన్ గుర్తుచేశారు.

ఎలక్షన్ బీట్

స్పీకర్ ఓం బిర్లాపై ప్రహ్లాద్ పోటీ

కాంగ్రెస్ అభ్యర్థుల ఆరో జాబితా విడుదల

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడే కొద్దీ కాంగ్రెస్ పార్టీ ఒక్కో స్థానంలో అభ్యర్థుల్ని ప్రకటిస్తూనే వెళ్తోంది. తాజాగా మరో ఐదు స్థానాల్లో అభ్యర్థుల్ని ప్రకటించింది. దీంతో కలిపి పార్టీ ఇప్పటిదాకా ఆరు జాబితాలను వెల్లడించింది. తాజా జాబితా ప్రకారం రాజస్థాన్‌లోని కోటా ఎంపీ స్థానం నుంచి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు పోటీగా తమ అభ్యర్థి ప్రహ్లాద్ గుంజల్‌ను కాంగ్రెస్ రంగంలోకి దింపుతోంది. అజ్మీర్ నుంచి రామ్‌చంద్ర చౌదరి, రాజ్‌సమంద్ నుంచి సుదర్శన్ రావత్, బిల్వారా నుంచి దామోదర్ గుర్జార్, తిరునల్వేలి నుంచి సి.రాబర్ట్ బ్రూస్ పోటీ చేస్తారు. బీజేపీ ఉండగా మాజీ రాజస్థాన్ మహిళా ముఖ్యమంత్రి వసుంధరా రాజేకు ప్రహ్లాద్ గుంజల్ నమ్మిన బంటుగా ఉండేవారు. గత గురువారమే కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఈయనకు సీటు దక్కడం విశేషం. నార్త్ కోటా నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఈయన గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని చవిచూశారు. తాజా జాబితాతో కలుపుకుని కాంగ్రెస్ ఇప్పటిదాకా 190 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది.

నాగౌర్ నుంచి బరిలో బేనివాల్

జైపూర్: ప్రతిపక్ష ఇండియా కూటమి తరఫున రాజస్తాన్‌లోని నాగౌర్ లోక్‌సభ స్థానం నుంచి రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ (ఆర్ఎల్‌పీ)కి చెందిన హనుమాన్ బేనివాల్ పోటీ చేయనున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇక్కడ గెలిచిన బేనివాల్ గత డిసెంబర్‌లో ఎమ్మెల్యేగా నెగ్గడంతో ఈ సీటు ఖాళీ అయ్యింది. ఇప్పుడక్కడ బీజేపీకి చెందిన జ్యోతి మిర్ధాతో బేనివాల్ తలపడనున్నారు. ఇద్దరూ జాట్ నేతలే. గతంలో బీజేపీ మిత్రపక్షంగా ఉన్న ఆర్ఎల్‌పీ 2020 డిసెంబర్‌లో రైతు సంఘాల ఆందోళన నేపథ్యంలో ఎన్డీఏతో తెగదెంపులు చేసుకుంది.

'మోదీ అంటే చెంపలు వాయించాలి'

బెంగళూరు: మోదీ, మోదీ..అంటూ నినదించే యువకులు, విద్యార్థుల చెంపలు వాయించాలంటూ కర్ణాటక మంత్రి శివరాజ్ తంగడగి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ''ఒక్క అభివృద్ధి పని కూడా చేయని బీజేపీ నేతలకు ఓట్లడిగేందుకు సిగ్గుండాలి. ఉద్యోగాలడిగితే పకోడీలు అమ్ముకోమంటున్నారు'' అన్నారు. ఆయనపై బీజేపీ మండిపడింది. మంత్రిపై చర్యలు తీసుకోవాలని, ప్రచారానికి దూరంగా ఉంచాలంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది.

బీజేపీ గూటికి గాలి జనార్దన్ రెడ్డి

సాక్షి, బెంగళూరు: కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డి సోమవారం తిరిగి బీజేపీ గూటికి చేరుకున్నారు. తన కల్యాణ కర్ణాటక ప్రగతి పక్ష (కేఆర్‌పీపీ) పార్టీని బీజేపీలో విలీనం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర, మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప ఆయనకు కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు.

ప్రధానిపై వ్యాఖ్యలు..తమిళ మంత్రిపై కేసు

చెన్నై: ప్రధాని నరేంద్ర మోదీపై అభ్యంతరకర వ్యాఖ్యల ఉదంతంలో తమిళనాడు మత్స్య శాఖ మంత్రి అనితా ఆర్.రాధాకృష్ణన్‌పై కేసు నమోదైంది. ఈ నెల 22న డీఎంకే సమావేశంలో మోదీపై మంత్రి అభ్యంతకరంగా మాట్లాడారని బీజేపీ ఫిర్యాదు చేసింది. మంత్రిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది.

నేడు ప్రధాని నివాసం వద్ద ఆప్ ఘెరావ్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా మంగళవారం మోదీ నివాసాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ దిగ్బంధించనుంది. అరెస్ట్ అక్రమమంటూ శనివారం నుంచి ఆప్ దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తుండటం తెలిసిందే. మంగళవారం ప్రధాని నివాస దిగ్బంధంలో ఇండియా కూటమి పార్టీల నేతలు కూడా పాల్గొంటారని ఆప్ నేతలు ప్రకటించారు.

ఐర్లాండ్ ప్రధానిగా సిమోన్ హారిస్

లండన్: ఐర్లాండ్ ప్రధానిగా అత్యంత పిన్న వయస్కుడైన సిమోన్ హారిస్ (37)బాధ్యతలు చేపట్టనున్నారు. భారత సంతతికి చెందిన ప్రధాని లియో వరాద్కర్ రాజీనామా చేయడం తెలిసిందే. ఆయన కేబినెట్‌లో సిమోన్ ఉన్నత విద్యా మంత్రిగా చేశారు. వరాద్కర్ 2017–2020, 2022–2024 మధ్య రెండుసార్లు ప్రధానిగా ఉన్నారు. తాను గే అని ప్రకటించుకున్న తొలి ఐర్లాండ్ ప్రధాని ఆయన. తొలిసారి ప్రధాని అయినప్పుడు ఆయనకు 38 ఏళ్లే!

జేఎన్‌యూఎస్‌యూకు దళిత ప్రెసిడెంట్

న్యూఢిల్లీ: ప్రఖ్యాత జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్(జేఎన్‌యూఎస్‌యూ) అధ్యక్షుడిగా మొదటిసారిగా వామపక్ష సంఘాలు బలపరిచిన దళిత విద్యార్థి ఎన్నికయ్యాడు. ఆదివారం జరిగిన జేఎన్‌యూఎస్‌యూ ఎన్నికల్లో యునైటెడ్ లెఫ్ట్ ప్యానెల్ క్లీన్ స్వీప్ సాధించగా ప్రత్యర్థి ఆర్ఎస్ఎస్ అనుబంధ ఏబీవీపీ ఒక్క పోస్టూ గెలుచుకోలేకపోయింది. వామపక్ష విద్యార్థి సంఘాలు బలపరిచిన దళిత విద్యార్థి బట్టి లాల్ బైరవ 1996–97లో జేఎన్‌యూఎస్‌యూకు తొలిసారిగా ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యాడు.

షాంపూ బాటిళ్లలో రూ.19 కోట్ల కొకైన్

ముంబై: బూట్లు, మాయిశ్చరైజర్, షాంపూ బాటిళ్లలో రూ.19.79 కోట్ల విలువైన సుమారు రెండు కిలోల బరువున్న కొకైన్ అనే డ్రగ్ పట్టుబడింది. ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం కెన్యాలోని నైరోబీ నుంచి వచ్చిన విమానంలో సియెర్రా లియోన్ దేశానికి చెందిన ఓ మహిళ దిగింది. ఆమె లగేజీలోని బూట్లు, మాయిశ్చరైజర్ బాటిల్, షాంపూ బాటిల్ చాలా గట్టిగా బరువుగా ఉండటంతో పరిశీలించి చూడగా వాటిల్లో ఏకంగా 1,979 గ్రాముల కొకైన్ బయటపడింది. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ రూ.19.79 కోట్లని అధికారులు తెలిపారు.

మహాకాళ్ ఆలయంలో అగ్ని ప్రమాదం

ఉజ్జయిని(మధ్యప్రదేశ్): ఉజ్జయినిలో మహాకాళ్ ఆలయంలో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. 14 మంది అర్చకులు, వారి సహాయకులు గాయపడ్డారు. ఉదయం 5.50 సమయంలో గర్భగృహంలో భస్మహారతి ఇస్తుండగా ఘటన చోటుచేసుకుంది. సోమవారం హోలీ కావడంతో పూజల్లో భాగంగా అర్చకులు గులాల్ చల్లారు. ఆ పౌడర్ హారతి పళ్లెంలోని ప్రమిదపై పడటంతో మొదలైన మంటలు క్షణాల్లోనే వ్యాపించాయని కలెక్టర్ నీరజ్ కుమార్ సింగ్ చెప్పారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. ఉజ్జయిని ఆలయంలో ఇలా జరగడం విచారకరమని ప్రధాని మోదీ అన్నారు.

భారీ ష్యూరిటీ నుంచి ట్రంప్‌కు వెసులుబాటు

న్యూయార్క్: ఆదాయం, ఆస్తుల విలువను ఎక్కువ చూపి బ్యాంకులు, బీమా సంస్థలను మోసం చేసిన కేసులో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఊరట లభించింది. సుమారు రూ.3 వేల కోట్ల భారీ మొత్తానికి బదులుగా పది రోజుల్లో రూ.1,460 కోట్ల ష్యూరిటీ బాండ్ ఇస్తే సరిపోతుందని న్యూయార్క్‌లోని అప్పీల్స్ కోర్టు సోమవారం తెలిపింది. ట్రంప్ ఈ మొత్తం చెల్లిస్తే ఆస్తుల్ని సీజ్ చేసే ప్రక్రియ నిలిచిపోతుందని స్పష్టం చేసింది. న్యూయార్క్ అటార్నీ జనరల్ లెటిటియా జేమ్స్ ఆస్తుల సీజ్‌కు సిద్ధమవుతున్న తరుణంలోనే ఈ తీర్పు రావడం గమనార్హం. రూ.3 వేల కోట్ల ష్యూరిటీ బాండ్‌ను తీసుకురావడం అసాధ్యమంటూ ట్రంప్ లాయర్లు గత వారం అప్పీల్స్ కోర్టుకు విన్నవించుకున్నారు.

రెండు రష్యా నౌకలు ధ్వంసం

కీవ్: క్రిమియా సమీపంలోని నల్ల సముద్ర జలాల్లో రష్యాకు చెందిన రెండు నౌకలను ధ్వంసం చేసినట్లు ఉక్రెయిన్ తెలిపింది. బలగాలు, యుద్ధ పరికరాలను చేరవేయడానికి వాడుతున్నట్టు వాడుతున్నట్లు తెలిపింది. రష్యా నౌకలపై దాడులను ఉక్రెయిన్‌కు చారిత్రక సందర్భంగా బ్రిటన్ రక్షణ మంత్రి గ్రాంట్ షాప్స్ అభివర్ణించారు. రష్యా నౌకాదళం ఇక్కడ 1783 నుంచే పనిచేస్తున్నప్పటికీ నల్ల సముద్ర జలాల్లో ఇకపై స్వేచ్ఛగా తిరగలేవని ఆయన అన్నారు.

వివాదాస్పదులకు మొండిచేయి

టికెట్ల కేటాయింపులో బీజేపీ కఠిన వైఖరి • ప్రజ్ఞా, బిదురి, హెగ్డే తదితరులకు నో చాన్స్

నోటిని అదుపులో పెట్టుకోకపోతే ఏం జరుగుతుందో బీజేపీ సిట్టింగ్ ఎంపీలకు బాగా తెలిసొస్తోంది. ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ సొంతంగా 370, ఎన్డీఏకు 400 పై చిలుకు లోక్‌సభ స్థానాలను కమలనాథులు లక్ష్యంగా పెట్టుకోవడం తెలిసిందే. ఆ క్రమంలో ప్రతి లోక్‌సభ స్థానాన్నీ బీజేపీ చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. 'టార్గెట్ 400' లక్ష్యసాధనకు అడ్డొస్తారనుకుంటే సొంత పార్టీ నేతలను కూడా క్షమించడం లేదు. ఆ క్రమంలో ఎంతటి సీనియర్లనైనా సరే, సింపుల్‌గా పక్కన పెట్టేస్తోంది. దాని ఫలితమే... వివాదాస్పదులుగా పేరుబడ్డ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, రమేశ్ బిదురి, అనంత్‌కుమార్ హెగ్డే వంటి సిట్టింగ్ ఎంపీలకు ఈసారి టికెట్ల నిరాకరణ!

– సాక్షి, నేషనల్ డెస్క్

రమేశ్ బిదురి



ఈ సౌత్ ఢిల్లీ సిట్టింగ్ ఎంపీ ఏకంగా పార్లమెంటులోనే అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి బీజేపీకి ఇబ్బందికర పరిస్థితులు సృష్టించారు. నిండు సభలో బీఎస్పీ ఎంపీ డానిష్ అలీని బిదురి అసభ్య పదజాలంతో దూషించడం పెనుదుమారానికి దారి తీసింది. ఆయన్నూ సస్పెండ్ చేయాల్సిందేనంటూ విపక్షాలు హోరెత్తించాయి. దాంతో రెండుసార్లు ఎంపీగా, మూడుసార్లు ఎమ్మెల్యేగా చేసిన బిదురికి టికెట్ నిరాకరించింది.

అనంత్‌కుమార్ హెగ్డే



కర్ణాటకలో సీనియర్ బీజేపీ నేత. ఆరుసార్లు లోక్‌సభ సభ్యుడు. కేంద్ర మంత్రిగానూ చేశారు. రాజ్యాంగంలో చాలా అంశాలను మార్చాల్సి ఉందని, అందుకు బీజేపీకి ప్రజలు 400కు పైగా సీట్లు కట్టబెట్టాలని ఎన్నికల వేళ ఆయన చేసిన వ్యాఖ్యలు మంటలు రేపాయి. విపక్షాలన్నీ వాటిని అందిపుచ్చుకుని బీజేపీని దుయ్యబట్టాయి. హెగ్డే వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదని బీజేపీ వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. దాంతో ఆయన నాలుగుసార్లు వరుసగా నెగ్గిన ఉత్తర కన్నడ స్థానాన్ని మాజీ స్పీకర్ విశ్వేశ్వర హెగ్డేకు కేటాయించింది.

పర్వేష్ సాహిబ్‌సింగ్



ముస్లిం చిరు వ్యాపారులను పూర్తిగా బాయ్‌కాట్ చేయాలంటూ ఏకంగా ఢిల్లీలోనే బహిరంగ సభలో పిలుపునిచ్చి కాక రేపారు. సభికులతోనూ నినాదాలు చేయించారు. దాంతో పశ్చిమ ఢిల్లీ సిట్టింగ్ బీజేపీ ఎంపీ ఆయనకు కూడా ఈసారి టికెట్ గల్లంతైంది. వీరేగాక ఇతరేతర కారణాలతో ఈసారి చాలా మంది సీనియర్లు, సిట్టింగ్ ఎంపీలకు బీజేపీ టికెట్లు నిరాకరించింది.

ప్రజ్ఞాసింగ్ ఠాకూర్



మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్ అగ్ర నేత దిగ్విజయ్‌సింగ్‌ను 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 3.5 లక్షల పై చిలుకు ఓట్ల మెజారిటీతో మట్టికరిపించిన చరిత్ర ఆమెది. . కాకపోతే మంటలు రేపే మాటలకు సాధ్వి పెట్టింది పేరు. నాథూరాం గాడ్సేను దేశభక్తునిగా అభివర్ణించినా, ముంబై ఉగ్ర దాడుల్లో అమరుడైన పోలీసు అధికారి హేమంత్ కర్కరేకు తన శాపమే తగిలిందంటూ అభ్యంతకర వ్యాఖ్యలు చేసి ఈసీ నుంచి షోకాజ్ నోటీసు అందుకున్నా ఆమెకే చెల్లింది. 195 మందితో బీజేపీ విడుదల చేసిన తొలి విడత జాబితాలో ప్రజ్ఞకు మొండిచేయి చూపారు. తాను పలు సందర్భాల్లో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలే ఇందుకు కారణమని ఆమే స్వయంగా అభిప్రాయపడ్డారు.

బాండ్లను డ్రాప్ బాక్స్‌లో పడేశారు.. ఎవరిచ్చారో తెలీదు: టీఎంసీ


కునాల్ ఘోష్

న్యూఢిల్లీ: ఎలక్టోరల్ బాండ్ల పథకం ద్వారా వందల కోట్ల విరాళాలను అందుకున్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తమ దాతలు ఎవరో తెలీయదని చెప్పొకొచ్చింది. ప్రభుత్వ ప్రాజెక్టులు, కాంట్రాక్టులను సంపాదించిన కంపెనీలే ఆయా అధికార పార్టీలకు వందల కోట్ల ముడుపులను ఎలక్టోరల్ బాండ్ల రూపంలో ముట్టజెప్పాయన్న ఆరోపణల నడుమ తృణమూల్ కాంగ్రెస్ స్పందించడం విశేషం. టీఎంసీకొచ్చిన బాండ్లపై పశ్చిమబెంగాల్‌లో సోమవారం ఒక పత్రికా సమావేశంలో ఆ పార్టీ నేత కునాల్ ఘోష్ మాట్లాడారు. ''మా పార్టీకి ఎవరు విరాళంగా ఇచ్చారో మాకు తెలీదు. ఎంత పెద్ద మొత్తాలను ఇచ్చిందీ తెలీదు. అసలు ఈ బాండ్ల పథకాన్ని తెచ్చిందే బీజేపీ. రాజకీయ పార్టీలకు నిర్వహణ వ్యయాలను ప్రభుత్వాలే భరించాలని 1990దశకం నుంచీ మమతా బెనర్జీ మొత్తుకుంటూనే ఉన్నారు. వేలకోట్ల నల్లధన ప్రవాహానికి అడ్డుకట్ట పడాలని ఆమె కాంక్షించారు. అయినా సరే ఎవరిమాటా వినకుండా బీజేపీ ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని తెచ్చింది. వేరే దారి లేక మేమూ ఆ పథకం నిబంధనలను పాటించాం. మాకు ఎన్ని బాండ్లు ఇచ్చారో, ఎవరిచ్చారో తెలీదు. సాధారణంగా పార్టీ ఆఫీస్ బయట ఒక డ్రాప్‌బాక్స్ ఉంటుంది. అందులోనే ఈ బాండ్లు ఎవరో పెట్టి వెళ్లారు. ఆ బాండ్లపై దాతల పేర్లు ఉండవు. కేవలం ఆల్ఫా–న్యూమరిక్ నంబర్ ఉంటుంది. దాత పేరు, వివరాలు బీజేపీకైతే తెలుస్తాయి. ఎందుకంటే వాళ్లే కేంద్రంలో అధికారంలో ఉన్నారు. సీబీఐ, ఈడీని తమ చెప్పుచేతల్లో ఉంచుకుని వాటి ద్వారా బెదిరించి మరీ విరాళాల వసూళ్ల పర్వాన్ని బీజేపీ యథేచ్ఛగా కొనసాగింది. బాండ్ల ద్వారా మేం అందుకున్న మొత్తాలను టీఎంసీ అధికారిక బ్యాంక్ ఖాతాల్లోనే జమచేశాం'' అని కునాల్ ఘోష్ చెప్పారు. భారతీయ స్టేట్ బ్యాంక్ ఎలక్టోరల్ బాండ్ల గణాంకాల ప్రకారం తృణమూల్ కాంగ్రెస్‌కు 10 మంది అతిపెద్ద విరాళాల దాతల నుంచే ఏకంగా రూ.1,198 కోట్లు వచ్చాయి. ఫ్యూచర్ గేమింగ్, హోటల్ సర్వీసెస్ సంస్థ ఒక్కటే టీఎంసీకి రూ.542 కోట్లు విరాళంగా ఇచ్చింది. సుప్రీంకోర్టు సూచించిన కాలపరిమితిలో ఎస్‌బీఐ నుంచి దాదాపు 1,300 సంస్థలు/వ్యక్తులు రూ.12,000 కోట్లకుపైగా విలువైన బాండ్లను కొనుగోలుచేసి 23 రాజకీయపార్టీలకు తమకు నచ్చిన మొత్తాలను విడివిడిగా విరాళంగా ఇవ్వడం తెల్సిందే. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్‌బీఐ బాండ్ల వివరాలన్నింటినీ ఎన్నికల సంఘానికి అందజేసింది.

సొంత గోల్ఫ్ క్లబ్‌లో అవార్డులు... ట్రంప్‌పై బైడెన్ విసుర్లు



వాషింగ్టన్: సొంత గోల్ఫ్ క్లబ్‌లో అవార్డులు సాధించానన్న డొనాల్డ్ ట్రంప్ ప్రకటనపై అమెరికా అధ్యక్షుడు బైడెన్ సరదాగా స్పందించారు. ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌లో ట్రంప్‌కు సొంత 'ట్రంప్ ఇంటర్నేషనల్ గోల్ఫ్ క్లబ్' ఉంది. అందులో తాజాగా అవార్డుల గోల్ఫ్ ప్రదానం జరిగింది. తనకు 'ది క్లబ్ చాంపియన్‌షిప్ ట్రోఫీ', 'ది సీనియర్ క్లబ్ మెంబర్‌షిప్ ట్రోఫీ'లు వచ్చాయంటూ సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ పోస్ట్ చేశారు. దీనిపై బైడెన్ వ్యంగ్యంగా స్పందించారు. ''అబ్బో! ఎంతటి ఘనతో! అభినందనలు'' అంటూ 'ఎక్స్'లో ఆయన పెట్టిన పోస్ట్‌కు ఏకంగా 1.3 కోట్ల వ్యూస్ వచ్చాయి. ''మీ అజమాయిషీలో లేని ఏదైనా గోల్ఫ్ క్లబ్‌లో ట్రోఫీ గెల్చుకొస్తే చెప్పవయ్యా ట్రంపూ'' అంటూ మాజీ స్పోర్ట్స్ కాలమిస్ట్ రిక్ రేలీ కూడా చురకలు వేశారు. ట్రంప్‌కు ఇలాంటివి కొత్త కాదు. తనకు పలు అవార్డులు వచ్చాయని, పలు సంస్థలు ప్రతిష్టాత్మక పురస్కారాలు ప్రదానం చేశాయని గతంలోనూ పలుమార్లు చెప్పుకున్నారు.

లండన్‌లో రోడ్డు ప్రమాదం.. భారతీయ విద్యార్థిని దుర్మరణం


గతంలో నీతిఆయోగ్ ప్రాజెక్టులో పనిచేసిన చేష్టా కొచ్చర్



లండన్: లండన్‌లో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో భారత్‌కు చెందిన ప్రతిభావంతురాలైన విద్యార్థిని ప్రాణాలు కోల్పోయారు. 33 ఏళ్ల చేష్టా కొచ్చర్ ప్రస్తుతం లండన్‌లోని ప్రతిష్టాత్మక లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ పొలిటికల్ సైన్సెస్ విశ్వవిద్యాలయంలో బిహేవియరల్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేస్తోంది. మార్చి 19వ తేదీన లండన్‌లో క్లెర్కెన్‌వెల్ రోడ్డులో వర్సిటీ నుంచి ఇంటికి సైకిల్‌పై తిరుగుపయనమైన ఈమెను ఒక చెత్త ట్రక్కు ఢీకొనడంతో చనిపోయారు. ''ప్రమాద ఘటనాస్థలి నుంచి చెత్త ట్రక్కు డ్రైవర్ పారిపోలేదు. పోలీసు దర్యాప్తునకు సహకరించారు. ఇంకా ఎలాంటి అరెస్టులు చేయలేదు. అసలేం జరిగిందన్న దానిపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రత్యక్ష సాక్షులుంటే సహకరించండి' అని పోలీసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేష్టా కొచ్చర్ మరణ వార్తను ఆమె తండ్రి, సెల్యూలార్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ ఎస్‌పీ కొచ్చర్ వెల్లడించంతో సంతాప సందేశాలు వెల్లువెత్తాయి. గతంలో తమ సంస్థలో పనిచేయడంతో నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్ సైతం స్పందించారు. ' నీతి ఆయోగ్‌లోని లైఫ్‌స్టైల్ ఫర్ ది ఎన్విరోన్‌మెంట్ ప్రాజెక్టులో చేష్టా పనిచేశారు. జీవితంపై ఎంతో స్పష్టత ఉన్న ప్రతిభావంతురాలు, ధైర్యవంతురాలు. చాలా ముందే అందరికీ వీడ్కోలు పలికి వెళ్లిపోయారు' అని అమితాబ్ తన సంతాప సందేశంలో వ్యాఖ్యానించారు. నేషనల్ బిహేవియరల్ ఇన్‌సైట్స్ యూనిట్ ఆఫ్ ఇండియాలో చేష్టా దాదాపు రెండేళ్లు పనిచేశారు.

బరేలీలో పుట్టి అమెరికాలో చదివి..

ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో చేష్టా జన్మించారు. తండ్రి సైన్యాధికారి కావడంతో ఢిల్లీసహా దేశంలోని పలు సైనిక పాఠశాల్లో విద్యనభ్య సించారు. అశోకా యూనివర్సిటీ, ఢిల్లీ వర్సిటీలో చదువుకున్నారు. తర్వాత అమెరికా లోని షికాగోలో పీజీ పూర్తిచేశారు. పెన్సిల్వేనియా వర్సిటీలోనూ చదువుకున్నారు. బిహేవియరల్ స్ట్రాటజిస్ట్‌గా పేరొందారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్, పొలిటికల్ సైన్సెస్‌లో పూర్తి స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించాక గత ఏడాది సెప్టెంబర్‌లో అక్కడ చేరారు.




సాక్షి
హైదరాబాద్
మంగళవారం । 26 । మార్చి । 2024



భాగ్యనగరం రంగుల వనమైంది. కేరింతలు.. డీజే మోతలు.. రెయిన్ డ్యాన్సులతో హోరెత్తింది. పిల్లల ఆటపాటలు.. స్నేహితుల పలకరింపులు.. పెద్దల ఆత్మీయ ఆలింగనాలతో తడిసి ముద్దయ్యింది. విదేశీయులు సైతం స్వదేశీ వేడుకకు ఫిదా అవుతూ.. శుభాకాంక్షలు చెబుతూ సందడి చేశారు. ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు, బేగంబజార్, కోఠి, కూకట్‌పల్లి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ మూసాపేట రెయిన్‌బో విస్టాస్, హైటెక్ సిటీ ప్రాంతాల్లో హోలీ సంబరాలు అంబరాన్ని అంటాయి.

రంగ్ బర్సే





ఎండలు తీవ్రం

- నగరంలో నగటున 37.6 డిగ్రీల నమోదు
- షేక్‌పేటలో అత్యధికంగా 39.2 డిగ్రీలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో ఎండలు మండుతున్నాయి. నాలుగు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే నాలుగైదు డిగ్రీలు అధికంగా నమోదయ్యాయి. దీంతో ఉదయం పది తర్వాత బయటకు వెళ్లేందుకు ప్రజలు భయపడుతున్నారు. సోమవారం నగటున గరిష్ట ఉష్ణోగ్రత 37.6 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 29.3 డిగ్రీలుగా నమోదైంది. అత్యధికంగా షేక్‌పేటలో 39.2 డిగ్రీలు నమోదు కాగా, శివారులో మరింత పెరిగింది. ఇబ్రహీంపట్నంలో 39.6 డిగ్రీలు, మెయిన్‌బాద్‌లో 39.6, నాంపల్లి బజార్ ఘాట్‌లో 39.1, సికింద్రాబాద్‌లోని పాటిగడ్డలో 39.0, ఆసిఫ్‌నగర్‌లో 38.8, చార్మినార్‌లో 38.7, సరూర్‌నగర్‌లో, సైదాబాద్‌లో 38.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్నరోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది.

హైదరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా 'గడ్డం'

శ్రీనివాస్ యాదవ్‌ను ఖరారు చేసిన అధిష్టానం



అబిడ్స్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌ను మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ నుంచి టికెట్‌ను ఆశించి భంగపడ్డారు శ్రీనివాస్ యాదవ్. దీంతో ఈసారి హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి ఎంపిక చేయడంతో కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడిగా శ్రీనివాస్‌యాదవ్ కొనసాగుతున్నారు. 1989లో విద్యార్థి దశలోనే రాజకీయాలకు ఆకర్షితుడై ఎన్ఎస్‌యూఐలో చేరి నగర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఆల్ ఇండియా కార్యదర్శిగా కొనసాగారు. క్యాంపస్ ఇన్‌చార్జిగా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆల్ ఇండియా యువజన కాంగ్రెస్ కార్యదర్శిగానూ పనిచేశారు. 2006లో నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులై 2011 సంవత్సరం వరకు కొనసాగారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2015లో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. అంతేకాకుండా తన తండ్రి గడ్డ గంగాధర్ యాదవ్ పేరిట ఫౌండేషన్ ఏర్పాటు చేసిన అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. కరోనా సమయంలోనూ వేలాది కుటుంబాలకు నిత్యవసర సరుకుల కిట్ల పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో బస్తీబాట ద్వారా చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులను గుర్తించి.. గత ఏడాది వారికి ఉచితంగా తన కళాశాలలో అడ్మిషన్లు కల్పించారు.

ప్రొఫైల్

పేరు: గడ్డం శ్రీనివాస్‌యాదవ్
వయస్సు: 56 సంవత్సరాలు
విద్యార్హతలు: బీ.కాం.
కుటుంబం: భార్య స్వర్ణలత యాదవ్, కుమార్తె డాక్టర్ స్నేహయాదవ్, కుమారుడు న్యాయవాది గగన్‌యాదవ్.
వృత్తి: విద్యా సంస్థల నిర్వహణ, హైందవి గ్రూప్ ఆఫ్ కాలేజీలకు చైర్మన్, శ్రీహిందూ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్

క్యాంపెయిన్!

ఎంపీ అభ్యర్థులను హడలెత్తిస్తున్న ప్రచార కార్యక్రమాలు

- ఎన్నికలకు సుదీర్ఘ సమయం.. పార్టీల్లో అంతర్మథనం
- మండుతున్న ఎండలు.. జన సమీకరణపై మల్లగుల్లాలు



సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన మూడు నెలలకే తరుముకొచ్చిన పార్లమెంట్ ఎన్నికలు రాజకీయ పార్టీలను హడలెత్తిస్తున్నాయి. గెలుపోటముల సంగతి పక్కనపెడితే.. ఎన్నికలు జరిగే మే 13వ తేదీ వరకు నిరంతరం ప్రచారం చేయాల్సి ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో కంగారు మొదలైంది. గతంలో జరిగిన పలు ఎన్నికల కంటే ఈసారి గడువు ఎక్కువ ఉండటంతో ప్రచార నిర్వహణ భారంగా మారనుంది. అంతేకాకుండా అభ్యర్థులు తమ అనుచరులు, కార్యకర్తలతో సుమారు 50 రోజుల పాటు ప్రజల్లో తిరగాల్సి ఉంటుంది. బహిరంగ సభలతో పాటు సమావేశాలు, ర్యాలీలతో ప్రచారాన్ని హోరెత్తించాలి. ఈక్రమంలో కార్యకర్తలను పోగు చేయడం మొదలుకొని అంచెలంచెలుగా ప్రచారాన్ని ఉధృతం చేసేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. దీంతో పార్లమెంట్ ఎన్నికల బరిలోకి దిగే నాయకులను 'ప్రచార భారం' ఆందోళనకు గురి చేస్తోంది. గతంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచీ ఎన్నిక తేదీ వరకు గరిష్ఠంగా 55 రోజులు ఉంటే.. ఈసారి 58 రోజుల గడువు ఉండటం గమనార్హం. ఈక్రమంలో రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారాన్ని మే 11వ తేదీన అధికారికంగా ముగించాలి. కానీ, ఎన్నికలు జరుగనున్న 13వ తేదీ వరకు ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు వివిధ రకాలుగా ప్రచారం చేయాల్సిందే.

జనాల తరలింపు కష్టమే..

ఒకవైపు ఎన్నికల గడువు ఎక్కువ రోజులు ఉండటమే భారంగా భావిస్తున్న వివిధ పార్టీల అభ్యర్థులకు.. భగ్గుమంటున్న ఎండలు చుక్కలు చూపనున్నాయి. మార్చిలోనే ఎండలు మండుతుండటంతో ఏప్రిల్, మేలో ఉష్ణోగ్రతలు మరింత పెరగనున్నాయి. దీంతో ప్రచారానికి పార్టీ శ్రేణులను కదిలించడమే కాకుండా సభలకు జన సమీకరణ కూడా సవాలుగానే మారనుంది. మండుతున్న ఎండల దృష్ట్యా జనాన్ని తరలించడం ఈసారి ఇబ్బందిగా ఉంటుందని ప్రధాన పార్టీకి చెందిన ఒక నాయకుడు అభిప్రాయపడ్డారు. 'ప్రచారానికి జనాలను, కార్యకర్తలను తరలించడం ప్రధాన సమస్య. అంతేకాకుండా అభ్యర్థులు తమ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ప్రతి కాలనీ, బస్తీకి వెళ్లి ఓటర్లను కలవాలి. ఎన్నికల గడువు ఎక్కువగా ఉండటం వల్ల ఎక్కువసార్లు పర్యటించే పరిస్థితి కూడా ఉంటుంద'న్నారు. మరోవైపు ప్రచార సామగ్రి, వాహనాలు, పెట్రోల్, డీజిల్, తదితర ఖర్చులన్నీ తడిసి మోపెడవుతాయని ఆయన తెలిపారు.

ఖర్చుకు వెనకాడితే.. ప్రచారంలో వెనుకంజే..!

ప్రధాన పార్టీల మధ్య గెలుపోటములు ప్రతిష్ఠాత్మకంగా మారిన ఈ ఎన్నికల్లో అభ్యర్థులు డబ్బులు ఖర్చు చేసేందుకు వెనకాడితే.. ప్రచారంలో వెనుకబడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, ఓటర్లను చివరి వరకు జారిపోకుండా తన వెంట నడిచేలా చర్యలు తీసుకోవాలి. అన్ని వర్గాలను ప్రసన్నం చేసుకునేందుకు పలు కార్యక్రమాలు సైతం ఏర్పాటు చేయాల్సిందే. దీంతో ఈసారి లోక్‌సభ ఎన్నికలు భారంగా మారాయని వివిధ పార్టీల నాయకులు ఆవేదన చెందుతున్నారు.

ఎలక్షన్ షెడ్యూల్ ప్రకటన నుంచి ఎన్నికల తేదీ వరకు గడువు ఇలా..	
2009	44 రోజులు
2014	55 రోజులు
2019	32 రోజులు
2024	58 రోజులు

ప్రకటనల తొలగింపు

- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జీహెచ్ఎంసీ చర్యలు
- మూడు నెలల పాటు కొనసాగనున్న కార్యక్రమం

సాక్షి, సిటీబ్యూరో: లోక్‌సభ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా అనధికార ప్రకటనలు తొలగించేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. ముఖ్యంగా రాజకీయ నేతల ప్రచార హోర్డింగ్స్, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రకటనలు ఎప్పటికప్పుడు తొలగించనుంది. ఎన్నికల షెడ్యూలు వెలువడినప్పటి నుంచే ఈ కార్యక్రమం చేపట్టినా.. చాలా ప్రాంతాల్లో ఇప్పటికీ ప్రకటన బోర్డులు కనిపిస్తున్నాయి. వాటితో పాటు కొత్తగా ఏర్పాటవుతున్న వాటిని ఎప్పటికప్పుడు తొలగించేందుకు చర్యలు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. ఇప్పటికే రాజకీయ నేతల విగ్రహాల ముఖాలు కనిపించకుండా ముసుగు వేస్తున్నారు. తొలగింపుల్లో భాగంగా అనధికారికంగా ఏర్పాటు చేసిన హోర్డింగులతో పాటు యూనీపోల్స్, బస్‌షెల్టర్లు, ఆర్చీలు, లాలీపాప్స్, ఎలక్ట్రికల్ పోల్స్ కియోస్కులతో సహా ఇతరాత్ర ప్రకటనలు తొలగిస్తారు. మూడు నెలల పాటు కొనసాగే ఈ కార్యక్రమ బాధ్యతని ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అయితే, గతంలో జీహెచ్ఎంసీలోని ఈవీడీఎం విభాగం ఈ పని చేసేది. అనంతరం ఈవీడీఎం కేవలం పెనాల్టీలు విధించేందుకు పరిమితం కాగా.. తొలగింపు బాధ్యతను సర్కిళ్లకు అప్పగించారు. సర్కిళ్లలోనూ ఈ పనులు చేసేందుకు తగినంత సిబ్బంది లేకపోవడంతో ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తున్నారు. ఎన్నికల నియమావళితో పాటు ప్రివెన్షన్ ఆఫ్ డీఫేస్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ప్రాపర్టీస్ యాక్ట్ మేరకు కూడా వీటిని తొలగించనున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాట్లకు టెండర్లు..

మరోవైపు తొలగింపు పనులతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద, హైదరాబాద్ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల డీఆర్ఎస్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాల ఇన్‌స్టలేషన్, నిర్వహణ, ఇతర పనుల కోసం సైతం టెండర్లు ఆహ్వానించారు.

ట్యాంకర్ మీది.. నీళ్లు మావి



- వాణిజ్య అవసరాల కోసం జలమండలి కొత్త ప్లాన్
- ముందస్తు బుకింగ్ కోసం దరఖాస్తు తప్పనిసరి

బంజారాహిల్స్: కమర్షియల్ వాటర్ ట్యాంకర్లు లేక జలమండలిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈక్రమంలో వాణిజ్య అవసరాల కోసం నీళ్ల ట్యాంకర్ బుక్ చేసుకుంటే రెండు మూడు రోజుల వరకు అందని పరిస్థితి. దీంతో హోటళ్లు, ఆస్పత్రులు, సినిమా థియేటర్లు, మాల్స్, ఇతర బడా కంపెనీలు సతమతమవుతున్నాయి. అయితే, ఇలాంటి ప్రతికూల పరిస్థితిని అధిగమించేందుకు జలమండలి అధికారులు సరికొత్త ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం.. నీటి అవసరం ఉన్న వాణిజ్య సంస్థలు సొంతంగా కమర్షియల్ వాటర్ ట్యాంకర్‌ను సమకూర్చుకుంటే ప్రతిరోజు నీరు అందిస్తామంటున్నారు. మూడో షిఫ్టులో అంటే ప్రతిరోజు రాత్రి 10 నుంచి తర్వాతి రోజు ఉదయం 6 గంటల వరకు నీటి సరఫరా చేస్తామంటున్నారు.

ముందస్తు దరఖాస్తు చేసుకోవాలి..

నీటి సరఫరా కోసం వాణిజ్య సంస్థలు ముందుగా స్థానిక జల మండలి సెక్షన్ మేనేజర్లు, డీజీఎంలు, జీఎంలతో పాటు ఇతర అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. అంతేకాకుండా ఎంత మేర నీరు అవసరమో చెప్పాల్సి ఉంటుంది. ఈక్రమంలో సొంతంగా వాటర్ ట్యాంకర్ సమకూర్చుకుంటే అధికారులు స్మార్ట్‌కార్డు అందజేస్తారు. డ్రైవర్ సమీప వాటర్ రిజర్వాయర్ వద్ద ఈ స్మార్ట్ కార్డు వినియోగించడం వల్ల అందులోని నగదు జలమండలి అకౌంట్‌లోకి జమ అవుతుంది. ఆపై ట్యాంకర్లలో నీరు నింపుకొని గమ్యస్థానాలకు చేరవేయవచ్చు. జలమండలి డివిజన్–6 పరిధిలో వాణిజ్య నీటి అవసరాల కోసం ముందుగా దరఖాస్తు చేసుకోవాలని జీఎం హరిశంకర్ సైతం తెలిపారు.

అప్పులు చేసిందని.. కత్తితో భార్యపై భర్త దాడి

జవహర్‌నగర్‌: అప్పులు చేసిందని ఓ వ్యక్తి భార్యపై కత్తితో దాడికి పాల్పడిన సంఘటన జవహర్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జవహర్‌నగర్‌ సంతోష్‌నగర్‌లో మేడ ఇందిర(39), పెద్దబ్బాయి దంపతులు, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నారు. ఇందిర నాటు కోడి చికెన్‌ సెంటర్‌ నిర్వహిస్తుండగా, ఆమె భర్త పెద్దబ్బాయి లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో పెద్దబ్బాయి మూడేళ్లుగా కుటుంబానికి దూరంగా ఉన్నాడు. మూడు నెలల క్రితం వీరి మధ్య సయోధ్య కుదరడంతో ఇంటికి తిరిగి వచ్చాడు. ఇందిర భర్తకు తెలియకుండా రూ.4 లక్షలు అప్పు చేసింది. అప్పు ఇచ్చిన వారు తరచూ ఇంటికి వస్తుండటంతో పెద్దబ్బాయి భార్యను నిలదీశాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం చికెన్‌ షాప్‌ వద్ద గొడవ జరగడంతో అతను ఇందిరపై కత్తితో దాడి చేశాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితురాలిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

హస్తినాపురం: ఓ యువకుడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం, కందుకూరు మండలం, పందలపాడు గ్రామానికి చెందిన కిరణ్‌ కుమార్‌ (26) నగరంలోని మయూరి కమ్యూనికేషన్స్‌లో పనిచేస్తూ హస్తినాపురంలోని సాహితీ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఆదివారం రాత్రి రూమ్‌లోకి వెళ్లిన అతను సోమవారం బయటికి రాకపోవడంతో పక్క గదిలో ఉంటున్న యువకులు హాస్టల్‌ నిర్వాహకుడు సుధాకర్‌కు సమాచారం అందించారు. అతను గదికి వెళ్లి డోర్‌కొట్టినా ఎంతకీ తీయకపోవడంతో వెంటిలేటర్‌లోంచి చూడగా కిరణ్‌ కుమార్‌ లుంగీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. సుధాకర్‌ సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న వనస్థలిపురం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి సుందర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇస్తే సరి.. లేదంటే కొర్రీ!

భూ రిజిస్ట్రేషన్లలో అక్రమ వసూళ్లు

- భూ స్వభావం, ప్రాంతం ప్రకారం రేటు
- మధ్యవర్తులుగా డాక్యుమెంట్‌ రైటర్లు
- సమర్పించుకుంటున్న క్రయవిక్రయదారులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: రెవెన్యూ వ్యవస్థలో పేరుకుపోయిన అవినీతిని పూర్తిగా రూపుమాపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆన్‌లైన్‌ విధానానికి శ్రీకారం చుట్టింది. వెంచర్లలోని ఖాళీ స్థలాలు, ఇళ్లే కాదు వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు ఆన్‌లైన్‌ విధానం తీసుకొచ్చింది. వెంచర్లలోని ప్లాట్లు, ఇళ్లను స్టాంప్స్‌ అండ్‌ రిజిస్ట్రేషన్‌ విభాగంలో రిజిస్ట్రేషన్‌ చేస్తుంటే.. వ్యవసాయ భూములను తహసీల్దార్‌ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్‌ చేస్తున్నారు. ఆయా శాఖల్లో పని చేస్తున్న కొంతమంది అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. డాక్యుమెంట్‌ రైటర్లతో కుమ్మక్కై.. భూముల రిజిస్ట్రేషన్‌ను బట్టి ధరలు నిర్ణయించి, వసూలు చేస్తున్నారు. క్రయవిక్రయాల సమయంలో కిరికిరి చేసే అవకాశం ఉండటంతో విక్రయదారులే కాదు కొనుగోలుదారులు సైతం వారు అడిగినంత ఇచ్చి భూములు రిజిస్ట్రేషన్‌ చేసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు ఆయా మండలాల్లో పర్యటించి, తహసీల్దార్‌, మండల పరిషత్‌ కార్యాలయాల్లో పేరుక పోయిన ఫైళ్లపై ఆరా తీయాల్సిన ఉన్నతాధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది.

డాక్యుమెంట్ల సంఖ్యను బట్టే..

వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు ముందస్తుగా ధరణి పోర్టల్‌లో స్లాట్‌ బుక్‌ చేసుకోవాల్సి ఉంది. కొనుగోలుదారులు ఆ భూమికి నిర్దేశిత ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్‌ కోసం స్లాట్‌ బుక్‌ చేసుకుంటున్నారు. ఆ భూమిపై ఏదైనా కేసు, ఇతర అభ్యంతరాలుంటే స్లాట్‌ బుక్‌ కాదు. అధికారికంగా స్లాట్‌ బుక్‌ అయిన వారి నుంచి అక్రమ వసూళ్లు చేస్తున్నారు. జిల్లాలో 27 మండలాలు ఉండగా, వీటిలో ఏడు మినహా మిగిలిన వాటిలో వ్యవసాయ భూ రిజిస్ట్రేషన్లు ఎక్కువ జరుగుతున్నాయి. ఒక్కో తహసీల్దార్‌ ఆఫీసులో రోజుకు సగటున 30 నుంచి 40 వరకు రిజిస్ట్రేషన్లు అవుతుంటాయి. వెంచర్లలోని ఖాళీ ప్లాట్లకు స్టాంప్స్‌ అండ్‌ రిజిస్ట్రేషన్‌ ఆఫీసుల్లో రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఒక్కో ఆఫీసులోరోజుకు సగటున 50–60 వరకు రిజిస్ట్రేషన్లు పూర్తవుతాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా ఈ రెండు విభాగాల్లో రోజుకు సగటున 1,500 నుంచి 2,000 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్‌ అవుతున్నట్లు అంచనా. భూ స్వభావం, ప్రాంతాన్ని బట్టి రిజిస్ట్రేషన్లకు ధరలు నిర్ణయిస్తున్నారు. డాక్యుమెంట్‌ రైటర్లు వీరికి మధ్య వర్తులుగా వ్యవహరిస్తున్నారు. వారు రైతుల నుంచి ముందే డబ్బులు వసూలు చేసి, సదరు రిజిస్ట్రేషన్‌ ఫైలు తీసుకెళ్లి తహసీల్దార్‌ ముందు పెడుతున్నారు. ఆయన డాక్యుమెంట్‌పై పెన్సిల్‌తో ఓ మూలన అర్థంకాని పదాలు (కోడ్‌ లాంగ్వేజ్‌) రాసి పెడుతున్నారు. ఆ రోజు ఎన్ని రిజిస్ట్రేషన్లు అయ్యాయి? ఏ డాక్యుమెంట్‌ రైటర్‌ నుంచి ఎన్ని వచ్చాయి? వంటి వాటిని లెక్కించి, వారి నుంచి వసూలు చేసుకుని వెళ్తుండటం విశేషం. ఎప్పటికప్పుడు ఆయా రెవెన్యూ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించి, అక్రమార్కులపై గట్టి నిఘా ఏర్పాటు చేయాల్సిన ఉన్నతాధికారులు అటు వైపు చూడటం లేదు.

పార్టిషియన్‌ డీడ్‌ అంటే పండుగే..

ఏ వివాదం లేని పట్టా భూములు రిజిస్ట్రేషన్‌ (సేల్‌డీడ్‌)కు తహసీల్దార్‌కు రూ.1000 ధరణి ఆపరేటర్‌కు రూ.500, అటెండర్‌(స్టాంప్‌) రూ.200–500 వరకు చెల్లించుకోవాల్సి వస్తుంది. వారసత్వంగా లభించిన పట్టా భూములను తమ పిల్లలకు తల్లిదండ్రులు చేసే గిఫ్ట్‌ డీడ్‌ రిజిస్ట్రేషన్‌కు తహసీల్దార్‌కు ఎకరానికి రూ.2,500 చెల్లించాల్సి వస్తోంది. అదే వారసత్వంగా వచ్చిన పట్టా భూములను తల్లిదండ్రుల నుంచి అన్నదమ్ములు ముందే ఒక ఒప్పందానికి వచ్చి చేసుకునే పార్టిషియన్‌ డీడ్‌ రిజిస్ట్రేషన్‌కు ఎకరానికి ఏకంగా రూ.5000 వసూలు చేస్తున్నారు. ఇక బ్యాంకుల్లో పంట రుణాలు, అసైన్డ్‌, భూదాన్‌, లావణి పట్టా భూముల రిజిస్ట్రేషన్లకు మార్కెట్‌ విలువను బట్టి ఎకరానికి రూ.50,000 నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. డాక్యుమెంట్‌ రైటర్లు ముందే ఓ ధర నిర్ణయించి, భూ యజమానులకు చెప్పేస్తున్నారు. ఇవ్వకపోతే ఏ భూమికి ఎలాంటి కొర్రీలు పెడుతున్నారో కూడా ముందే వివరిస్తున్నారు. తీరా క్రయవిక్రయాల సమయంలో ఎందుకొచ్చిన గొడవ అని ఆయా భూ యజమానులు వారు అడిగినంత సమర్పించుకుని వెళ్లిపోతున్నారు.

అక్రమార్కులపై ఏసీబీ కన్ను

జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న అధికారులు, సిబ్బందిపై ఏసీబీ దృష్టి సారించింది. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌ఐలు, డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లు, మున్సిపాలిటీల్లోని టౌన్‌ప్లానింగ్‌ ఆఫీసర్లు, బిల్‌ కలెక్టర్ల అవినీతి చిట్టాను లెక్కిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇప్పటికే ఆదాయానికి మించి ఆస్తులు కూడాబెట్టిన అధికారులపై దాడులు చేసిన అధికారులు.. తాజాగా అక్రమార్కులను పట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ముఖ్యంగా మహేశ్వరం నియోజకవర్గంలో అక్రమార్కులు ఎక్కువగా ఉన్నట్లు, వీరిని పట్టిస్తే.. సొంతట్రస్ట్‌ నుంచి రూ.లక్ష బహుమానం ఇవ్వనున్నట్లు ఏకంగా అధికార పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌ ప్రకటించడం కొసమెరుపు.

కోడ్‌ పేరుతో హోలీ సంబురాలకు బ్రేక్‌

ఇందిరాపార్కు అధికారులపై వాకర్స్‌ ఆగ్రహం

- వాగ్వాదాలతో కొద్దిసేపు ఉద్రిక్తత
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్న వాకర్స్‌

కవాడిగూడ: ఎన్నికల కోడ్‌ పేరుతో ఇందిరాపార్క్‌ వద్ద హోలీ వేడుకలను అడ్డుకోవడం ఉద్రిక్తతకు దారి తీసింది. వాకర్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఏటా పార్క్‌లో హోలీ వేడుకలను నిర్వహిస్తున్నారు. అయితే ఈ ఏడాది ఎన్నికల కోడ్‌ పేరుతో అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది వేడుకలను నిర్వహించకుండా అడ్డుకున్నారు. దీంతో వాకర్స్‌ ఇందిరాపార్కు సిబ్బంది, జీహెచ్‌ఎంసీ అధికారులతో వాగ్వివాదానికి దిగడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఎన్నికల కోడ్‌ పేరిట హోలీ వేడుకలను నిర్వహించవద్దని పార్కు డైరెక్టర్‌, మేనేజర్‌ ఆదేశాలు జారీ చేయడం విడ్డూరంగా ఉందని వాకర్స్‌ పేర్కొన్నారు. రాజకీయ నాయకులు ఇందిరాపార్కులో జరిగే హోలీ వేడుకల్లో పాల్గొంటే ఎన్నికల కోడ్‌ కిందకు వస్తుందని, కానీ రాజకీయాలకు సంబంధం లేకపోయినా అధికారులు, సెక్యూరిటి సిబ్బంది తమను అడ్డుకోవడం దారుణమని వాకర్స్‌ అసోసియేషన్‌ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే వేడుకలకు మొదట అధికారులు అనుమతి ఇచ్చి, ఆ తరువాత ససేమిరా అనడం గమనార్హం.

అక్కడా అలా.. ఇక్కడ ఇలా..

ఉస్మానియా యూనివర్సిటీ, పబ్లిక్‌గార్డెన్‌, ఎగ్జిబిషన్‌ గ్రౌండ్‌, సుందరయ్య పార్కులో హోలీ వేడుకలకు అనుమతి ఇచ్చి కేవలం ఇందిరాపార్కులో నిరాకరించారని, పార్కు అభివృద్ధి విషయంలో అధికారులను ప్రశ్నిస్తున్నందుకే వేడుకలను అడ్డుకుంటున్నారని వాకర్స్‌ ఆరోపించారు. ఇందిరాపార్కులో హోలీ వేడుకలను నిషేధించడాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని వాకర్స్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు తెలిపారు. పార్కు అధికారులు వాకర్స్‌ అసోసియేషన్‌లోని ఓ వర్గానికి కొమ్ముకాస్తూ ఇలాంటి చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. ఆందోళనలో వాకర్స్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు ఎం. శ్రీనివాస్‌ముదరాజ్‌, తాటి శ్రీనివాస్‌, బి.సురేందర్‌, సాయిరెడ్డి, కిషన్‌గౌడ్‌, శేరుపల్లి గణేష్‌, సంగిశెట్టి శ్రీధర్‌రాజ్‌, అరుణ్‌గౌడ్‌, చందు, రమేష్‌గౌడ్‌తో పాటు వాకర్స్‌ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఇందిరాపార్క్‌ చౌరస్తాలో హోలీ వేడుకల్లో పాల్గొన్న యువత

చెరువులో గల్లంతైన విద్యార్థి మృతదేహం వెలికితీత

కీసర: అహ్మద్‌గూడ చెరువులో ఈతకోసం వెళ్లి నీటిలో గల్లంతైన విద్యార్థి మృతదేహాన్ని సోమవారం పోలీసులు వెలికి తీశారు. కీసర సీఐ వెంకటయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అహ్మద్‌గూడకు చెందిన మంద నరేష్‌కుమార్‌(12) రాంపల్లిలోని శాంతినికేతన్‌ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఇద్దరు మిత్రులతో కలిసి అహ్మద్‌గూడ కొత్తచెరువులో ఈతకు వెళ్లాడు. నడుముకు థర్మకోల్‌ కట్టుకుని చెరువులో దిగిన నరేష్‌కుమార్‌ థర్మకోల్‌ ఊడిపోవడంతో నీటిలో మునిగిపోయాడు. దీంతో అతడి స్నేహితులు భయంతో అక్కడి నుంచి పరారయ్యారు. దీనిని గుర్తించి ఓ వృద్ధుడు స్థానికులకు సమాచారం అందించాడు. కీసర సీఐ వెంకటయ్య సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. మృతదేహాన్ని వెలికి తీసేందుకు డీఆర్‌ఎఫ్‌, అగ్నిమాపక బృందాలతో చెరువులో గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో సోమవారం ఉదయం మరోమారు చెరువులో డీఆర్‌ఎఫ్‌, అగ్నిమాపక బృందాలు గాలింపు చేపట్టి నరేష్‌కుమార్‌ మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





నరేష్‌కుమార్‌ మృతదేహం, నరేష్‌ (ఫైల్‌)

పేదలకు ఉచితంగా కాశీ యాత్ర...



నాగోలు: శ్రీ కాశీ ఆశ్రయ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతినెలా పేద ప్రజలకు ఉచిత కాశీయాత్ర నిర్వహిస్తున్నట్లు శ్రీ కాశీ ఆశ్రయ ట్రస్ట్‌ ఫౌండర్‌ ప్రెసిడెంట్‌ అశోక్‌ గుప్తా తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన 60 మందిని సోమవారం సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌ నుంచి కాశీ యాత్రకు పంపించారు. ఈ సందర్భంగా యాద అశోక్‌ గుప్తా మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రతి నెలా కొంతమందికి ఉచితంగా కాశీయాత్ర ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మార్చి 25 నుంచి ఏప్రిల్‌ 4 వరకు 60 మందికి 9 రోజుల పాటు కాశీలో సకల సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఉచితంగా రైలు టికెట్లు, ఉచిత వసతి, భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సర శివరాత్రి నుంచి ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 110 మంది ఈ సేవను వినియోగించుకున్నట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని నగరంలోని పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బిలకంటి రాజు, యాద మంజుల, ప్రేమ్‌ గాంధీ, సుంకు నాగరాణి, గిరీష్‌ శెట్టి, అనిల్‌ కుమార్‌, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

నిందితుడిపై కేసు నమోదు

అమీర్‌పేట్‌: స్నాప్‌ చాట్‌లో పరిచయమైన బాలికను బెదిరించి లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఆర్‌ నగర్‌ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అమీర్‌పేట సోనాబాయి ఆలయం సమీపంలో నివాసం ఉంటున్న గణేష్‌ యాదవ్‌కు ఓ బాలిక(14)తో స్నాప్‌ చాట్‌లో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో రోజు సదరు బాలికతో తరచూ మాట్లాడుతుండేవాడు ఈ క్రమంలో ఆమె వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు సేకరించిన అతను వాటిని చూపి బెదిరించి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలియడంతో బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

28న ఓయూ వార్షిక బడ్జెట్‌

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వార్షిక బడ్జెట్‌–2024 ఈ నెల 28న సెనేట్‌ సమావేశంలో ప్రవేశపెట్టనున్నారు. ఆదాయం తగ్గి.. వ్యయం పెరిగిన తరుణంలో నిధుల కోసం ప్రభుత్వంపై ఆధారపడాల్సి వస్తోందని వర్సిటీ అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించినప్పటికీ వేతనాలు, పింఛన్‌కు సరిపోవడం లేదన్నారు. అంతర్గత ఆదాయం సగానికి తగ్గడంతో ఓయూ అభివృద్ధి పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఆర్థిక సమస్యలను ఎదుర్కొనేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్‌



హిమాయత్‌ నగర్‌: లోక్‌ సభ ఎన్నికల నేపథ్యంలో నారాయణగూడ పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు సోమవారం ఫ్లాగ్‌మార్చ్‌ నిర్వహించారు. నారాయణగూడ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో నిర్వహించిన ఈ ఫ్లాగ్‌మార్చ్‌లో సుమారు వందమంది కేంద్ర సాయుధ బలగాల (సీఐఎస్‌ఎఫ్‌) సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలు, ఒత్తిడికి లోను కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సుల్తాన్‌ బజార్‌ ఏసీపీ కె.శంకర్‌ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నారాయణగూడ సీఐ చంద్రశేఖర్‌, డిఐ డి.నాగార్జున , ఎస్‌ఐ లు వెంకటేష్‌, శిరీష, నరేష్‌కుమార్‌ పాల్గొన్నారు.

ముగ్గులేసి.. మొక్కలు పెట్టి



అవగాహన కలిగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

ఫిలింనగర్‌: బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేయకుండా చేసేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది వినూత్న ప్రయోగాలకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వల్నరబుల్‌ పాయింట్లను ముప్పావు వంతుకు తగ్గించిన అధికారులు మిగిలిన కొద్ది ప్రాంతాల్లో కూడా చెత్త వేయకుండా చేసేందుకు పలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బంజారాహిల్స్‌ రోడ్‌ నెం.2లోని ఇందిరానగర్‌లో ఉన్న ఓపెన్‌ గార్బేజ్‌ పాయింట్లను స్థానిక జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్లు, సిబ్బంది ఇందిరానగర్‌కు చెందిన మహిళా సమాఖ్య, గ్రూపు మహిళలతో కలిసి చెత్త వేయకుండా స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం ఈ ప్రాంతంలో స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించి ఓపెన్‌ గార్బేజీ పాయింట్లను శుభ్రం చేసి మొక్కలు ఏర్పాటు చేసి ముగ్గులు వేసి మరికొన్ని చోట్ల గ్రీన్‌ నెట్‌లను ఏర్పాటు చేశారు. చెత్తను ఇంటి వద్దకు వచ్చే చెత్త రిక్షాలకు మాత్రమే ఇవ్వాలని ప్రచారం చేశారు.

నామినేటెడ్‌ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్‌ గుజ్జ కృష్ణ

కాచిగూడ: నామినేటెడ్‌ పదవుల్లో బీసీ ఉద్యమకారులకు ప్రాధాన్యం ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్‌ గుజ్జ కృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా గుజ్జ కృష్ణ మాట్లాడుతూ బీసీ కమిషన్‌, పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌, కార్పొరేషన్ల చైర్మన్లు, సభ్యులు నియామకంలో బీసీలకు అవకాశం కల్పించాలని కోరారు. బీసీ కుల గణనకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 26ను సత్వరమే అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కుల గణన నిర్ణయం చారిత్రాత్మకమని, ఇది బీసీల సామాజిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ నేతలు ఉదయ్‌ నేత, నందగోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.



మల్లు రవిని సత్కరిస్తున్న గుజ్జ కృష్ణ

యువ న్యాయమూర్తి మణికంఠ మరణం బాధాకరం

అంబర్‌పేట: ఎంతో భవిష్యత్తు ఉన్న యువ న్యాయమూర్తి మణికంఠ ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమని తెలంగాణ న్యాయమూర్తుల అసోసియేషన్‌ నేతలు అన్నారు. సోమవారం బాగ్‌ అంబర్‌పేటలో మణికంఠ నివాసానికి వచ్చిన పలువురు న్యాయమూర్తులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. సౌమ్యుడు, వివాద రహితుడిగా మణికంఠకు గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం మాజీ అధ్యక్షులు, రిటైర్డ్‌ హైకోర్టు న్యాయమూర్తి సంతోష్‌రెడ్డి, రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం అధ్యక్షులు కె.ప్రభాకర్‌ రావు, ప్రధాన కార్యదర్శి కె.మురళీ మోహన్‌, న్యాయమూర్తులు ప్రేమావతి, జీవన్‌కుమార్‌, కె.దశరథరామయ్య, ఎం వెంకటేశ్వరరావు, ఎం. రాజు, సంపత్‌, ఫరాన్‌కౌసర్‌ జోనైల్‌, రాధిక, ప్రతిమ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక..

- వ్యక్తిపై యువకుడి హత్యాయత్నం



నిందితుడు మితేశ్‌కుమార్‌

ఘట్‌కేసర్‌: లైంగిక వేధింపులు తాళలేక ఓ యువకుడు ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్‌ పీఎస్‌ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ సైదులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జనగామకు చెందిన దినసరి కూలీ భీమానాయక్‌తో, బీహార్‌కు చెందిన మితేశ్‌కుమార్‌కు స్థానిక బస్టాండ్‌లో పరిచయం ఏర్పడింది. కూలీ పని ఉందని చెప్పి మితేష్‌ ఫోన్‌ నెంబర్‌ తీసుకున్న భీమానాయక్‌ అప్పటి నుంచి అతడికి ఫోన్‌ చేసి వేధిస్తున్నాడు. భీమానాయక్‌ వేధింపులు తాళలేక అతడిని హత్య చేయాలని నిర్ణయించుకున్న మితేశ్‌కుమార్‌ అతడిని కొండాపూర్‌ రప్పించాడు. ఇద్దరు మద్యం తాగిన అనంతరం మితేశ్‌కుమార్‌ తన వెంట తెచ్చుకున్న కత్తితో భీమానాయక్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అతను అతడి భారినుంచి తప్పించుకుని రోడ్డుపైకి చేరుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. మితేశ్‌కుమార్‌ను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళ అదృశ్యం



వీరమణి(ఫైల్‌)

నల్లకుంట: కుటుంబ కలహాల కారణంగా ఓ మహిళ అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై క్రిష్ణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వడ్ల వీరమణి(50), లక్ష్మణ్‌ దంపతులు విద్యానగర్‌లో నివాసముంటున్నారు. ఈ నెల 23న రాత్రి ఆస్తి విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి లోనైన వీరమణి 24న ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా లగేజీ సర్దుకుని బయటికి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. ఆమె కుమారుడు కృష్ణ ఫిర్యాదు మేరకు నల్లకుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక వికలాంగుల ఆశ్రమానికి చేయూత



లక్డీకాపూల్‌: నాచారంలోని సాధన ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ మెంటల్లీ ఛాలెంజెడ్‌ హోం ప్రాంగణంలోనే ఒకేషనల్‌ ట్రైనింగ్‌ సెంటర్‌ కొనసాగుతోంది. అరకొర సౌకర్యాలతో వారు ఇబ్బందులు పడుతుండటాన్ని గుర్తించిన మాదాపూర్‌లోని నవద్వీప ఫౌండేషన్‌ వారికి సొంత భవనం నిర్మించేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు సోమవారం సాధన హోం సెక్రటరీ మధుసూదన రెడ్డికి నవద్వీప ఫౌండేషన్‌ ఉపాధ్యక్షుడు మంత రమేశ్‌ రూ. 6 లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్‌ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రతినిధులు డాక్టర్‌ రమణ బాబు, డాక్టర్‌ రామ మోహన్‌ రావు, ఆంజనేయులు, శ్రీనివాస రావు, రవి గంటి, వెంకయ్య, వర్ధన్‌ రావు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన హోలీ సంబురం

- రంగులమయమైన బస్తీలు, కాలనీలు
- ప్రత్యేక కార్యక్రమాల్లో చిందులేసిన యువత

బంజారాహిల్స్: రంగుల పండుగ హోలీ సందర్భంగా వీధులన్నీ రంగులమయం అయ్యాయి. సోమవారం తెల్లవారుజాము నుంచే కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్లు అన్న తేడా లేకుండా చిన్నా పెద్దా అంతా కలిసి రంగులు పూసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఖైరతాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, సోమాజిగూడ, ఫిలింనగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహంగా హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. పీపుల్స్ ప్లాజాతో పాటు జూబ్లీహిల్స్ రోడ్ నెం. 25లోని బూత్ బంగళా వద్ద నిర్వహించిన హోలీ వేడుకల్లో పెద్ద ఎత్తున యువత పాల్గొని ఆట, పాటలతో హోరెత్తించారు.

రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లలో...

రహమత్‌నగర్: హోలీ సంబరాలను రహమత్‌నగర్, బోరబండ డివిజన్‌లలో ఘనంగా నిర్వహించారు. యువత రంగులు చల్లుకుని ఆనందంగా గడిపారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు రహమత్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు నరసింహారెడ్డి, కాసాల అరుణ్‌కుమార్, రాకేష్ క్రిష్టఫర్, విజయ్ కిరణ్, తరుణ్, రఘు తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బోరబండలో కాంగ్రెస్ నాయకులు మహేష్‌కుమార్‌గౌడ్, నరసింహ, శంకర్, శ్రీనివాస్, ప్రసన్న, సచిన్‌లు రంగులు చల్లుకుని హోలీ సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి భవానీశంకర్‌కి ఆయన కార్యాలయంలో డివిజన్ నాయకులు గ్యార నాగరాజు, అరుణ్‌గౌడ్, సాయి, రవీందర్‌రెడ్డి, దేవేందర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.


జూబ్లీహిల్స్ దుర్గా భవానీనగర్‌లో చిన్నారుల సందడి


బంజారాహిల్స్ రోడ్ నెం.12లో...






పీపుల్స్ ప్లాజాలో యువత




జలవిహార్ పక్కన గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హోలీ ఈవెంట్‌లో...


జూబ్లీహిల్స్ రోడ్ నెం. 25 బూత్‌బంగళా వద్ద...


గౌరీశంకర్‌కాలనీలో...


ఎమ్మెల్యే మాగంటికి శుభాకాంక్షలు చెబుతున్న బీఆర్ఎస్ నాయకులు


బోరబండలో సంబరాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఆకట్టుకున్న సన్స్ పటోలా ఆర్ట్ వస్త్ర ప్రదర్శన



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-1లోని లేబుల్స్ పాప్-అప్‌లో ఏర్పాటు చేసిన సన్స్ పటోలా ఆర్ట్ వస్త్ర ప్రదర్శన ఆకట్టుకుంటుంది. చేనేత కళాకారులు రూపొందించిన రాజ్‌కోట చీరలు, పటోలా దుపట్టా, పటోలా శాలువాలు, సింగిల్ పటాన్ చీరలు, సింగిల్ పటోలా దుప్పట, పటాన్ పటోలా చీరలు, సిల్క్ టిష్యూ పటోలా వంటి విభిన్న రకాల చేనేత ఉత్పత్తులు ఇక్కడ కొలువుదీరాయి. గుజరాత్‌కు చెందిన డి సన్స్ పటోలా ఆర్ట్ నిర్వాహకులు భవిన్ మక్వానా మాట్లాడుతూ... నేత కార్మికులను ప్రోత్సహించడంతో పాటు చేనేత పరిశ్రమకు మార్కెట్‌ను అందించడమే ఈ ఎగ్జిబిషన్ ల‌క్ష్యమన్నారు. ఈ నెల 27వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు.

బస్తీల్లో కార్పొరేటర్ బాబా పర్యటన


బస్తీలో రాత్రిపూట పర్యటిస్తున్న కార్పొరేటర్ బాబాఫసియుద్దీన్

రహమత్‌నగర్: ఒక వైపు రంజాన్ ఉపవాస దీక్షల భోజనం ఏర్పాట్లు చేస్తూనే మరోవైపు బస్తీల్లో పర్యటిస్తూ అయా ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు బోరబండ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్. రంజాన్ మాసం మొదలైన నాటి నుంచి ఉపవాస దీక్ష చేపట్టిన వారి కోసం సహర్ భోజనాన్ని ఆయన తన నివాసం వద్ద ఏర్పాటు చేస్తున్నారు. అనంతరం రాత్రి వేళల్లో బస్తీల్లో పర్యటిస్తూ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంటూ వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచిస్తున్నారు. ఈ క్రమంలో రోజూ రాత్రి వేళల్లో బోరబండ డివిజన్‌లోని పలు బస్తీల్లో ఆయన పర్యటించారు. తాగునీటి సరఫరా, డ్రైనేజీ, వీధిదీపాలు, రోడ్లు తదితర సమస్యలను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు.

జేఎన్‌యూ ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థుల విజయం పట్ల ఏఐవైఎఫ్ హర్షం

హిమాయత్‌నగర్: జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం (జేఎన్‌యూఎస్‌యూ) ఎన్నికల్లో బీజేపీ విద్యార్థి సంఘం ఏబీవీపీపై వామపక్ష అభ్యర్థుల విజయం పట్ల ఏఐవైఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి కూడా ఇవే ఫలితాలు రావడం ఖాయమని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జేఎన్‌యూఎస్‌యూ ఎన్నికల్లో వామపక్ష అభ్యర్థులు విజయం సాధించడం ప్రజాస్వామ్య పరిరక్షణకు దిక్సూచి అని వారు కొనియాడారు. యునైటెడ్ లెఫ్ట్ కూటమితో ఎన్నికలు జరిగాయని, ఈ ఎన్నికల్లో ప్రత్యర్థి ఏబీవీపీ ప్రధాని నరేంద్రమోదీ విధానాలతో ప్రచారం నిర్వహించారని, మోదీ నిరంకుశ విధానాలు దేశానికి ప్రమాదకరంగా మారి దేశాన్నే నాశనం చేస్తున్నాయని భావించిన జేఎన్‌యూ విద్యార్థులు ఏబీవీపీను ఓట్ల ద్వారా తిరస్కరించారని వారు అన్నారు. జేఎన్‌యూలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా లెఫ్ట్ అభ్యర్థి ధనంజయ్, ఉపాధ్యక్షుడిగా వామపక్ష అభ్యర్థి అవిజిత్ ఘోష్, ప్రధాన కార్యదర్శిగా లెఫ్ట్ మద్దతిచ్చిన బీఏపీఎస్ఏ అభ్యర్థి స్వాతి, సంయుక్త కార్యదర్శిగా లెఫ్ట్ అభ్యర్థి మహమ్మద్ సాజిద్ ఎన్నికయ్యారన్నారు. ఈసారి ఎన్నికల్లో మొత్తం ఏడున్నర వేల మందికిపైగా విద్యార్థులు ఓటేశారన్నారు.

మైనార్టీ కోటాలో అవకాశం కల్పించండి

మహిళా కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు డాక్టర్ అస్మతున్నీసా


దీపాదాస్‌మున్షీని కలిసిన డాక్టర్ అస్మతున్నీసా

బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీని కాంగ్రెస్ పార్టీ నగర సీనియర్ నాయకురాలు డాక్టర్ అస్మతున్నీసా కలిశారు. గత 25 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నానని, అంకితభావంతో పార్టీ కోసమే పనిచేస్తున్నానని, ఇప్పటివరకు ఏ పార్టీలోకి జంప్ కాలేదని ఆమె తెలియజేశారు. తన బయోడేటాను కూడా ఇచ్చిన అనంతరం మైనార్టీ కోటలో తనకు పదవులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్న వారికి, పార్టీలో ఏళ్ల తరబడి కొనసాగుతున్న వారికి పదవులు ఇవ్వడం ద్వారా కార్యకర్తలకు మంచి సందేశం ఇచ్చినట్లవుతుందని ఆమె గుర్తుచేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచి తాను పార్టీలో ఉన్నానని, మహిళా వైస్‌చైర్మన్‌గా కూడా పనిచేశానని, తనకు గాంధీభవన్‌లో ప్రత్యేకంగా సీటు కూడా ఉండేదని అప్పటి విషయాలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. తాను ఒకవైపు పేద విద్యార్థులకు చదువులు ఇస్తూ ఇంకోవైపు సేవా కార్యక్రమాల్లో కూడా ఉన్నానని, ప్రతి ఎన్నికలోనూ కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్నానన్నారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షీ సానుకూలంగా స్పందిస్తూ పార్టీలో మంచి భవిష్యత్తు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

నేడు ఇఫ్తార్

- హాజరుకానున్న హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ
- కాంగ్రెస్‌లో చేరిన తర్వాత తొలి కార్యక్రమం ఏర్పాటు చేసిన దానం నాగేందర్

బంజారాహిల్స్: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వారం రోజుల క్రితం అధికార కాంగ్రెస్ పార్టీలో చేరి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. అప్పటి నుంచి నియోజకవర్గ వ్యాప్తంగా వందలాదిగా ఆయన అభిమానులతో పాటు బీఆర్ఎస్ పార్టీ నేతలు, ఆయన అనుచరులు అలకబూనారు. తమతో ఒక్క మాట కూడా చెప్పకుండా తమ అభిమాన నేత పార్టీ మారడాన్ని నేతలు, కార్యకర్తలు జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సైతం నాలుగు రోజుల క్రితం దానం నాగేందర్‌ను సికింద్రాబాద్ పార్లమెంటు అభ్యర్థిగా ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటి నుంచి దానం నాగేందర్ కార్యకర్తలతో, నేతలతో ఒక్క సమావేశం కూడా ఏర్పాటు చేసింది లేదు. తాజాగా ఆయన కార్యాలయం నుంచి మంగళవారం బంజారాహిల్స్‌లోని లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్ హాల్‌లో మైనార్టీల కోసం పెద్ద ఎత్తున ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంపై సర్వత్రా ఇప్పుడు నియోజకవర్గ వ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. అదే విధంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ రానున్నారని దానం నాగేందర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఘనంగా అయ్యప్ప స్వామి జన్మనక్షత్ర మహోత్సవం



వెంకటేశ్వరకాలనీ: శ్రీ అయ్యప్ప స్వామి జన్మనక్షత్ర మహోత్సవ వేడుకలు సోమవారం శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో కొలువుదీరిన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో ఘనంగా జరిగాయి. ఉదయం సుప్రభాతంతో మొదలైన పూజలు మహాగణపతి హోమం, మహాన్యాస పూర్వక లఘురుద్రాభిషేకం, పడిపూజ, భజన, హారతి, తీర్థ ప్రసాద వితరణ, పల్లకీసేవ, భజన, హారతి, హరివరాసనం వేడుకలు కనుల పండువగా జరిగాయి. పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

అంధకారంలో గాంధీపురబస్తీ


వీధి దీపాలు పనిచేయకపోవడంతో బస్తీలో అలుముకున్న చీకట్లు

బంజారాహిల్స్: అధికారుల నిర్లక్ష్యంతో బంజారాహిల్స్ రోడ్ నెం. 4లోని గాంధీపుర బస్తీలో నెల రోజులుగా అంధకారం నెలకొంది. బస్తీలోని ఒక్క వీధి దీపం కూడా పని చేయడం లేదని ఎన్నిమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులకు సైతం తాము ఫోన్లు చేసినా వినిపించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో వీధి దీపాలు పని చేయకపోవడం వల్ల చిన్నపిల్లలు, పెద్దవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా వీధి దీపాల విభాగం ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలంటూ వారు కోరుతున్నారు.

బ్రాహ్మణ సమాజాన్ని ప్రభుత్వం బలోపేతం చేయాలి

లిబర్టీ: ఆర్థికంగా, రాజకీయంగా వెనుబడి అత్యంత దయనీయ జీవితాలు వెళ్లదీస్తున్న బ్రాహ్మణ సమాజాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులు ఉమాశంకర్, భారతీయ ధార్మిక సేవా సమితి జాతీయ అధ్యక్షులు కె.వి.ఎన్.శర్మ కోరారు. పేరుకు మాత్రమే ఉన్నత వర్గాలైన బ్రాహ్మణులు ఆర్థికంగా చితికిపోయే దయనీ జీవితాలు వెళ్లదీస్తున్నారన్నారు. జీవన స్థితిగతుల్లో ప్రమాణాల్లో ఏమాత్రం మార్పు లేదన్నారు. భారతీయ ధార్మిక సేవా సమితి కార్యాలయంలో వారు మాట్లాడుతూ... పౌరోహిత్యం, అర్చకత్వం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని ఏ ప్రభుత్వం వచ్చినాక తమకు పాలకుల నుంచి సరైన సహాయం అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బ్రాహ్మణులకు ఆర్థికంగా ప్రభుత్వం చేయూతని ఇవ్వాలని సంక్షేమ పథకాలమనలో ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అర్చకులకు వేతనాలు పెంచాలని సూచించారు. పేదరికంలో ఉన్న అన్ని వర్గాలలో సమానంగా ఆర్థిక పురుగతి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

నీటి పొదుపుతో భవిష్యత్ తరాలకు మేలు

ఫిలింనగర్: ఇప్పటినుంచే నీటిని పొదుపు చేసుకోవడం ద్వారా భావితరాలకు నీటి ఎద్దడి లేకుండా చూడవచ్చని, ఇందుకు విద్యార్థులపై ఎంతో బాధ్యత ఉందని జలమండలి భూగర్భ జలాల ప్రత్యేక అధికారి సత్యనారాయణ అన్నారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-51లోని వాటర్ హార్వేస్టింగ్ థీమ్ పార్క్‌లో ప్రపంచ నీటి సంరక్షణ దినోత్సవాన్ని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఎన్‌జీఓ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి నిర్వహించారు. జలమండలి-6 డివిజన్ జీఎం హరిశంకర్ పాల్గొన్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సత్యనారాయణ మాట్లాడుతూ... వర్షపు నీటిని ఒడిసి పట్టుకుంటే భూగర్భ జలాలు ఇంకిపోవన్నారు. 40 మార్గాల ద్వారా నీటిని ఒడిసిపట్టుకోవచ్చని, పొదుపు చేసుకోవచ్చని సూచిస్తూ ఆ మోడల్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నగరానికి మంచినీటి సరఫరా జరుగుతున్న తీరును ఆయన వీడియో ద్వారా చూపించారు. ఉప్పల్‌కు చెందిన త్రినేత్రి స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థులు నీటి సంరక్షణ ప్రదర్శనను తిలకించి నీటి పొదుపుపై అవగాహన పెంచుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



బంజారాహిల్స్: శ్రీనగర్ కాలనీలోని సత్యసాయి నిగమాగమం నుంచి ఎల్ఐసీ కాలనీ రోడ్డులో ఓ గుర్తు తెలియని వ్యకతి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సోమవారం జూబ్లీహిల్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహం గురించి ఆరా తీశారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆరా తీసినా మృతుడి వివరాలు తెలియరాలేదు. దీంతో మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు ఫోన్: 87126 60464లో సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 19, క్యారెట్ 19, దొండ 28, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 50, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 19, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 15, కందగడ్డ 60, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ముమ్మరంగా వాహన తనిఖీలు


బసవతారకం కేన్సర్ హాస్పిటల్ చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

బంజారాహిల్స్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ నగదు, మద్యం, ఆభరణాలు, ఇతర బహుమతుల రవాణాను అడ్డుకునేందుకు పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీలు చేపడుతున్నారు. సోమవారం వెస్ట్‌జోన్ పరిధిలో సాయంత్రం 3 నుంచి రాత్రి 8 గంటల వరకు 5 గంటల పాటు 93 చోట్ల ఒకవైపు లా అండ్ ఆర్డర్ పోలీసులు, ఇంకోవైపు ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీమ్‌లు ముమ్మరంగా తనిఖీలు చేపట్టాయి. చెక్‌పోస్టుల్లో ప్రతి వాహనాన్నీ తనిఖీ చేశారు. సెలవు దినం కావడంతో నగదు అక్రమ రవాణా జరిగే అవకాశం ఉందని సమాచారం రావడంతో పోలీసు బృందాలు ఎక్కడికక్కడ తనిఖీల్లో పాల్గొన్నాయి. ప్రతి వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానిత వాహనాల్లో బ్యాగ్‌లను, సీట్ల కింద తనిఖీలు చేపట్టిన పోలీసులు గంటల తరబడి వాహన తనిఖీలు జరిపారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజగుట్ట, ఖైరతాబాద్ పోలీసులు ఎక్కడికక్కడ తనిఖీల్లో పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వాహనదారులపై కొరడా


వాహనాలు తనిఖీ చేస్తున్న బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి తిరుగుతున్న వాహనాలపై బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధించారు. సోమవారం బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్ ఆదేశాల మేరకు ఎస్ఐలు వేర్వేరుచోట్ల వాహనాల తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించి కౌన్సెలింగ్ నిర్వహించారు. త్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 15 మందికి ఎస్ఐలు కౌన్సెలింగ్ నిర్వహించారు. త్రిపుల్ రైడింగ్ వల్ల ప్రమాదాలు పొంచి ఉంటాయని, బైక్‌పై కూర్చొన్న ముగ్గురికీ ప్రమాదమని, దీని వల్ల చుట్టుపక్కల వారికి కూడా ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడతాయని వారు తెలిపారు. త్రిపుల్ రైడింగ్ చేస్తే రూ. 1200 జరిమానా విధిస్తున్నట్లుగా, పట్టుబడ్డ వాహనదారులతో ప్లకార్డులు పట్టించి వారిలో అవగాహన కల్పించారు.

'బీసీల సమస్యల పరిష్కారంలో బీజేపీ విఫలం'

లిబర్టీ: సామాజిక, ఆర్థిక సమానత్వానికి దూరంగా ఉంటూ దయనీయ జీవితాలు వెళ్లదీస్తున్న బీసీలు సంఘటిత శక్తిని చాటాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి కోరారు. విడిపోతే పడిపోతం ఐక్యంగా ఉంటే రాజ్యాధికారం సాధిస్తామనే సూత్రాన్ని బీసీలు విస్మరించకూడదని ఆయన హితవు పలికారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీలు రాజ్యాధికారానికి చేరువలో ఉన్నారని వచ్చే ఎన్నికల్లో బీసీల రాజ్యం తథ్యమని స్పష్టం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దాదాపు పదేళ్ల కాలంలో బీసీలకు ఒరిగిందేమీ లేదని ఒక్క సమస్యా పరిష్కరించలేదని విమర్శించారు. బీసీ కులగణన చేయాలంటే చేయలేదని బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీల అభివృద్ధి కోసం బడ్జెట్ కేటాయించలేదని అన్నారు. బీసీలు కీలక ఘట్టంలో ఉన్నారని ఇప్పుడు తీసుకునే నిర్ణయం పైనే బీసీల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని ఒక్క అడుగు వెనక్కి వేసిన మళ్లీ ఐదేళ్ల అణిచివేతకు గురి కావాల్సిందేనని కుమారస్వామి అన్నారు. ఆలోచించి బీసీలకు అధికారం రావాలంటే రానున్న రెండు నెలల సమయం కీలకమని మిషన్ 2024 లక్ష్యంగా బీసీల పోరాటం ఉంటుందని తాము వెనకడుగువేసే ప్రసక్తే లేదని వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తాడోపేడో తెల్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

జలవిహార్‌లో 'మండే'.. కూల్‌గా!





బంజారాహిల్స్: హోలీ సెలవుతో పాటు ఎండ వేడిమి ఎక్కువగా ఉండటంతో నగరవాసులు పెద్ద ఎత్తున నెక్లెస్ రోడ్డులోని జలవిహార్‌కు విచ్చేశారు. విభిన్న రకాల వాటర్‌గేమ్స్‌తో పాటు రెయిన్ డ్యాన్స్‌లో చేస్తూ సందడిగా గడిపారు. పెద్ద ఎత్తున జనం రావడంతో జలవిహార్ పరిసర ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి.



ఇటు పేదల సైన్యం.. అటు పెత్తందార్ల పటాలం

రాజ్యాంగపరంగా రిజర్వేషన్లు లేకున్నా బలహీన వర్గాలకు 48 శాసనసభ, 11 ఎంపీ సీట్లు

అసెంబ్లీ, ఎంపీ కలిపి మొత్తం 200 స్థానాల్లో.. 100 సీట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకే

లోక్‌సభ స్థానాల్లో టీడీపీ-జనసేన-కూటమి పోటీ ఇలా..:

పార్టీ	పోటీ చేసే స్థానాలు	అభ్యర్థులను ఖరారు చేసినవి	అభ్యర్థులను ఎంపిక చేయాల్సినవి
టీడీపీ	17	13	4
జనసేన	2	1	1
బీజేపీ	6	6	0
మొత్తం	25	20	5

రిజర్వుడు స్థానాలు పోగా మిగిలిన జనరల్ స్థానాల్లో 40 శాతం సీట్లను బీసీలకే ఇచ్చిన సీఎం జగన్

సాక్షి, అమరావతి: పేదల పక్షాన ఎవరు? పెత్తందారులకు కొమ్ము కాస్తోంది ఎవరనేది ఎన్నికల సాక్షిగా స్పష్టంగా తేలిపోయింది. ఎన్నికల కురుక్షేత్ర యుద్ధంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల పక్షాన నిలిస్తే టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి పెత్తందార్ల వైపు నిలిచింది. రాష్ట్రంలోని 175 శాసనసభ, 25 లోక్‌సభ నియోజకవర్గాలు వెరసి 200 స్థానాలకుగానూ సగం అంటే వంద సీట్లను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు సీఎం జగన్ కేటాయించడం గమనార్హం. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు చేసిన 36 శాసనసభ, ఐదు లోక్‌సభ వెరసి 41 స్థానాలను మినహాయిస్తే మిగతా 159 శాసనసభ, లోక్‌సభ జనరల్ స్థానాల్లో 59 చోట్ల (48 శాసనసభ, 11 లోక్‌సభ) బీసీ వర్గానికి చెందిన అభ్యర్థులను సీఎం జగన్ బరిలోకి దించారు. అంటే జనరల్ స్థానాల్లో దాదాపు 40 శాతం సీట్లను బీసీలకు కేటాయించినట్లు స్పష్టమవుతోంది. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు 159 జనరల్ స్థానాలకుగానూ కేవలం 35 స్థానాల్లో(31 శాసనసభ, 4 లోక్‌సభ) మాత్రమే బీసీలకు అవకాశం కల్పించారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులను ఖరారు చేసిన జనరల్ స్థానాలను పరిగణలోకి తీసుకున్నా బీసీలకు కేవలం 37 స్థానాలను (33 శాసనసభ, 4 లోక్‌సభ) మాత్రమే కేటాయించారు. కూటమి కేవలం 23 శాతం స్థానాలను మాత్రమే బీసీలకు కేటాయించినట్లు స్పష్టమవుతోంది. సేవే పరమావధిగా జనబలమే గీటురాయిగా నిజాయితీ, నిబద్ధత, విధేయత కొలమానంగా విద్యావంతులు, సామాన్యులకు సీఎం జగన్ పట్టంగట్టారు.



మరోవైపు చంద్రబాబు యథాప్రకారం కోట్లు కుమ్మరించే వ్యాపారులు, కాంట్రాక్టర్లు, ఎన్నారైలు, ఆర్థిక నేరగాళ్లు, నేర చరితులకు పెద్దపీట వేశారు.

అదే ఒరవడితో...

నామినేటెడ్ పనులు, పదవుల్లో ఆయా వర్గాలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఏకంగా చట్టం చేసి మరీ రాజకీయ సాధికారతకు బాటలు వేసిన సీఎం జగన్ అదే ఒరవడిని కొనసాగిస్తూ సార్వత్రిక ఎన్నికల్లో సగం సీట్లను వారికి కేటాయించారు. రాజ్యాంగపరంగా రిజర్వేషన్లు లేని బీసీలకు 48 శాసనసభ, 11 లోక్‌సభ వెరసి 59 స్థానాలను కేటాయిస్తూ నిర్ణయం తీసుకుని సీఎం జగన్ సంచలనం సృష్టించారు. దేశ చరిత్రలో ఇదో రికార్డు. అందులోనూ ఉపాధి కూలీ ఈర లక్కప్ప (మడకశిర), టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులు (నెల్లూరు), బంగారు నగల తయారీ కార్మికుడు ఖలీల్ అహ్మద్(నెల్లూరు సిటీ), సర్నాల తిరుపతిరావు (మైలవరం), సాధారణ న్యాయవాది గూడూరు ఉమాబాల (నరసాపురం) లాంటి సామాన్యులను బరిలోకి దించారు. దేశంలో సామాజిక న్యాయం నినాదంతో ఆవిర్భవించిన బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి, బీసీ నేతలు నాయకత్వం వహిస్తున్న సమాజ్‌వాది పార్టీ(అఖిలేష్ యాదవ్), ద్రవిడ మున్నేట్ర కజగం (తమిళనాడు సీఎం స్టాలిన్) సైతం ఈ స్థాయిలో బడుగు, బలహీన వర్గాలకు సీట్లను కేటాయించిన దాఖలాలు లేవు.

నినాదం కాదు విధానమే..

58 నెలలుగా సామాజిక న్యాయం అంటే నినాదం కాదు అమలు చేయాల్సిన విధానమని ప్రతి అడుగులో చాటిచెబుతున్న సీఎం జగన్ సార్వత్రిక ఎన్నికల్లో మరో అడుగు ముందుకేశారు. ఈనెల 16వతేదీన ఒకేసారి 175 శాసనసభ, 25 ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. 29 స్థానాల్లో ఎస్సీ, ఏడు స్థానాల్లో ఎస్టీ, 48 స్థానాల్లో బీసీ వర్గానికి చెందిన అభ్యర్థులను బరిలోకి దించారు. అంటే 84 శాసనసభ స్థానాలను ఆ వర్గాలకు కేటాయించినట్లు స్పష్టమవుతోంది. ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అభ్యర్థులకు ఏడు నియోజకవర్గాల్లో అవకాశం కల్పించారు. 25 లోక్‌సభ స్థానాలకుగానూ 11 చోట్ల బీసీలకు సీట్లు ఇచ్చిన సీఎం జగన్ నాలుగు స్థానాల్లో ఎస్సీలకు, ఒక చోట ఎస్టీ వర్గానికి చెందిన అభ్యర్థులకు అవకాశం కల్పించారు. సీఎం జగన్ ప్రకటించిన అభ్యర్థుల్లో అత్యధికులు సామాన్యులే ఉన్నారు.

మరోసారి ద్రోహం..

సామాజిక న్యాయంలో సీఎం జగన్ దేశానికి మార్గనిర్దేశం చేస్తూ ఆదర్శంగా నిలవగా రాజకీయాలను ఫక్తు వ్యాపారంగా మార్చేసి ఓటుకు కోట్లు వెదజల్లిన చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి మాత్రం యథాప్రకారం సామాజిక ద్రోహానికి పాల్పడింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అరకొరగా కేటాయించడంతోపాటు మిగతా చోట్ల రూ.కోట్లకు కోట్లు కుమ్మరించే ఆర్థిక నేరగాళ్లు, వ్యాపారులు, కాంట్రాక్టర్లు, ఎన్నారైలనే చంద్రబాబు బరిలోకి దించారు. 2014 తరహాలోనే తాజాగా మరోసారి జనసేన-టీడీపీతో జతకట్టిన చంద్రబాబు 144 శాసనసభ, 17 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ 21 శాసనసభ, రెండు లోక్‌సభ స్థానాల్లో జనసేన, పది శాసనసభ, 6 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ పోటీ చేసేలా పొత్తు లెక్కలు తేల్చారు. ఈ కూటమి ఇప్పటిదాకా 156 శాసనసభ, 20 లోక్‌సభ వెరసి 176 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 78 స్థానాలను మాత్రమే కేటాయించింది. ఇందులో 31 శాసనసభ, నాలుగు లోక్‌సభ వెరసి 35 స్థానాల్లో మాత్రమే చంద్రబాబు బీసీలకు అవకాశం ఇచ్చారు. మరో 3 నాలుగు సీట్లకు మించి ఆ వర్గాలకు కేటాయించే అవకాశం లేదని కూటమి నేతలే చెబుతుండటం గమనార్హం.

పెత్తందార్లకు బాబు పెద్దపీట..

2014–19 మధ్య అధికారంలో ఉన్నప్పుడు ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా? అంటూ ఆ వర్గాల ప్రజల పుట్టుకను అవహేళన చేసిన చంద్రబాబు, హామీలను నిలబెట్టుకోవాలని వేడుకున్న బీసీలను తోకలు కత్తిరిస్తా, తాటతీస్తానంటూ బెదిరించారు. బలహీన వర్గాలకు చెందిన వారు న్యాయమూర్తులుగా పనికిరారంటూ ఆ వర్గాల ఆత్మాభిమానాన్ని దెబ్బతీశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరిన మైనార్టీ యువకులపై దేశద్రోహం కేసులు బనాయించి కటకటాల పాలుచేసి ఆ వర్గాలను అణగదొక్కారు. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ఆ వర్గాలకు ద్రోహం చేసి పెత్తందార్లకే పెద్దపీట వేశారు.

- టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఇప్పటిదాకా 156 శాసనసభ స్థానాలకు (టీడీపీ 138, జనసేన 18) అభ్యర్థులను ప్రకటించగా బీసీలకు 33 (టీడీపీ 31, జనసేన 2), ఎస్సీలకు 27 (టీడీపీ 24, జనసేన 3), ఎస్టీలకు 6 (టీడీపీ 5, జనసేన 1), మైనార్టీలకు 3 సీట్లను కేటాయించారు. అంటే ఆ వర్గాలకు మొత్తం 69 శాసనసభ స్థానాలను కేటాయించారు. టీడీపీ ఓసీలకు కేటాయించిన 75 స్థానాల్లో 30 చోట్ల చంద్రబాబు తన సొంత సామాజిక వర్గానికి చెందిన వారినే బరిలోకి దించడం గమనార్హం.
- కూటమి ఇప్పటిదాక 25 లోక్‌సభ స్థానాలకుగానూ 20 స్థానాల్లో (టీడీపీ 13, బీజేపీ 6, జనసేన 1) అభ్యర్థులను ఖరారు చేసింది. అందులో బీసీలకు 4 (టీడీపీ), ఎస్సీలకు 4 (టీడీపీ 3, బీజేపీ 1), ఎస్టీలకు ఒకటి (బీజేపీ) కేటాయించారు.
- శాసనసభ, లోక్‌సభ రెండూ కలిపి బీసీలకు 59 సీట్లను సీఎం జగన్ కేటాయించగా చంద్రబాబు కేవలం 35 స్థానాల్లో మాత్రమే వారికి పోటీకి అవకాశం కల్పించడం గమనార్హం. మైనార్టీలకు సీఎం జగన్ 7 శాసనసభ స్థానాల్లో అవకాశం ఇచ్చి ఆదరిస్తే చంద్రబాబు మూడు స్థానాలకే పరిమితం చేశారు.
- ఎన్నికల్లో కోట్లకు కోట్లు కుమ్మరించే కాంట్రాక్టర్లు అమిలినేని సురేంద్రబాబు (కళ్యాణదుర్గం నియోజకవర్గం), ఎన్నారైలు పెమ్మసాని చంద్రశేఖర్ (గుంటూరు లోక్‌సభ), వెనిగండ్ల రాము (గుడివాడ), కాకర్ల సురేష్ (ఉదయగిరి నియోజకవర్గం), వ్యాపారులు మాజీ మంత్రి పొంగూరు నారాయణ (నెల్లూరు సిటీ), కేశినేని చిన్ని (విజయవాడ), ఎం.భరత్ (విశాఖ లోక్‌సభ), చింతమనేని ప్రభాకర్ (దెందులూరు), వెలగపూడి రామకృష్ణ (విశాఖ ఈస్ట్), జూలకంటి బ్రహ్మారెడ్డి (మాచర్ల) లాంటి నేర చరిత్ర కలిగిన వారిని చంద్రబాబును బరిలోకి దించి తాను పెత్తందార్లకే కొమ్ము కాస్తానని మరోసారి నిరూపించుకున్నారు.

సామాజిక ప్రయాణం..

గత ఎన్నికల్లో అఖండ విజయం సాధించి అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ సామాజిక న్యాయాన్ని పాలనలో ప్రతి అడుగులోనూ చాటిచెబుతున్నారు. మంత్రివర్గంలో ఏకంగా 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అవకాశం ఇవ్వగా రాజ్యసభ, ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల పదవుల్లో సింహభాగం ఆయా వర్గాలకే ఇచ్చారు. దేశ చరిత్రలో తొలిసారిగా నామినేటెడ్ పదవులు, పనుల్లో 50 శాతం ఆయా వర్గాలకే రిజర్వేషన్ చేస్తూ చట్టం చేసి మరీ పదవులు, పనులు దక్కేలా చర్యలు తీసుకున్నారు. సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో రూ.2.70 లక్షల కోట్లు, నాన్ డీబీటీతో రూ.1.79 లక్షల కోట్లు వెరసి రూ.4.49 లక్షల కోట్ల మేర పేదలకు లబ్ధి చేకూర్చగా ఇందులో సింహభాగం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే ప్రయోజనం పొందారు. సీఎం జగన్ ఒకవైపు పరిపాలనలో భాగస్వామ్యం మరోవైపు ఆర్థిక చేయూతనిస్తుండటం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాలు సామాజిక సాధికారత సాధించేందుకు బాటలు వేసింది. ఇది ఆయా వర్గాల ప్రజల్లో సీఎం జగన్ నాయకత్వం పట్ల విశ్వసనీయత మరింత పెరిగేందుకు దోహదం చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతోపాటు అగ్రవర్ణ పేదలు సీఎం జగన్ వెంటే నడుస్తున్నారని భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభలు చాటిచెప్పాయి. మరోవైపు సామాజిక ద్రోహం తలపెట్టిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమికి నిరాదరణ ఎదురవుతోంది. టీడీపీ-జనసేన పొత్తుల లెక్క తేలాక ఆ రెండు పార్టీలూ ఉమ్మడిగా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన జెండా సభకు, బీజేపీతో జతకలిశాక మూడు పార్టీలు చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగళం సభలు ప్రజలు లేక పేలవంగా సాగడమే ఇందుకు నిదర్శనం. సార్వత్రిక ఎన్నికలకు ముందే వైఎస్సార్‌సీపీ ప్రభంజనం మరోసారి సృష్టించడం ఖాయమని సిద్ధం సభలు తేల్చి చెప్పగా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి ఘోర పరాజయం తథ్యమని తాడేపల్లిగూడెం, చిలకలూరిపేట సభలు నిరూపించాయని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మరో చారిత్రక విజయాన్ని నమోదు చేయడం ఖాయమని టైమ్స్ నౌ-ఏటీజీ, జీన్యూస్-మాట్రిజ్ లాంటి దిగ్గజాలకు పైగా ప్రముఖ జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేల్లోనూ వెల్లడైంది. వీటిని పరిశీలిస్తే వచ్చే ఎన్నికలు ఏక పక్షమేనని, వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించి వైఎస్ జగన్ మరోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు తేల్చి చెబుతున్నారు.

లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక ఇలా..

సామాజిక వర్గం	వైఎస్సార్‌సీపీ కేటాయించిన స్థానాలు	టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కేటాయించిన స్థానాలు
ఎస్సీ	4	4(టీడీపీ 3, బీజేపీ 1)
ఎస్టీ	1	1(బీజేపీ)
బీసీ	11	4(టీడీపీ)
మొత్తం	16	9

(నోట్.. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి 20 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది)

అసెంబ్లీ అభ్యర్థుల ఎంపిక ఇలా..

సామాజిక వర్గం	వైఎస్సార్‌సీపీ కేటాయించిన స్థానాలు	టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కేటాయించిన స్థానాలు
ఎస్సీ	29	27 (టీడీపీ 24, జనసేన 3)
ఎస్టీ	7	6 (టీడీపీ 5, జనసేన 1)
బీసీ	48	33 (టీడీపీ 31, జనసేన 2)
మొత్తం	84	66

(నోట్.. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి 156 శాసనసభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది)

మైనార్టీలకు శాసనసభ సీట్లు

పార్టీ	కేటాయించిన స్థానాలు
వైఎస్సార్‌సీపీ	7
టీడీపీ	3

మాల, మాదిగల మధ్య చిచ్చుకు చంద్రబాబు కుట్రలు

- అన్నదమ్ముల్లా ఉన్న మాల, మాదిగల మధ్య చిచ్చుబెట్టే యత్నం
- మంద కృష్ణమాదిగపై దళితుల మండిపాటు

సాక్షి, అమరావతి/భీమవరం/తాడేపల్లిరూరల్/నెహ్రూ నగర్/కడప కార్పొరేషన్: ఎన్నికలు వచ్చాయంటే చాలు అన్నదమ్ముల్లా ఉన్న మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టేలా చంద్రబాబు కుట్రలు చేస్తారని మాల మహానాడు(పీవీ రావు) జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు మండిపడ్డారు. ఇద్దరి మధ్య చిచ్చు పెట్టేందుకు మంద కృష్ణ మాదిగతో వివాదాస్పద వ్యాఖ్యలు చేయిస్తారని తెలిపారు. తాడేపల్లిలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మాదిగ ఆత్మగౌరవాన్ని కొన్నేళ్లపాటు మంద కృష్ణమాదిగా చంద్రబాబు పాదాల వద్ద పెట్టారని చెప్పారు. మళ్లీ ఈ మధ్య ప్రధాని మోదీ పాదాల చెంతపెట్టారని మండిపడ్డారు. ఎన్నికలు వచ్చాయంటే మంద కృష్ణ మాదిగకు పండుగేనని, చంద్రబాబు రాజకీయాల్లో ప్యాకేజీ అనేది మొదట మంద కృష్ణ మాదిగతోనే ప్రారంభించారని తెలిపారు. ఏపీ రాజకీయాలతో మంద కృష్ణకు ఏం పని, ఇన్నేళ్ల పాటు ఎమ్మార్పీఎస్ పేరుతో మంద కృష్ణ వెలగబెట్టి రాజకీయాలు తెలియని వారు ఎవరూ లేరన్నారు. 30న మంద కృష్ణమాదిగ నిర్వహించాలని చూస్తోంది.. మాదిగల సదస్సు కాదనీ, అది టీడీపీ మాయ సభ అని చెప్పారు. దళితులకు చంద్రబాబు బద్ధ శత్రువని, మంద కృష్ణమాదిగకు డబ్బులిచ్చి మాల, మాదిగల మధ్య చిచ్చు పెట్టారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు దుయ్యబట్టారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మంద కృష్ణమాదిగ పెద్ద మొత్తంలో ప్యాకేజీ తీసుకుని మాదిగ సోదరులను టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి తాకట్టుపెడుతున్నారని మండిపడ్డారు. మంద కృష్ణ మాదిగలను చంద్రబాబుకు తాకట్టు పెడుతున్నాడని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరు కనకారావు అన్నారు. తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మీడియాతో మాట్లాడారు. కృష్ణమాదిగ తన వ్యక్తిగత స్వార్థం కోసం మాదిగలను బాబుకు తాకట్టు పెట్టాలనుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీట్ల కోసం కాకుండా కాసుల కోసమే వర్గీకరణ సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని తన ప్రయోజనాలు కాపాడుకుంటున్నారని మండిపడ్డారు. మంద కృష్ణమాదిగ ఈ నెల 30న నిర్వహించే సదస్సును అడ్డు కుని తీర తామని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు హెచ్చరించారు. అసలు ఏపీలో మాదిగ సదస్సు పెట్టడానికి నీకు ఏ అర్హత ఉందో చెప్పాలని డిమాండ్ చేశారు.

వెన్నుపోటు పొడుస్తారా?

టీడీపీపై బీజేపీ నాయకుల ఆగ్రహం

- తడిగుడ్డతో గొంతులు కోసేవాడు అంటూ ప్రధానిపైనే టీడీపీ పోస్టులు
- మా పార్టీ సభ్యత్వం లేని రఘురామకు ఎందుకు సీటివ్వాలంటున్న బీజేపీ నేతలు
- 17 ఎంపీ సీట్లు ఉన్న చంద్రబాబే ఇచ్చి ఉండొచ్చుగా అంటూ మండిపాటు
- చివరికి కాంగ్రెస్‌తో కలిసి కూడా దుష్ప్రచారం చేస్తున్నారని వెల్లడి
- మరోవైపు.. టీడీపీ అనుకూల పత్రికల్లోనూ మోదీపై విష ప్రచారం
- టీడీపీ దుష్ప్రచారాన్ని పట్టించుకోని రాష్ట్ర నాయకత్వంపై బీజేపీ నేతల ఆగ్రహం

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ మిత్రధర్మాన్ని సైతం పక్కనపెట్టి బీజేపీపైనా, ప్రధాని నరేంద్ర మోదీపైనా అసభ్య పదజాలంతో తీవ్ర దుష్ప్రచారానికి దిగడంపై కమల దళం తీవ్ర స్థాయిలో మండిపడుతుంది. రఘురామకృష్ణరాజు విషయంలో గత రెండు రోజులుగా టీడీపీ అభిమానులు సాగిస్తున్న ప్రచారానికి తోడు చంద్రబాబుకు అత్యంత అనుకూలంగా ఉండే ప్రధాన పత్రికలో సైతం 'మోదీ.. మోనార్క్'ఎడిటోరియల్ కథనాలు రాయడంపైనా బీజేపీ రాష్ట్ర నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నరసాపురం లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థిగా చంద్రబాబు చెప్పిన రఘురామకృష్ణరాజును కాకుండా 30 ఏళ్లకుపైగా బీజేపీలో కొనసాగుతున్న సీనియర్ నాయకుడు భూపతిరాజు శ్రీనివాస వర్మకు ఇవ్వడమే తమ పాపమైందని అంటున్నారు. పొత్తులో భాగంగా టీడీపీకి 17 లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయని, మూడేళ్లకు పైగా టీడీపీతోనే అంటకాగుతున్న రఘురామరాజుకు ఒక టిక్కెట్ ఇవ్వొచ్చు కదా అని కమలం నేతలు ప్రశ్నిస్తున్నారు. రఘురామరాజుకు బీజేపీ సభ్యత్వం కూడా లేదని, ఆయనకు టిక్కెట్ ఎలా ఇస్తామని అంటున్నారు. శ్రీనివాస వర్మ పేరును ప్రకటించినప్పటి నుంచి 'సమయం వచ్చినప్పుడు తడి గుడ్డతో గొంతు కోసే వాడే మోడాజీ'అంటూ ప్రధాని మోదీపైనే పోస్టులు పెడుతున్నారని మండిపడుతున్నారు. రఘురామరాజుకి బీజేపీ నుంచి అవకాశం ఇవ్వకపోతే బీజేపీ పక్కా డబుల్ గేమ్ ఆడుతున్నట్టే లెక్కా..'అంటూ మరొక పోస్టు వచ్చిందని... 'ఇంకా బీజేపీ జగన్‌రెడ్డి చేతిలో ఉంది అని చాలా మంది తెలుగుతమ్ముళ్ల



అనుమానం'అంటూ ఇంకొకరు పోస్టులు పెడుతున్నారని, 'బీజేపీ జస్ట్ అలయెన్స్‌లో ఉంటుంది, ఓటు వేసేది లేదు. పోతే పోయింది ------ ఇలాంటి రాజకీయాలా..'అంటూ అసభ్య పదజాలంతో మరో పోస్టు పెట్టారని, ఇలా అనేక మెసేజ్‌లు పెడుతున్నారని బీజేపీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో బీజేపీకి వ్యతిరేకంగా 'నో ఓట్ ఫర్ బీజేపీ''నో ఓటు బీజేపీ'శీర్షికలతో చేస్తున్న ప్రచారానికి కూడా టీడీపీ అభిమానులు కూడ జతకలుస్తున్నారని చెప్పారు. రెండు రోజుల క్రితమే చంద్రబాబుకు పూర్తి అనుకూలంగా ఉండే ఒక పత్రికలో మోదీ వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు చేస్తూ ఆ పత్రిక యజమాని ఎడిటోరియల్ కూడా రాశారని చెప్పారు. రఘురామకు సీటు నిరాకరించినప్పటి నుంచి ఓ ప్రణాళిక ప్రకారం తమ పార్టీపైన, ప్రధాని పైన దుష్ప్రచారం చేస్తున్నారని బీజేపీ సీనియర్ నేతలు అంటున్నారు. ఇంత విష ప్రచారం జరుగుతున్నా బీజేపీ రాష్ట్ర నాయకత్వం పట్టించుకోకపోవడాన్ని కూడా వారు తప్పుపడుతున్నారు. రఘురామకృష్ణరాజు ఇప్పటికే టీడీపీ నుంచి పోటీ చేసేందుకు ఆయన అభిమానులు మంగళవారం హైదరాబాద్‌లో ఆత్మీయ సమావేశాలకు ఏర్పాట్లు చేసుకుంటూ మరో పక్క బీజేపీపై ఇలాంటి ప్రచారానికి దిగడాన్ని తప్పుపడుతున్నారు.

చంద్రబాబు మార్కు రాజకీయం..

2019లో వైఎస్ జగన్ ప్రభంజనంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నరసాపురం లోక్‌సభ స్థానంలో గెలుపొందిన రఘురామకృష్ణరాజు ఆ తర్వాత పూర్తిగా తెలుగుదేశం పార్టీ, చంద్రబాబుకు అనుకూలంగా పనిచేస్తూ, 10 రోజుల క్రితమే వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేశారని బీజేపీ నాయకులు గుర్తు చేస్తున్నారు. అలాంటి రఘురామకృష్ణం రాజుకు పొత్తులో టీడీపీ పోటీ చేస్తున్న ఏదో ఒక సీటు ఇచ్చి ఉండొచ్చు.. లేదంటే నరసాపురం లోకసభ సీటునే టీడీపీనే తీసుకొని ఆయనకు కేటాయించి ఉండొచ్చు కదా అంటూ కమలం నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఆయనకు టీడీపీ నుంచి టిక్కెట్ ఇచ్చే ఉద్దేశం లేక చంద్రబాబు వ్యూహాత్మకంగా ఆయన సిట్టింగ్ స్థానం నరసాపురం లోక్‌సభ స్థానాన్ని సీటును పొత్తులో బీజేపీకి కేటాయించారని బీజేపీవర్గాలు చెబుతున్నాయి. వాస్తవంగా బీజేపీ మొదట ఏలూరు లోక్‌సభ స్థానాన్ని కోరినప్పటికీ, ఆ స్థానాన్ని బీసీకి ఇవ్వాలన్న సాకుతో చంద్రబాబు బీజేపీకి నరసాపురం స్థానాన్ని సూచించారని అంటున్నారు. నరసాపురం నుంచి రఘురామకృష్ణరాజుకు బీజేపీ టిక్కెట్టు ఇప్పించాలని ప్రయత్నించారని, అయితే, నరసాపురంలో బీజేపీ నేత శ్రీనివాసవర్మ మూడు దశాబ్దాలుగా పార్టీకి పని చేస్తున్న వ్యక్తి ఎంపిక చేయడం తప్పు ఎలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు. 1991లో బీజేపీ యువజన విభాగం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా మొదలు పెట్టి ప్రస్తుతం రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా ఉన్నారని, అందువల్ల బీజేపీ ఈ స్థానం నుంచి శ్రీనివాస వర్మను పోటీకి దింపిందని పేర్కొంటున్నారు. ఇది నచ్చకే బీజేపీపై టీడీపీ విష ప్రచారం చేస్తోందని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. 'బీజేపీ ప్రకటించిన లోక్‌సభ అభ్యర్థుల జాబితాలో రఘురామకృష్ణంరాజు పేరు లేకపోవడంలో ఆశ్చర్యం ఏముంది? కనీసం బీజేపీలో ప్రాథమిక సభ్యత్వం కూడా తీసుకోకుండా సీటు ఎలా ఆశిస్తారు.. ఇది బీజేపీ శ్రేణులకే కాదు, సామాన్యులకూ అర్థం కాని ప్రశ్న. కానీ వారిపై జాలి చూపే పార్టీలు ఎందుకు సీటు ఇవ్వలేదో సమాధానం చెప్పాలి'అంటూ బీజేపీ నాయకుడు లక్ష్మీపతి రాజా సోషల్ మీడియాలో ట్వీట్ చేయడం గమనార్హం.

ఇడుపులపాయ నుంచి ప్రచార భేరి

- రేపటి నుంచి 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు సీఎం జగన్ శ్రీకారం
- ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ 21 రోజులపాటు యాత్ర



సాక్షి, అమరావతి: పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చేందుకు మరోసారి చారిత్రక విజయంతో అధికారంలోకి రావడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఇడుపులపాయ నుంచి ఎన్నికల ప్రచారభేరి మోగించనున్నారు. బుధవారం ఉదయం 10.56 గంటలకు సీఎం జగన్ తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి మధ్యాహ్నానికి ఇడుపులపాయ చేరుకుని దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద ప్రార్థనలు చేసి నివాళులు అర్పిస్తారు. అనంతరం 'మేమంతా సిద్ధం'బస్సు యాత్రను ప్రారంభిస్తారు. తొలిరోజు బస్సు యాత్ర కడప పార్లమెంట్ నియోజకవర్గంలో జరగనుంది. ఇడుపులపాయ నుంచి వేంపల్లి, వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల మీదుగా సాయంత్రం ప్రొద్దుటూరు చేరుకుని బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం అక్కడి నుంచి నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. గురువారం నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బస్సు యాత్ర నిర్వహిస్తారు.

ప్రజాక్షేత్రంలోనే జననేత..

ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ 21 రోజులపాటు సీఎం జగన్ బస్సుయాత్రను నిర్వహించనున్నారు. ఒక్కో రోజు ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో యాత్ర జరగనుంది. సిద్ధం సభలు జరిగిన నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాలు మినహా మిగతా 21 ఎంపీ స్థానాల పరిధిలో బస్సు యాత్ర నిర్వహిస్తారు. యాత్రలో రో జూ ఉదయం వివిధ వర్గాల ప్రజలు, మేధావులతో సీఎం జగన్ సమావేశమవుతారు. ప్రభుత్వ పనితీరును మరింత మెరుగుపర్చుకోవడానికి సలహాలు, సూచనలు స్వీకరించనున్నారు. సాయంత్రం ఆయా పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. బస్సు యాత్రలో 21 రోజులు ప్రజలతో సీఎం జగన్ మమేకమవుతారు. పూర్తిగా ప్రజాక్షేత్రంలోనే ఉంటారు.

గీతాంజలి లాగే నన్నూ ట్రోల్ చేశారు

- ప్రభుత్వం చేసిన మేలును చెప్పుకోవడమూ తప్పేనా?
- గీతాంజలి కుటుంబాన్ని పరామర్శించిన కోన వెంకట్

తెనాలి: 'గీతాంజలి ఆత్మహత్యను తలుచుకుంటే ఏదో తెలియని బాధ కలుగుతోంది. ప్రభుత్వం చేసిన మేలును చెప్పుకోవడం కూడా తప్పేనా? అన్యాయంగా ఇద్దరు ఆడబిడ్డలకు తల్లి ప్రేమను దూరం చేశారు. మా ఊరి ప్రభుత్వ స్కూల్ అభివృద్ధి చెందిందనే సంతోషంతో నేను ఆ ఫొటోలు పెడితే నన్నూ ట్రోల్ చేశారు'అని ప్రముఖ సినీ రచయిత, నిర్మాత కోన వెంకట్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం గుంటూరు జిల్లా తెనాలిలోని ఇస్లాంపేటలో గీతాంజలి భర్త బాలచంద్ర, కుమార్తెలు రిషిత, రుషికలను ఆయన పరామర్శించారు. వారికి రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. 'సోషల్ మీడియా శాడిజానికి గీతాంజలి బలైపోయింది. సోషల్ మీడియా శాడిజానికి నేను కూడా బాధితుడినే. మా ఊరిలో ప్రభుత్వ స్కూల్‌ను ఎంతో గొప్పగా అభివృద్ధి చేశారనే సంతోషంతో ఫొటోలు తీసి సోషల్ మీడియాలో షేర్ చేశా. అంతే విపరీతంగా ట్రోల్ చేశారు. సోషల్ మీడియా శాడిజానికి చెక్ పెట్టాల్సిన సమయం వచ్చింది. వీలైతే ప్రభుత్వం కొత్త చట్టాలను తీసుకురావాలి. సీఎం జగన్ ఎన్నో మంచి పనులు చేస్తున్నారు. వెతికి వెతికి మరీ ఎక్కడ పేదలున్నా, వారికి మంచి చేస్తున్నారు. కానీ ప్రభుత్వం చేసిన మేలు చెబితే సోషల్ మీడియా శాడిస్టులు ప్రజలను వేధిస్తున్నారు. దీంతో ప్రజలు కూడా ప్రభుత్వ మంచిని చెప్పడానికి భయపడుతున్నారు'అని పేర్కొన్నారు.



గీతాంజలి పిల్లలకు ఆర్థిక సాయం అందజేస్తున్న కోన వెంకట్

ఒకవైపు వర్షాభావం...
మరోవైపు అడుగంటిన
భూగర్భ జలాలు...
వచ్చేసిన వేసవి.
ఇంకా రెండు మూడు నెలలు
గడవాలి ఈ వేసవిలో.
నీరు ముఖ్యం.
బెంగళూరు ఇప్పటికే అనుభవిస్తోంది.
కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే
తక్కువ నీటితో బాగానే ఉండొచ్చు
అని బెంగళూరు డాక్టర్ దివ్యాశర్మ
రాసిన 'ఎక్స్' పోస్టు వైరల్ అయ్యింది.
అది అందరికీ శిరోధార్యం.
ఆమె చేసిన నీటి పొదుపు సూచనలు





అదుపు అదుపు నీటి పొదుపు

ఎక్కడ నీటి ట్యాంకర్లు కనిపించవో, ఎక్కడ స్త్రీలు కుళాయిల దగ్గర ప్లాస్టిక్ బిందెలతో తగాదాలు పడరో, ఎక్కడ పల్లెటూరి మనుషులు నెత్తిన కడవలతో మైళ్లకు మైళ్లు నడవరో, ఎక్కడ ప్రతి ఇంటిలో అవసరమైన నీరు అందుబాటులో ఉంటుందో అదే సుభిక్షితమైన ప్రాంతం. 'ఎడతెగక పారే ఏరు' లేని ఊరిని చప్పున వదిలిపెట్టమన్నాడు సుమతీ శతకకారుడు. నీరు జీవనాధారం. నీరు నిత్యావసరం. కాని నేటికీ తాగునీళ్లు అందని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. దానికి తోడు కరువు పరిస్థితి తోడైతే... వేసవి వచ్చిపడితే?

స్త్రీలదే భారం

నీటి సమస్య ఎప్పుడూ స్త్రీల సమస్య. ఇంట్లో ఉండేది స్త్రీలు, ఇంటి పనులకు నీటిని ఉపయోగించాల్సిన వారు స్త్రీలు కనుక నీటి బెంగ స్త్రీలదే. పురుషుడు తాను 'బయట సంపాదించాలి కాబట్టి' ఇంట్లో ఉండే స్త్రీ నీటి బాధలు పడాల్సిందే అనే భావజాలం ఇంకా పోలేదు. నీటి బాధల్లో చేయూతనిచ్చే పురుషులు ఉన్నా అధికశాతం స్త్రీలే ఈ బాధలు పడతారు. ఇంట్లో నీళ్లు లేకపోతే పురుషుడి చేత తిట్లు తింటారు. నీళ్లు తేవడంలో పిల్లల సాయం అందకపోతే నడుములు విరగ్గొట్టుకునేలా నీరు మోస్తారు. ప్రస్తుతం రెండు పనులు తప్పక జరగాలి.

1. నీటి సమస్య ఇంట్లో తీర్చడానికి పురుషుడు సమాన భాగస్వామ్యం వహించేలా చైతన్యపరచడం.
2. ప్రతి ఇంట్లో నీటి పొదుపు కోసం ప్రతి కుటుంబ సభ్యుడు చైతన్యవంతం కావడం.

నీరు వృథా చేయడం అంటే?

కొందరు ఉంటారు... సింక్ దగ్గర నిలబడి ట్యాప్ తిప్పి బ్రష్ చేయడం మొదలెడతారు. ఇక బ్రషింగ్ అవుతున్నంత సేపు ట్యాప్ నుంచి నీరు వృథా కావాల్సిందే. మరికొందరు బాత్‌రూమ్ ఫ్లోర్ మీద రోజుకు రెండు ఫుల్ బకెట్లు కుమ్మరిస్తారు శుభ్రత కోసం. మరికొందరు సగం బకెటు స్నానం చేసి మిగిలిన సగాన్ని వృథాగా వదిలేస్తారు. ఆ తర్వాత వచ్చిన కుటుంబ సభ్యులు ఆ నీరు స్నానానికి వాడలేక కమోడ్‌లో పారబోస్తారు. మరికొందరు టాయిలెట్ మీద కూచుని ఏమీ తోచక స్ప్రే గన్ చేత పట్టి నీటిని ప్రెస్ చేస్తూ ఆటలాడుతూ ఉంటారు. మరికొందరు రోజుకు రెండు సార్లు షవర్ తిప్పి ఆరాముగా స్నానం చేస్తారు. మరికొందరు గిన్నెలు కడుగుతున్నంత సేపు వాష్ ఏరియాలో ట్యాప్ తిప్పే ఉంచుతారు. ఇంకొందరు కిచెన్ సింక్‌లో చిన్న గ్లాస్ కడగాలన్నా ట్యాప్ తిప్పి అర బకెట్ నీళ్లు సింక్‌లో వృథాగా పోనిస్తారు. ఇక ఉతికిన బట్టలను మూడు సార్లు జాడించేవారు ఇంకొందరు. ఒక్క నీటిబొట్టు కూడా సృష్టించలేని మనకు ఇన్ని నీళ్లు వృథా చేసే హక్కు లేదు.

పొదుపే మిగులు

నీళ్లు ఎక్కువ కావాలనుకుంటే తక్కువ ఖర్చు చేయాలి. అప్పుడు తక్కువ ఉన్నా ఎక్కువ అనిపిస్తాయి. ఇప్పుడు బెంగళూరు నగరం నీటి కరువుతో ఇబ్బందులు పడుతోంది. నీరు వృథా చేసేవారికి జరిమానాలు విధిస్తున్నారు. నీరు ఎంత జాగ్రత్తగా చూసుకోవాలో తెలుసుకుంటారు. ఈ నేపథ్యంలో అక్కడి డెర్మటాలజిస్ట్ డాక్టర్ శర్మ ఇటీవల 'ఎక్స్' (ట్విటర్)లో రాసిన పొదుపు పోస్ట్ అందరికీ నచ్చింది. 'మాకు నీళ్ల సమృద్ధి ఎప్పుడూ. కాని మేము నీటిని పొదుపుగా వాడతాము. రొటీన్‌కు ఏ భంగం కలగకుండా నీటిని పొదుపుగా వాడొచ్చు' అని పొదుపు చిట్కాలు చెప్పిందామె.

ఇవీ ఆ పొదుపు చిట్కాలు

→ బాత్‌రూమ్స్‌లో షవర్స్ బంద్ చేయాలి. బకెట్‌లో పట్టుకుని స్నానం చేయాలి. షవర్‌లో చాలా నీళ్లు వృథా అవుతాయి. పైగా ఎక్కువ సేపు నీళ్లలో నానడం కూడా చర్మానికి మంచిది కాదు. కొందరు రోజుకు రెండుసార్లు స్నానం చేస్తారు. ఒక సారి స్నానం వల్ల లోటేం జరగదు.

→ ట్యాప్‌లకు ఎరీటర్‌లు బిగించాలి. ట్యాప్‌లు తిప్పితే నీళ్లు భళ్లున వస్తాయి. వృథా అవుతాయి. అదే అన్ని ట్యాప్‌లకు ఎరీటర్లు (చిల్లుల పరికరం) బిగిస్తే నీళ్లు జల్లుగా పడతాయి. పొదుపు అవుతాయి. ముఖ్యంగా అంట్లు తోమేప్పుడు చాలా నీళ్లు పొదుపు అవుతాయి.

→ ఆర్‌ఓల నుంచి ఫిల్టర్ సమయంలో వృథాగా పోయే నీటిని పట్టి మొక్కలకు పోయాలి. మాప్ పెట్టడానికి ఉపయోగించాలి. → వాషింగ్ మిషన్‌ను ఒకటీ అరా బట్టల కోసం కాకుండా ఫుల్‌లోడ్‌తో ఉపయోగించాలి.

→ కార్ వాషింగ్‌కు నీటిని వృథా చేయకుండా తడి బట్టతో తుడుచుకోవాలి.

→ డిష్ వాషర్ ఉపయోగించడం వల్ల నీళ్ళు తక్కువ ఖర్చు అవుతాయి. అంట్లు తోమితే 60 లీటర్ల నీళ్లు కనీసం పడతాయి. డిష్ వాషర్‌లో 10 లీటర్లు సరిపోతాయి.

→ ప్లంబర్‌ని పిలిచి అన్నీ లీకులను చెక్ చేయించాలి.

→ పిల్లలకు నీటి విలువ తెలియచెప్పి నీళ్లు వృథా చేయకుండా చూడాలి.

ఇంటిప్స్



కాలానుగుణంగా ఆహారంలో మార్పులే కాదు ఇంటి అలంకరణ కూడా మార్చుకోవాల్సి ఉంటుంది. అప్పుడే కాలానికి తగ్గట్టు ఇంట్లో మరింత హాయిగా ఉండగలరు. తక్కువ బడ్జెట్‌లో ఈ వేసవిలో మనసుకు నచ్చేలా ఇంటిలోపల సృజనాత్మకంగా మార్చుకోవచ్చు.

హాయి గొలిపే అలంకరణ

- మొక్కలు, పువ్వులు ఎప్పుడూ ఇంటి వాతావరణాన్ని ఆహ్లాదంగా మారుస్తాయి. అందుకని, రోజులో ఎక్కువసార్లు చూసే ఎదురుగోడ వైపు నచ్చిన పూల మొక్కల కుండీలను లేదా ఫ్లవర్ వేజ్‌లను అలంకరిస్తే ఆ రంగులు చూపులకు, మనసుకు హాయిని కలిగిస్తాయి.
- విండోస్‌లో వరుసలుగా వస్తున్న స్టెప్ హ్యాంగర్స్ పూల కుండీల సెట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. వేసవి వేడి గాలి తగ్గుతుంది. ఇంటి వాతావరణం ఆహ్లాదంగానూ ఉంటుంది.
- గది అలంకరణలో ఒక పాతకాలపు కుర్చీ లేదా ఆర్ట్‌పీస్, నగిషీలతో ఉండే బొమ్మల కాలం నాటి అద్దం.. ఇలా ఏదో ఒకటి వెనకటి తరానికి చెందిన వస్తువును ఉపయోగించాలి. వాడకుండా పడేసిన యాంటిక్ పీస్‌ను కొద్దిగా మెరుగుపరిచి కూడా ఇలా అలంకరణలో వాడచ్చు. దీని వల్ల గది అందంలో ప్రత్యేకత కనిపిస్తుంది.
- సోఫా, బెడ్ కుషన్ కవర్లు తక్కువ ఖర్చువే అయినా మంచి బ్రైట్ కలర్ ఉన్నవి ఎంచుకోవాలి. చెక్క లేదా డల్ ఫర్నీచర్ ఉంటే లేత, కాంతిమంతమైన రంగుల కాంబినేషన్లతో కుషన్ కవర్లు ఎంచుకుంటే చాలు ఇంటి అలంకరణలో స్పష్టమైన తేడా కనిపిస్తుంది.
- గది లోపలి గోడల రంగులు తేలికపాటివి ఉంటే కుషన్ కవర్లు ముదురు రంగులు ఎంచుకోవాలి. గోడల రంగులు గాఢత గల ముదురు రంగులు ఉంటే కుషన్ కవర్ల రంగులు లేతవి కాంట్రాస్ట్‌గా ఎంచుకుంటారు. వేసవి కాలం ఇంటిలోపల లేత రంగుల అలంకరణ మనసుకు హాయిని కలిగిస్తుంది.

గెలుపు దారి

కోడర్ టు రియల్ ఎస్టేట్ క్వీన్



రియల్ ఎస్టేట్ రంగంలో మహిళల పేర్లు అరుదుగా వినిపిస్తాయి. కోడర్, స్ట్రాటజీ కన్సల్టెంట్, ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్, సీఓవోగా మంచి పేరు తెచ్చుకున్న 39 సంవత్సరాల అనన్య త్రిపాఠి రియల్ ఎస్టేట్ రంగంలోకి అడుగు పెట్టి విజయం సాధించింది. 'రియల్ ఎస్టేట్ క్వీన్'గా పేరు తెచ్చుకుంది...

ఆర్మీ ఆఫీసర్ కూతురు అయిన అనన్య త్రిపాఠి తరచుగా ఒక స్కూల్ నుంచి మరో స్కూల్‌కు మారుతూ ఉండేది. 'రకరకాల ప్రాంతాలలో చదువుకోవడం వల్ల ఎన్నో సంస్కృతుల గురించి తెలుసుకునే అవకాశం, అదృష్టం దొరికింది' అంటుంది అనన్య.

పుణెలోని ఆర్మీ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంజనీరింగ్ పూర్తిగా చేసిన అనన్య ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ కంపెనీ 'టీసీఎస్' తొలి ఉద్యోగం చేసింది.

కోడర్‌గా మంచి పేరు వచ్చినా తన దృష్టి వ్యాపారంగంపై మళ్లింది. అలా కోళికోడ్ – ఐఐఎంలో ఎంబీఏ చేసింది. క్యాంపస్ సెలెక్షన్‌లో 'మెకిన్సీ'కి ఎంపికైన ఏకైక స్టూడెంట్ అనన్య.

గ్లోబల్ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ కంపెనీ 'మెకిన్సీ'లో ఏడు సంవత్సరాల ప్రయాణం తనకు ఎన్నో పాఠాలు నేర్పింది.

మార్గదర్శకులలాంటి వ్యక్తులతో పరిచయం జరిగింది.


విశ్లేషణాత్మకంగా ఉండడంతో పాటు స్ట్రక్చర్డ్ డాటా తాలూకు సమస్యలను పరిష్కారించడానికి సంబంధించిన జ్ఞానాన్ని మెకిన్సీలో సొంతం చేసుకుంది. అయితే ఫ్యాషన్ ఇ–కామర్స్ కంపెనీ 'మింత్రా' నుంచి వచ్చిన అవకాశం అనన్య కెరీర్‌ను మార్చి వేసింది. ఇ–కామర్స్ గురించి ఎన్నో సందేహాలు ఉన్న ఆ కాలంలో 'మింత్రా' నుంచి వచ్చిన ఆఫర్‌కు వెంటనే ఓకే చెప్పడం కష్టమే. అయినప్పటికీ సందేహాలను పక్కన పెట్టి చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ హోదాలో 'మింత్రా'లో చేరింది అనన్య. మూడున్నరేళ్లలో 'మింత్రా' లాభాలను పెంచింది.

ఆ తరువాత గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ ఫర్మ్ 'కేకేఆర్ కేప్‌స్టోన్' నుంచి కొత్త కెరీర్ ఆపర్చునిటీ వెదుక్కుంటూ వచ్చింది. 'కేకేఆర్'లో మాక్స్ హెల్త్‌కేర్, వినీ కాస్మెటిక్స్‌లాంటి కంపెనీలతో కలిసి పనిచేసింది. అనన్య మెటర్నిటీ లీవ్‌లో ఉన్నప్పుడు రియల్ ఎస్టేట్ గ్రూప్ 'బ్రూక్‌ఫీల్డ్' నుండి పిలుపు వచ్చింది. మామూలుగానైతే మెటర్నిటీ బ్రేక్‌లో ఉన్నప్పుడు సెలవు కాలం పూర్తయ్యేంత వరకు చాలా కంపెనీలు వేచి చూడవు. అయితే బ్రూక్‌ఫీల్డ్ మాత్రం అనన్య ప్రతిభాసామర్థ్యాలపై నమ్మకంతో ఓపిగ్గా వేచి చూసింది.


వారి నమ్మకాన్ని అనన్య వమ్ము చేయలేదు.

'పలు పరిశ్రమలకు సంబంధించి ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్ట్‌లలో అనన్యకు అపారమైన అనుభవం ఉంది. స్ట్రాటజీ కన్సల్టెంట్, ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్‌గా ఆమె ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది' అంటాడు బ్రూక్‌ఫీల్డ్ రియల్ ఎస్టేట్ మేనేజింగ్ పార్టనర్ అంకుర్ గుప్తా.

బ్రూక్‌ఫీల్డ్ రియల్ ఎస్టేట్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్‌గా మరోసారి గెలుపు జెండా ఎగరేసిన అనన్య త్రిపాఠి నుంచి వినిపించే సక్సెస్‌మంత్రా 'కంఫర్ట్ జోన్ నుంచి బయటికి రావాలి'.



● బెడ్స్ మధ్యలో రాళ్ల భూమి



● బెడ్స్ మధ్య కలుపు ఆచ్ఛాదన



● మామిడి తోటలో వీసీ డా. నీరజా ప్రభాకర్ తదితరులు



● కలుపు ఆచ్ఛాదనపై సస్యగవ్య పిచికారీ

సాగుబడి
ఉత్తరాభాద్ర కార్తె: మార్చి 30 వరకు
రేవతి కార్తె: 31 నుంచి

మన దేశంలో 28.7% భూమి (9 కోట్ల 78 లక్షల హెక్టార్ల భూమి బంజరు భూమి ఉంది. విచ్చలవిడిగా రసాయనాల వినియోగం వల్ల పూర్తిగా నిస్సారమై సాగుయోగ్యం కాకుండా పోయిన భూమి కూడా ఇందులో కలసి ఉంది. ఇటువంటి రాళ్లు రప్పలతో కూడిన బంజరు, నిస్సారమైన భూములను సైతం కేవలం ద్రవరూప ఎరువు 'సస్యగవ్య'తో పునరుజ్జీవింపచేయ వచ్చని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన యూనివర్సిటీ ప్రయోగాత్మకంగా రుజువు చేసింది.

సస్యగవ్యతో బంజరు భూమి సాగు!

- ప్రకృతి సేద్యంపై శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన యూనివర్సిటీ వినూత్న ప్రయోగం
- జీవామృతం కూడా వాడకుండా కేవలం.. కలుపు మొక్కలతో తయారు చేసే 'సస్యగవ్య'తోనే భూసారం పెంపు!
- నాలుగేళ్లలో గణనీయంగా పెరిగిన సేంద్రియ కర్బనం, సేంద్రియ పదార్థం, టోటల్ నత్రజని
- బంజర్లు, నిస్సారమైన భూములను ఖర్చు లేకుండా సాగులోకి తెచ్చే ఫలప్రదమైన మార్గం ఇది అంటున్న వర్సిటీ

వేదకాలం నాటి కృషిపరాశర గ్రంథం నుంచి తీసుకున్న సాగు పద్ధతిలో బంజరు భూములను, నిస్సారమైన భూములను పునరుజ్జీవింపజేస్తూ తిరిగి సాగులోకి తేవడానికి ఉపయోగపడే వినూత్న ప్రకృతి సేద్య పద్ధతిని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన యూనివర్సిటీ అనుసరిస్తోంది. అనేక రకాల పండ్ల మొక్కలను ఐదేళ్లుగా ఈ పద్ధతిలో ప్రయోగాత్మకంగా సాగు చేస్తోంది. వనపర్తి జిల్లా మదనాపురంలోని ఉద్యాన బోధనా క్షేత్రంలో 11 ఎకరాల రాళ్లతో కూడిన బంజరు భూమిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. జడల శంకరస్వామి 2019 నుంచి ఈ ప్రయోగాత్మక సాగు పద్ధతిని అవలంభిస్తూ భూమిని క్రమంగా సారవంతం చేస్తున్నారు.

ఎత్తుమడులు.. అధిక సాంద్రత...

11 ఎకరాలను ఎకరం ప్లాట్లుగా చేసి నేల తీరుకు సరిపోయే పంటలను సాగు చేస్తున్నారు. ఉదాహరణకు రాళ్ల రప్పలతో కూడిన నేలలో దానిమ్మ (భగువ) రకం మొక్కల్ని అధిక సాంద్రతలో ఎకరానికి 300 నాటారు. అదేవిధంగా, 7 రకాల మామిడి, మూడు రకాల అంజూర, జామ, మునగ తదితర తోటలను వేశారు.

భూమిని దుక్కి చేసి 2.5 అడుగులు (75 సెం.మీ.) వెడల్పుతో.. సాళ్ల మధ్యలో మీటరు లోతున తవ్విన మట్టిని పోసి 2 మీటర్ల ఎత్తున బెడ్స్ చేశారు. సాళ్ల మధ్య 16 అడుగులు, మొక్కల మధ్య 10 అడుగుల దూరం పాటించారు.

ఎత్తుమడులపై మొక్కలు అధిక సాంద్ర పద్ధతిలో నాటి డ్రిప్ ద్వారా నీరు అందిస్తున్నారు. గుంతకు 5 కిలోల వర్మీ కంపోస్టు వేసి మొక్కలు నాటారు. ఇక ఆ తర్వాత ఎటువంటి రసాయనిక ఎరువులు గానీ, సేంద్రియ ఎరువులు గానీ, పిచికారీలు గానీ చేయటం లేదు.

కలుపు మొక్కలే బలం!

ఏ పొలంలో మొలిచే కలుపు మొక్కలను పీకి ఆ పొలంలోనే ఆచ్ఛాదనగా వాడటంతో పాటు.. ఆ మొక్కలను మురగబెట్టి సస్యగవ్య అనే ద్రవ రూప ఎరువును తయారు చేస్తున్నారు. దీన్ని అదే పొలంలో గడ్డీ గాదాన్ని కుళ్లించడానికి వినియోగించటం ద్వారా భూమిని సారవంతం చేసుకోవచ్చు. బంజరు భూముల్ని, సారం కోల్పోయిన భూముల్ని సాగులోకి తేవటానికి బయటి నుంచి ఎటువంటి ఉత్పాదకాలను ఖర్చుపెట్టి కొని తెచ్చి వేయాల్సిన అవసరం లేదని రైతులకు తెలియజెప్పడానికే ఈ ప్రయోగాన్ని చేపట్టామని డా. శంకర స్వామి 'సాక్షి సాగుబడి'కి వివరించారు. కలుపు మొక్కలుగా మనం భావించేవాటిలో చాలా మటుకు నిజానికి ఔషధ మొక్కలేనని అంటూ.. వాటిని పీకి పారేయటం కాకుండా అదే నేలలో కలిపేస్తే చాలు.

ఇక ఏ రసాయనిక ఎరువులు, పురుగు మందులు, కలుపుమందులు చల్లకుండా ఉంటే.. ఆ భూమిలోనే ఉండే సూక్ష్మజీవరాశి సంరక్షించబడి భూమిని క్రమంగా సారవంతం చేస్తుందని ఆయన తెలిపారు.గులక రాళ్లు సైతం భూసారాన్ని పెంపొందించడానికి దోహదపడుతాయని తమ అనుభవంలో వెల్లడైందన్నారు.

గణనీయంగా పెరిగిన సేంద్రియ కర్బనం

సస్యగవ్యతో సేద్యం చేయనారంభించిన తొలి దశలో, నాలుగేళ్ల తర్వాత పండ్ల తోటలో భూసార పరీక్షలు చేయించగా భూసారం గణనీయంగా వృద్ధి చెందింది. 11 ఎకరాల్లో సగటున సేంద్రియ కర్బనం 0.24 నుంచి 0.53కి, సేంద్రియ పదార్థం 0.1 నుంచి 1%కి పెరిగింది. వీటితో పాటు మట్టిలో టోటల్ నైట్రోజన్ 0.015 నుంచి 0.045కి పెరిగిందని డా. శంకర స్వామి తెలిపారు.

సస్యగవ్యను వరుసగా నాలుగేళ్లు వాటం వల్ల సాగుకు యోగ్యం కాని భూమిని కూడా తిరిగి సారవంతం చేయటం సాధ్యమేనన్నారు. ఒక్కో రకం పండ్ల తోట సాగులో ఉన్న తోటలో వేర్వేరు రకాల కలుపు మొక్కలు, ఔషధ మొక్కలు మొలుస్తున్న విషయం గుర్తించామన్నారు.

మట్టిలోని గులకరాళ్లు కూడా పరోక్షంగా మట్టిని సారవంతం చేయడానికి పరోక్షంగా దోహదపడుతున్నట్లు కూడా గుర్తించామని అంటూ.. సాగు భూమిలోని గులక రాళ్లు పనికిరానివేమీ కాదన్నారు.

ఇంతకీ దిగుబడి ఎంత?



స్వల్ప ఖర్చుతోనే బంజరు భూముల్ని, రసాయనిక వ్యవసాయం వల్ల నిస్సారమైన భూముల్ని తిరిగి సారవంతం చేసుకొని ఫలసాయాన్నిచ్చేలా పునరుజ్జీవింపచేయొచ్చని మా ప్రయోగం రుజువు చేసింది. సస్యగవ్యతో కూడిన ప్రకృతి సేద్యంలో 4 ఏళ్ల తర్వాత ఒక్కో దానిమ్మ (భగువ) చెట్టుకు 3.96 కిలోల పండ్లు, అంజూర (డయాన) చెట్టుకు 13.8 కిలోల పండ్లు, జామ (అలహాబాద్ సఫేది) చెట్టుకు 11.65 కిలోల దిగుబడి వచ్చింది. బయటి నుంచి ఏదీ కొని వేయకుండా సాధించిన ఫలసాయం ఇది.

– డా. జడల శంకరస్వామి (97010 64439), ఉద్యాన కళాశాల, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం



'సస్యగవ్య' తయారీ ఇలా...

పొలంలో మొలిచిన కలుపు మొక్కలను ఏడాదికి మూడు దఫాలు పీకి వాటితో సస్యగవ్యను డా. శంకర స్వామి తయారు చేయిస్తున్నారు. ఆ పొలంలోని తాజా కలుపు మొక్కలు కిలో, తాజా ఆవు పేడ కిలో, ఆవు మూత్రం లీటరు, రెండు లీటర్ల నీటి (1:1:1:2)తో కలిపి పొలంలోనే నీడన ఫైబర్ పీపాల్లో మురగబెడుతున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం కలియదిప్పుతుంటే 10–12 రోజుల్లో సస్యగవ్య ద్రవ రూప ఎరువు సిద్ధమవుతుంది.

ఆ పొలంలోనే సాళ్ల మధ్యలో ఆచ్ఛాదనగా వేసిన గడ్డీ గాదం, ఆకులు అలములు, కొమ్మలు రెమ్మలపై సస్యగవ్యను 1:1 పాళ్లలో నీరు కలిపి పిచికారీ చేస్తున్నారు. వారం తర్వాత ఆ గడ్డీ గాదాన్ని రొటోవేటర్‌తో మట్టిలో కలియదున్ని, ఆ మట్టిపై మరోసారి సస్యగవ్యను పిచికారీ చేస్తున్నారు. తద్వారా ఈ సేంద్రియ పదార్థం కుళ్లి మట్టిలో కలిసిపోయి భూమి సారవంతం అవుతోంది.

ఏడాదిలో మూడు సీజన్లలో కొత్తగా కలుపు మొలిచినప్పుడు ఆ కలుపు మొక్కలతో మాత్రమే దీన్ని తయారు చేసి వాడుతున్నారు. భూమిని సారవంతం చేయటానికి ఈ ఒక్క పని తప్ప మరే ఎరువూ వేయటం లేదు. డ్రిప్ ద్వారా అవసరం మేరకు నీరు మాత్రం క్రమం తప్పకుండా ఇస్తున్నారు. రైతులు అనుసరించడానికి ఇది చాలా అనువైన, ఖర్చులేని పద్ధతని డా. శంకరస్వామి అంటున్నారు.

గుంటూరులో చిరుధాన్య వంటకాలపై శిక్షణ

రైతునేస్తం ఫౌండేషన్ సహకారంతో కర్షక్ సేవా కేంద్రం నిర్వహణలో ఈనెల 30, 31, ఏప్రిల్ 1 తేదీలలో ఉ. 10–5 గంటల వరకు చిరుధాన్యాలతో తయారుచేసే వివిధ రకాల వంటకాలపై శిక్షణ కార్యక్రమం గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట దగ్గరలోని కొర్నెపాడులోని రైతునేస్తం ఫౌండేషన్ రైతు శిక్షణా కేంద్రంలో జరుగుతుంది. మిల్లెట్స్ రాంబాబు తదితరులు ప్రత్యక్షంగా చిరుధాన్యాలతో అనేక వంటకాల తయారీ విధానాన్ని తెలియజేస్తారు. వసతి, మిల్లెట్ భోజనం సదుపాయం ఉంది. పాల్గొనదలచినవారు 97053 83666 / 95538 25532కు ఫోన్ చేసి తప్పనిసరిగా ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై. వెంకటేశ్వరరావు తెలిపారు.

కూలీల సమస్యను అధిగమించడంతోపాటు పెట్టుబడి తగ్గించుకునే ఆలోచనతో ఓ యువరైతు వినూత్న స్ప్రేయర్‌ను రూపొందించారు. ఎడ్లబండిపై పెట్టుకొని ఉపయోగించుకునేందుకు ఈ స్ప్రేయర్ అనువైనది కావటం విశేషం. అందరి మన్ననలు అందుకుంటున్న మక్దుం అలీపై ప్రత్యేక కథనం.

ఎడ్ల బండితో పిచికారీ!

- యువ రైతు మక్దుం అలీ ఆవిష్కరణ
- 15 నిమిషాల్లోనే ఎకరాకు పురుగుల మందు పిచికారీ



● ఎడ్ల బండిపై నుంచి స్ప్రేగన్ సహాయంతో పురుగుమందు పిచికారీ చేస్తున్న దృశ్యం

నారాయణపేట జిల్లా నర్వ మండలం కల్వాల్ గ్రామానికి చెందిన మక్దుం అలీ(38)కి మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆర్థిక స్తోమత లేక ఇంటర్‌తోనే చదువు ఆపేసి వ్యవసాయంలో స్థిరపడ్డారు. సాగునీటి ఇబ్బందులున్నప్పటికీ.. రెండెకరాల్లో కంది, ఆముదాలు, పత్తితోపాటు మరో ఎకరా పొలంలో వరి సాగు చేస్తున్నారు. ఏటా పెట్టుబడి పెరగడం, రాబడి తగ్గుతుండడంతో ఖర్చు ఎలా తగ్గించుకోవాలని ఆలోచిస్తుంటారు. పురుగు మందులతోపాటు కూలీల ఖర్చు తగ్గించేందుకు ప్రయత్నించే క్రమంలో ఈ ఆవిష్కరణ వెలుగుచూసింది. ఎడ్ల బండిపై 5 హెచ్‌పీ ఇంజిన్, స్ప్రే పంపు, బ్యాటరీ, డైనమో, రెండు వైపర్ మోటర్లు, రెండు డ్రమ్ములు, రెండు స్ప్రేయింగ్ గన్లతో సుమారు రూ.45 వేల వ్యయంతో అలీ దీన్ని రూపొందించారు. ఎడ్ల బండిపై కూర్చున్న రైతు బండిని తోలుకెళ్తూ ఉంటే.. బండి వెనుక వైపు బిగించిన రెండు స్ప్రేగన్లు ఏకకాలంలో పిచికారీ చేస్తాయి. అటు 20 అడుగులు, ఇటు 20 అడుగుల (దాదాపు ఆరు సాళ్లు) వరకు పురుగుల మందును ఈ యంత్రం పిచికారీ చేస్తుంది. మనిషి అవసరం లేకుండానే రెండు స్ప్రేగన్లు, రెండు డ్రమ్ముల ద్వారా 15 నిమిషాల్లోనే ఎకరం పొలంలో మందు పిచికారీ చేస్తాయి. ఎడ్లబండిపై కూర్చునే వ్యక్తికి, ఎద్దులకు మూడు నుంచి నాలుగు మీటర్ల దూరంలో వెనుక వైపున పురుగుమందు పిచికారీ అవుతున్నందున ఇబ్బంది ఉండదు. అలీని కలెక్టర్ ప్రశంసించడమే కాకుండా 'ఇంటింటా ఇన్నోవేషన్'కు ఎంపిక చేశారు. టీహబ్ అధికారులూ ప్రశంసించారు.

స్ప్రేగన్‌తో వేగంగా మందులు పిచికారీ

రసాయనిక వ్యవసాయంలో తెగుళ్ల బెడద ఎక్కువ. పంటలపై వాటి తీవ్రత అధికంగా ఉంటుంది. ఒక్కో సందర్భంలో ఒక్క రోజులోనే పంట మొత్తానికి తెగుళ్లు వ్యాపించొచ్చు. నేను రూపొందించిన స్ప్రేగన్‌తో వేగంగా మందులు పిచికారీ చేయొచ్చు. దీంతోపాటు నిర్దేశించిన మేరకు ఖచ్చితత్వంతో ఎరువులు వేసేలా రూ.500 ఖర్చుతో పరికరాన్ని రూపొందించాను. కూలీలు అవసరం లేకుండా రైతు ఒక్కరే ఎరువులు వేసుకోవచ్చు. శాస్త్రవేత్త కావాలన్నది నా సంకల్పం. అయితే ఆర్థిక స్థోమత లేమి కారణంగా చదువు మధ్యలోనే ఆగింది. నాకున్న ఆలోచనతో స్ప్రేగన్ తయారు చేసిన. ప్రభుత్వ ప్రోత్సహించాలని కోరుతున్నా.

– మక్దుం అలీ (97038 20608), యువ రైతు, కల్వాల్, నర్వ

– పెరుమాండ్ల కిషోర్ కుమార్, సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్
ఫొటోలు: సుదర్శన్‌గౌడ్, నర్వ

స్పోర్ట్స్



ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ

మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో టాప్ సీడ్ రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. ఫ్లోరిడాలో సోమవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 4-6, 7-6 (7/4), 10-4తో బొలెలీ-వావాసోరి (ఇటలీ) జోడీని ఓడించింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-వీనస్ (న్యూజిలాండ్) జంట 6-7 (5/7), 4-6తో డోడిగ్ (క్రొయేషియా)-ఆస్టిన్ (అమెరికా) ద్వయం చేతిలో ఓడింది.

మనుష్-మానవ్‌లకు డబుల్స్ టైటిల్

లెబనాన్‌లో జరిగిన ప్రపంచ టేబుల్ టెన్నిస్ ఫీడర్ లెవెల్ రెండో టోర్నీలో భారత్‌కు చెందిన మనుష్ షా-మానవ్ ఠక్కర్ జోడీ డబుల్స్ టైటిల్ సాధించింది. బీరుట్‌లో జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో మనుష్-మానవ్ ద్వయం 11-7, 11-5, 9-11, 11-6తో భారత్‌కే చెందిన ముదిత్-ఆకాశ్ పాల్ జోడీపై గెలిచింది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సత్యన్ జ్ఞానశేఖరన్-మనిక బత్రా (భారత్) జోడీ రన్నరప్‌గా నిలిచింది.



గెలుపే లక్ష్యంగా భారత్

- నేడు అఫ్గానిస్తాన్‌తో ఫుట్‌బాల్ ప్రపంచకప్ క్వాలిఫయింగ్ మ్యాచ్
- కెప్టెన్ సునీల్ ఛెత్రికి 150వ మ్యాచ్



గువాహటి: భారత ఫుట్‌బాల్ జట్టు ఇప్పుడు సొంతగడ్డపై అఫ్గానిస్తాన్‌తో పోరుకు సిద్ధమైంది. 2026 ప్రపంచకప్ ఆసియా క్వాలిఫయిర్స్‌లో భాగంగా సౌదీ అరేబియాలో జరిగిన అఫ్గానిస్తాన్ హోం మ్యాచ్ ఒక్క గోల్ నమోదు కాకుండానే 'డ్రా'గా ముగిసింది. ఇప్పుడు సొంత ప్రేక్షకుల మధ్య మంగళవారం జరిగే పోరులో భారత్ గోల్సే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. రాత్రి 7 గంటలకు మొదలయ్యే ఈ మ్యాచ్‌ను స్పోర్ట్స్ 18 చానెల్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. మరోవైపు భారత దిగ్గజం, కెప్టెన్ సునీల్ ఛెత్రికిది 150వ అంతర్జాతీయ మ్యాచ్ కానుంది. 2005లో అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అరంగేట్రం చేసిన సునీల్ ఛెత్రి... 19 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో 93 గోల్స్ చేశాడు.

శ్రీలంక ఘనవిజయం

328 పరుగులతో ఓడిన బంగ్లాదేశ్



సిల్హెట్: బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో శ్రీలంక 328 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో లంక 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. కష్టసాధ్యమైన 511 పరుగుల లక్ష్యం ఛేదించేందుకు ఓవర్‌నైట్ స్కోరు 47/5తో నాలుగో రోజు సోమవారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బంగ్లాదేశ్ 49.2 ఓవర్లలో 182 పరుగులకు ఆలౌటైంది. క్రితం రోజు బ్యాటర్ మోమినుల్ హక్ (87 నాటౌట్; 12 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరి పోరాటంతో బంగ్లాదేశ్ ఆమాత్రం స్కోరు చేసింది. ప్రధాన బ్యాటర్లంతా చేతులెత్తేసినా... మిరాజ్ (33)తో మోమినుల్ ఏడో వికెట్‌కు 66 పరుగులు, తర్వాత షోరీఫుల్ ఇస్లామ్ (12)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 47 పరుగులు జత చేశాడు. శ్రీలంక పేసర్ కసున్ రజిత (5/56) బంగ్లాదేశ్‌ను దెబ్బ కొట్టాడు. ఇరుజట్ల మధ్య రెండో టెస్టు ఈ నెల 30 నుంచి చటోగ్రామ్‌లో జరుగుతుంది.

బెంగళూరు బల్లే బల్లే...

ఐపీఎల్ సీజన్ తొలి ఐదు మ్యాచ్‌లలో సొంతగడ్డపై ఆడిన జట్లే గెలిచాయి... ఆరో మ్యాచ్‌లో ఒకదశలో పరిస్థితి కాస్త భిన్నంగా అనిపించింది. సాధారణ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బెంగళూరు కాస్త తడబడింది. అయితే దినేశ్ కార్తీక్ దూకుడైన ఇన్నింగ్స్ చిన్నస్వామి మైదానంలో ఆర్‌సీబీకి కావాల్సిన విజయాన్ని అందించింది. బ్యాటింగ్ వైఫల్యంతో పంజాబ్ వెనుకబడగా... కోహ్లి అర్ధసెంచరీతో తన జట్టుకు చుక్కానిలా నిలిచాడు.

ఆర్‌సీబీకి తొలి విజయం

- 4 వికెట్లతో పంజాబ్ ఓటమి
- కోహ్లి అర్ధసెంచరీ



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కోహ్లి

బెంగళూరు: ఐపీఎల్ సీజన్ తొలి మ్యాచ్‌లో ఓడిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మలి పోరులో విజయాన్ని సొంతం చేసుకుంది. సోమవారం జరిగిన పోరులో ఆర్‌సీబీ 4 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. శిఖర్ ధావన్ (37 బంతుల్లో 45; 5 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం బెంగళూరు 19.2 ఓవర్లలో 6 వికెట్లకు 178 పరుగులు చేసి గెలిచింది. కోహ్లి (49 బంతుల్లో 77; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీ చేయగా... దినేశ్ కార్తీక్ (10 బంతుల్లో 28 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగాడు.

కీలక భాగస్వామ్యాలు...

తొలి 3 ఓవర్లలో 10 పరుగులు... యశ్ దయాళ్ స్పెల్ ఇది! ఈ బౌలింగ్ వల్లే పంజాబ్‌కు సరైన ఆరంభం లభించలేదు. పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 40 పరుగులు కాగా... బెయిర్‌స్టో (8) పెవిలియన్ చేరాడు. అనంతరం ధావన్, ప్రభ్‌సిమ్రన్ (17 బంతుల్లో 25; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రెండో వికెట్‌కు 38 బంతుల్లో 55 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను నడిపించారు. అయితే ప్రభ్‌సిమ్రన్‌ను అవుట్ చేసి మ్యాక్స్‌వెల్ ఈ జోడీని విడదీయగా... కొద్ది సేపటికే వరుస బంతుల్లో లివింగ్‌స్టోన్ (17), ధావన్ వెనుదిరగడం జట్టును దెబ్బ తీసింది. ఈ దశలో స్యామ్ కరన్ (17 బంతుల్లో 23; 3 ఫోర్లు), జితేశ్ శర్మ (20 బంతుల్లో 27; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కలిసి జట్టును ఆదుకున్నారు. అయితే ఆరు బంతుల వ్యవధిలో వీరిద్దరూ అవుటయ్యారు. జోసెఫ్ వేసిన చివరి ఓవర్లో శశాంక్ సింగ్ (21 నాటౌట్) దూకుడుగా ఆడి 2 సిక్స్‌లు, ఫోర్ బాదడంతో కింగ్స్ మెరుగ్గా ముగించగలిగింది.



దినేశ్ కార్తీక్

కోహ్లి జోరు...

ఛేదనలో కరన్ వేసిన తొలి ఓవర్లోనే 4 ఫోర్లతో కోహ్లి జోరుగా ఇన్నింగ్స్ మొదలు పెట్టాడు. ఈ ఓవర్ రెండో బంతికే 'సున్నా' వద్ద కోహ్లి ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో బెయిర్‌స్టో వదిలేయడం కూడా కలిసొచ్చింది. అర్ష్‌దీప్ ఓవర్లో కూడా అతను 3 ఫోర్లతో ఆధిక్యం ప్రదర్శించారు. అయితే మరో ఎండ్‌లో ఏ బ్యాటర్ కూడా ప్రభావం చూపలేకపోయారు. డుప్లెసిస్ (3), గ్రీన్ (3), మ్యాక్స్‌వెల్ (3) పూర్తిగా విఫలం కాగా... చహర్ ఓవర్లో రెండు సిక్స్‌లు కొట్టినా... రజత్ పటిదార్ (18) కూడా ఎక్కువసేపు నిలవలేదు. దాంతో భారం మొత్తం కోహ్లిపైనే పడింది. 31 బంతుల్లో అతని అర్ధ సెంచరీ పూర్తయింది. 25 బంతుల్లో 47 పరుగులు చేయాల్సిన స్థితిలో కోహ్లి అవుట్ కావడంతో కొంత ఉత్కంఠ నెలకొంది. అయితే కార్తీక్, లోమ్రోర్ (17 నాటౌట్) కలిసి నాలుగు బంతుల ముందే ఆర్‌సీబీని గెలిపించారు.

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ధావన్ (సి) కోహ్లి (బి) మ్యాక్స్‌వెల్ 45; బెయిర్‌స్టో (సి) కోహ్లి (బి) సిరాజ్ 8; ప్రభ్‌సిమ్రన్ (సి) రావత్ (బి) మ్యాక్స్‌వెల్ 25; లివింగ్‌స్టోన్ (సి) రావత్ (బి) జోసెఫ్ 17; కరన్ (సి) రావత్ (బి) దయాళ్ 23; జితేశ్ (సి) రావత్ (బి) సిరాజ్ 27; శశాంక్ (నాటౌట్) 21; బ్రార్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 176. వికెట్ల పతనం:** 1–17, 2–72, 3–98, 4–98, 5–150, 6–154. **బౌలింగ్:** సిరాజ్ 4–0–26–2, యశ్ దయాళ్ 4–0–23–1, జోసెఫ్ 4–0–43–1, గ్రీన్ 2–0–19–0, డాగర్ 3–0–34–0, మ్యాక్స్‌వెల్ 3–0–29–2.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) బ్రార్ (బి) హర్షల్ 77; డుప్లెసిస్ (సి) కరన్ (బి) రబాడ 3; గ్రీన్ (సి) జితేశ్ (బి) రబాడ 3; పటిదార్ (బి) బ్రార్ 18; మ్యాక్స్‌వెల్ (బి) బ్రార్ 3; రావత్ (ఎల్బీ) (బి) కరన్ 11; కార్తీక్ (నాటౌట్) 28; లోమ్రోర్ (నాటౌట్) 17; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (19.2 ఓవర్లలో 6 వికెట్లకు) 178. వికెట్ల పతనం:** 1–26, 2–43, 3–86, 4–103, 5–130, 6–130. **బౌలింగ్:** కరన్ 3–0–30–1, అర్ష్‌దీప్ 3.2–0–40–0, రబాడ 4–0–23–2, బ్రార్ 4–0–13–2, హర్షల్ 4–0–45–1, చహర్ 1–0–16–0.

ఐపీఎల్‌లో నేడు

చెన్నై X గుజరాత్
వేదిక: చెన్నై
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

మే 26న చెన్నైలో ఐపీఎల్ ఫైనల్

- 2012 తర్వాత మళ్లీ టైటిల్ పోరుకు ఆతిథ్యం
- అహ్మదాబాద్‌లో క్వాలిఫయర్-1, ఎలిమినేటర్ మ్యాచ్‌లు
- ఐపీఎల్ పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసిన బీసీసీఐ



ముంబై: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్ పూర్తి షెడ్యూల్‌ను బీసీసీఐ సోమవారం ప్రకటించింది. మే 26న ఐపీఎల్ ఫైనల్‌కు చెన్నై ఆతిథ్యమిస్తుందని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు. 2012 తర్వాత చెన్నైలో మళ్లీ ఐపీఎల్ టైటిల్ పోరు జరగనుండటం విశేషం. మే 19వ తేదీతో లీగ్ దశ మ్యాచ్‌లు పూర్తవుతాయి. అనంతరం మే 21న క్వాలిఫయర్-1 మ్యాచ్‌కు... మే 22న ఎలిమినేటర్ మ్యాచ్‌కు అహ్మదాబాద్ వేదిక కానుంది. మే 24న చెన్నైలో క్వాలిఫయర్-2 మ్యాచ్... మే 26న ఫైనల్ మ్యాచ్ చెన్నైలో జరుగుతాయి. సార్వత్రిక ఎన్నికల తేదీలు ఖరారు కాకముందు ఫిబ్రవరిలో బీసీసీఐ ఏప్రిల్ 7 వరకు 21 మ్యాచ్‌లతో కూడిన తొలి దశ షెడ్యూల్‌ను విడుదల చేసింది.

ఐపీఎల్ రెండో దశ షెడ్యూల్

తేదీ	ఎవరితో ఎవరు	వేదిక
ఏప్రిల్ 8	చెన్నై X కోల్‌కతా	చెన్నై
ఏప్రిల్ 9	పంజాబ్ X హైదరాబాద్	మొహాలి
ఏప్రిల్ 10	రాజస్తాన్ X గుజరాత్	జైపూర్
ఏప్రిల్ 11	ముంబై X బెంగళూరు	ముంబై
ఏప్రిల్ 12	లక్నో X ఢిల్లీ	లక్నో
ఏప్రిల్ 13	పంజాబ్ X రాజస్తాన్	మొహాలి
ఏప్రిల్ 14	కోల్‌కతా X లక్నో	కోల్‌కతా
ఏప్రిల్ 14	ముంబై X చెన్నై	ముంబై
ఏప్రిల్ 15	బెంగళూరు X హైదరాబాద్	బెంగళూరు
ఏప్రిల్ 16	గుజరాత్ X ఢిల్లీ	అహ్మదాబాద్
ఏప్రిల్ 17	కోల్‌కతా X రాజస్తాన్	కోల్‌కతా
ఏప్రిల్ 18	పంజాబ్ X ముంబై	మొహాలి
ఏప్రిల్ 19	లక్నో X చెన్నై	లక్నో
ఏప్రిల్ 20	ఢిల్లీ X హైదరాబాద్	ఢిల్లీ
ఏప్రిల్ 21	కోల్‌కతా X బెంగళూరు	కోల్‌కతా
ఏప్రిల్ 21	పంజాబ్ X గుజరాత్	మొహాలి
ఏప్రిల్ 22	రాజస్తాన్ X ముంబై	జైపూర్
ఏప్రిల్ 23	చెన్నై X లక్నో	చెన్నై
ఏప్రిల్ 24	ఢిల్లీ X గుజరాత్	ఢిల్లీ
ఏప్రిల్ 25	హైదరాబాద్ X బెంగళూరు	హైదరాబాద్
ఏప్రిల్ 26	కోల్‌కతా X పంజాబ్	కోల్‌కతా
ఏప్రిల్ 27	ఢిల్లీ X ముంబై	ఢిల్లీ
ఏప్రిల్ 27	లక్నో X రాజస్తాన్	లక్నో
ఏప్రిల్ 28	గుజరాత్ X బెంగళూరు	అహ్మదాబాద్
ఏప్రిల్ 28	చెన్నై X హైదరాబాద్	చెన్నై
ఏప్రిల్ 29	కోల్‌కతా X ఢిల్లీ	కోల్‌కతా
ఏప్రిల్ 30	లక్నో X ముంబై	లక్నో
మే 1	చెన్నై X పంజాబ్	చెన్నై
మే 2	హైదరాబాద్ X రాజస్తాన్	హైదరాబాద్
మే 3	ముంబై X కోల్‌కతా	ముంబై
మే 4	బెంగళూరు X గుజరాత్	బెంగళూరు
మే 5	పంజాబ్ X చెన్నై	ధర్మశాల
మే 5	లక్నో X కోల్‌కతా	లక్నో
మే 6	ముంబై X హైదరాబాద్	ముంబై
మే 7	ఢిల్లీ X రాజస్తాన్	ఢిల్లీ
మే 8	హైదరాబాద్ X లక్నో	హైదరాబాద్
మే 9	పంజాబ్ X బెంగళూరు	ధర్మశాల
మే 10	గుజరాత్ X చెన్నై	అహ్మదాబాద్
మే 11	కోల్‌కతా X ముంబై	కోల్‌కతా
మే 12	చెన్నై X రాజస్తాన్	చెన్నై
మే 12	బెంగళూరు X ఢిల్లీ	బెంగళూరు
మే 13	గుజరాత్ X కోల్‌కతా	అహ్మదాబాద్
మే 14	ఢిల్లీ X లక్నో	ఢిల్లీ
మే 15	రాజస్తాన్ X పంజాబ్	గువాహటి
మే 16	హైదరాబాద్ X గుజరాత్	హైదరాబాద్
మే 17	ముంబై X లక్నో	ముంబై
మే 18	బెంగళూరు X చెన్నై	బెంగళూరు
మే 19	హైదరాబాద్ X పంజాబ్	హైదరాబాద్
మే 19	రాజస్తాన్ X కోల్‌కతా	గువాహటి
మే 21	క్వాలిఫయర్-1	అహ్మదాబాద్
మే 22	ఎలిమినేటర్	అహ్మదాబాద్
మే 24	క్వాలిఫయర్-2	చెన్నై
మే 26	ఫైనల్	చెన్నై

నోట్: ఒకే మ్యాచ్ ఉన్న రోజు రాత్రి గం.7:30 నుంచి... రెండు మ్యాచ్‌లు ఉన్న రోజు తొలి మ్యాచ్ మధ్యాహ్నం గం. 3:30 నుంచి, రెండో మ్యాచ్ రాత్రి గం. 7:30 నుంచి జరుగుతాయి. మ్యాచ్‌లన్నీ స్టార్ స్పోర్ట్స్‌లో, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం అవుతాయి.

సినిమా

ఇక ప్రచారం తర్వాతే..!



కమల్ హాసన్

'విక్రమ్' (2022) మూవీ బ్లాక్ బస్టర్ తర్వాత కమల్‌హాసన్ తదుపరి చిత్రం కోసం ఆయన అభిమానులు ఎదురు చూస్తున్నారు. నిజానికి శంకర్ దర్శకత్వంలో 'ఇండియన్' (భారతీయుడు)కి సీక్వెల్‌గా కమల్ చేసిన 'ఇండియన్ 2' ఈపాటికే విడుదల కావాల్సింది. అయితే పలు కారణాల వల్ల షూటింగ్‌లో జాప్యం జరిగింది. ఈ ఏడాది ఈ చిత్రం థియేటర్‌కి వచ్చే అవకాశం ఉంది. దాదాపు పాతికేళ్ల క్రితం వచ్చిన 'ఇండియన్'కి సీక్వెల్ కావడంతో 'ఇండియన్2'పై భారీ అంచనాలు ఉన్నాయి. కాగా కమల్‌హాసన్ అంగీకరించిన మరో చిత్రంపై కూడా అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి. అదే 'థగ్ లైఫ్'. కమల్‌హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన 'నాయగన్' (నాయకుడు) తర్వాత దాదాపు 35 ఏళ్లకు ఈ కాంబినేషన్ 'థగ్ లైఫ్'తో రిపీట్ అవుతోంది. అయితే ఈ చిత్రం షూటింగ్‌కి కాస్త బ్రేక్ పడింది. ఈ విషయం గురించి ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కమల్‌హాసన్ మాట్లాడుతూ – ''ఇండియన్ 2, ఇండియన్ 3' చిత్రాల షూటింగ్ పూర్తయింది. రెండో భాగం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఆ తర్వాత మూడో భాగం పనులు కూడా ఆరంభమవుతాయి. 'కల్కి 2898ఏడీ'లో గెస్ట్ రోల్ చేశాను. ఇక 'థగ్ లైఫ్' షూటింగ్‌ని ఎన్నికల ప్రచారం తర్వాత మొదలుపెడతాం'' అని స్పష్టం చేశారు. కాగా ఇప్పటివరకూ 'థగ్ లైఫ్' షూటింగ్ కొంత భాగం జరిగింది. ఈ మార్చిలో సెర్బియాలో షెడ్యూల్ ప్లాన్ చేశారు దర్శకుడు మణిరత్నం. అయితే లోక్‌సభ ఎన్నికల కారణంగా ఆ షెడ్యూల్‌ను వాయిదా వేశారు. ఎన్నికల ప్రచారం తర్వాతే ఈ షూటింగ్‌లో కమల్‌హాసన్ పాల్గొంటారు. ఈ చిత్రంలో కమల్ మూడు పాత్రల్లో కనిపిస్తారని టాక్. ఇక 'మక్కల్ నీది మయమ్' పేరిట 2018లో కమల్‌హాసన్ పొలిటికల్ పార్టీ ఆరంభించిన సంగతి తెలిసిందే.



తమన్నా



విజయ్ వర్మ

'నువ్వు కావాలయ్యా...' అంటూ 'జైలర్'లోని ప్రత్యేక పాటలో తమన్నా చేసిన డ్యాన్స్ అందర్నీ ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఈ మధ్యకాలంలో ఎక్కువగా వార్తల్లో నిలిచిన పాటల్లో ఇదొకటి. కాగా.. బాలీవుడ్ నటుడు విజయ్ వర్మ అయితే తమన్నాతో దాదాపు ఇలానే అన్నారట. 'నీతో ఎక్కువ సమయం గడపాలని ఉంది' అని చెప్పారట విజయ్. గత ఏడాది కొత్త సంవత్సరం పార్టీలో విజయ్, తమన్నా చాలా క్లోజ్‌గా కనిపించడంతో ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే ఊహాగానాలు మొదలయ్యాయి. పైగా సినిమాల్లో కూడా చేయనంతగా విజయ్ వర్మతో 'లస్ట్ స్టోరీస్ 2' సిరీస్‌లో ముద్దు సన్నివేశాల్లో నటించారు తమన్నా. ఆ సిరీస్‌లో ఇద్దరి కెమిస్ట్రీ ప్రేమలో ఉన్నారేమోననే అభిప్రాయం పలువురికి కలగజేసింది. అయితే అప్పుడు కాదు.. అసలు డేటింగ్

మా డేటింగ్ మొదలైంది అప్పుడే! - విజయ్ వర్మ

మొదలైంది ఎప్పుడంటే అంటూ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు విజయ్ వర్మ. ఆ ఇంటర్వ్యూలో విజయ్ వర్మ మాట్లాడుతూ – ''లస్ట్ స్టోరీస్ 2' అప్పుడు మేం డేటింగ్‌లో లేము. ఆ షూటింగ్ మొత్తం పూర్తయ్యాక 'ర్యాప్‌అప్ పార్టీ' ఏర్పాటు చేయాలనుకున్నారు. కానీ అది జరగలేదు. దాంతో తమన్నా, నేను, మరో ఇద్దరు పార్టీ చేసుకున్నాం. ఆ పార్టీలోనే 'నాకు నీతో ఎక్కువ సమయం గడపాలని ఉంది' అంటూ నా ఫీలింగ్‌ని తమన్నాతో చెప్పాను. ఆ తర్వాత మా ఫస్ట్ డేట్ సెట్ కావడానికి 20, 25 రోజులు పట్టింది'' అని పేర్కొన్నారు. సో.. ప్రపోజ్ చేసిన 25 రోజులకు విజయ్, తమన్నాల డేటింగ్ మొదలైందన్న మాట. ఇక ఈ ఇద్దరూ పలు సందర్భాల్లో ఒకరంటే మరొకరికి బాగా ఇష్టమన్నట్లు పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే పెళ్లి గురించి మాత్రం క్లారిటీ ఇవ్వడంలేదు.

హిట్ కాంబినేషన్ రిపీట్

హిట్ మూవీ 'రంగస్థలం' (2018) తర్వాత హీరో రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. సోమవారం ఈ సినిమా గురించిన అధికారిక ప్రకటన వెల్లడైంది. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. రామ్‌చరణ్ కెరీర్‌లోని ఈ 17వ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా చిత్రీకరణను మొదలుపెట్టి, వచ్చే ఏడాది చివర్లో రిలీజ్ చేయాలన్నది చిత్రబృందం ప్లాన్ అని సమాచారం.



రామ్‌చరణ్, సుకుమార్

గ్యాంగ్స్ మోత



విశ్వక్ సేన్, ఆయేషా ఖాన్

విశ్వక్ సేన్, నేహా శెట్టి హీరో హీరోయిన్లుగా, అంజలి ఓ కీలక పాత్రలో నటించిన యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. కృష్ణచైతన్య దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం మే 17న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి 'మోత' అనే మాస్ సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సినిమాలో విశ్వక్ సేన్, ఆయేషా ఖాన్ కాంబినేషన్‌లో ఈ పాట వస్తుంది. యువన్ శంకర్‌రాజా స్వరకల్పనలో చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను ఎమ్ఎమ్ మానసి పాడారు.

మనసు మురిసెను ఇలా...



మృణాల్ ఠాకూర్, విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 5న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమాలోని 'మధురము కదా..' పాట లిరికల్ వీడియోను విడుదల చేశారు. 'మధురము కదా.. ప్రతి ఒక నడక నీతో కలిసి ఇలా... తరగని కథ మనది కనుక మనసు మురిసెను ఇలా...' అంటూ సాగుతుంది ఈ పాట. గోపీ సుందర్ స్వరకల్పనలో శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటను శ్రేయా ఘోషల్ పాడారు. ఈ పాట ఆవిష్కరణ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ – ''ఫ్యామిలీ గురించి ఆలోచించేవారి కథే ఈ చిత్రం'' అన్నారు. ''హైదరాబాద్‌లో హోలీ వేడుక జరుపుకోవడం సంతోషంగా ఉంది. మీ ఫ్యామిలీస్‌లోని 'ఫ్యామిలీ స్టార్స్' అందరికీ హోలీ శుభాకాంక్షలు'' అన్నారు మృణాల్‌ఠాకూర్. ''మధ్య తరగతి కుటుంబాల్లో జరిగే కథే ఈ చిత్రం'' అన్నారు 'దిల్' రాజు.

ధూం ధాం ప్రేమ

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా నటిస్తున్న చిత్రం 'ధూం ధాం'. సాయికుమార్, 'వెన్నెల' కిశోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇతర ప్రధాన పాత్రల్లో కనిపిస్తారు. సాయి కిశోర్ మచ్చా దర్శకత్వంలో ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ తది దశకు చేరుకుంది. ఈ వేసవిలోనే విడుదల చేయాలనుకుంటున్నారు. ''లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ సినిమాకు గోపీ సుందర్ స్వరకర్త.



చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్

సీక్రెట్‌గా వివాహం చేసుకున్నారా?



తాప్సీ



మథియాస్ బో

హీరోయిన్ తాప్సీ సీక్రెట్‌గా వివాహం చేసుకున్నారా? అంటే అవుననే అంటున్నాయి బాలీవుడ్ వర్గాలు. డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బోతో తాప్సీ రిలేషన్‌షిప్‌లో ఉన్నారని కొన్నాళ్లుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. మథియాస్, తాప్సీ వివాహం చేసుకున్నట్లుగా గతంలో కూడా వార్తలు వచ్చాయి. కానీ ఆ వార్తలను తాప్సీ ఖండించారు. అయితే తాజాగా మథియాస్, తాప్సీల వివాహం తెరపైకి వచ్చింది. అత్యంత సన్నిహితులు, బంధువుల సమక్షంలో మథియాస్, తాప్సీ వివాహబంధంతో ఒక్కటయ్యారని బాలీవుడ్ సమాచారం. వీరి పెళ్లి వేడుకలు ఈ నెల 20నే మొదలయ్యాయని, 23న వివాహం జరిగిందని టాక్. తాప్సీ మెయిన్ లీడ్‌గా నటించిన సినిమాలతో అసోసియేట్ అయిన కనికా ఢిల్లాన్‌తో పాటు కొందరు బాలీవుడ్ నటీనటులు తాము ఓ పెళ్లి వేడుకలో పాల్గొంటున్నామన్నట్లుగా సోషల్ మీడియాలో హింట్ ఇచ్చారు. దీంతో వీరు హాజరైంది తాప్సీ వివాహానికే అనే ప్రచారం జరుగుతోంది. మరి.. తాప్సీ, మథియాస్ పెళ్లి జరిగిందా అనే విషయంపై ఆ ఇద్దరే క్లారిటీ ఇవ్వాలి.

సీక్వెల్ ప్లాన్ రెడీ

అమెరికన్ గాడ్జిల్లా ఫ్రాంచైజీ నుంచి ప్రేక్షకుల ముందుకు వస్తున్న తాజా చిత్రం 'గాడ్జిల్లా X కాంగ్: ది న్యూ ఎంపైర్'. లెజెండరీ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రాన్ని వార్నర్ బ్రదర్స్ ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 29న విడుదల చేయనుంది. ఈ సినిమాకు సీక్వెల్ చేసే ఆలోచన ఉందంటున్నారు ఈ చిత్రదర్శకుడు ఆడమ్ విన్‌గార్డ్. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వసూళ్లపైనే సీక్వెల్ ఆధారపడి ఉంటుందని, చెప్పాల్సిన కథ అయితే చాలా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమాలో రెబెక్కా హాల్, బ్రియాన్ హెన్రీ, కైలీ హోట్లీ, అలెక్స్ ఫెర్న్స్ లీడ్ రోల్స్‌లో నటించారు.



గాడ్జిల్లా X కాంగ్: ది న్యూ ఎంపైర్' పోస్టర్

వినోదం... భావోద్వేగం

ప్రియదర్శి, రూపా కొడువాయూర్ జంటగా దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి ఓ సినిమా తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించనున్న ఈ సినిమా సోమవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి మోహనకృష్ణ ఇంద్రగంటి సతీమణి ఉమా మహేశ్వరి కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ సతీమణి అనిత క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ– ''వినోదం, భావోద్వేగాలకు సినిమాలో అధిక ప్రాధాన్యం ఉంటుంది'' అని చెప్పారు. ఈ సినిమాకు సంగీతం: వివేక్ సాగర్.



రూప, ప్రియదర్శి

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)

సెన్సెక్స్ ▲	191	72,832
నిఫ్టీ ▲	83	22,097

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11:30 గంటలకు)

నాస్‌డాక్	16,422	▽	7
డోజోన్స్	39,339	▽	137
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,918	▽	13
డాక్స్	18,261	▲	55
షాంఘై	3,026	▽	23
నికాయ్	40,414	▲	474

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.88	83.90
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.10	106.66
€	యూరో	ఎస్‌బీఐ	89.19	91.57
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.43	55.65
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.52	55.42
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.46	64.27
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.31	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.79	23.64
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.41	12.51

అమ్మకాల్లో ఆన్‌లైన్‌దే హవా..

కోల్‌కతా: కొద్దిరోజులపాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను నిలువరించిన కోవిడ్‌-19 శకం ముగిసినప్పటికీ ఆన్‌లైన్ సర్వీసులకు డిమాండ్ కొనసాగుతోంది. కరోనా మహమ్మారి కారణంగా జనజీవనం నిలిచిపోవడంతో ఊపందుకున్న ఆన్‌లైన్ ట్రెండ్ తదుపరి దశలో మరింత ఊపందుకుంది. ప్రజలు తమ అవసరాల కోసం ఆఫ్‌లైన్ స్టోర్లకంటే ఆన్‌లైన్ కొనుగోళ్లకే మొగ్గుచూపుతున్నారు. ఇందుకు స్మార్ట్‌ఫోన్లు, పర్సనల్ కంప్యూటర్లను వినియోగిస్తున్నారు. దీంతో ఆన్‌లైన్ అమ్మకాలు ఆఫ్‌లైన్ స్టోర్లను మించి నమోదవుతున్నట్లు మార్కెట్ రీసెర్చ్ సంస్థల తాజా నివేదిక పేర్కొంది. నీల్సన్‌ఐక్యూ, జీఎఫ్‌కే ఇండియా సంయుక్తంగా రూపొందించిన ఈ నివేదిక వివరాలు చూద్దాం..

కోవిడ్‌-19 ముగిసినప్పటికీ ఇదే ట్రెండ్

డోర్ డెలివరీ ఎఫెక్ట్

కరోనా తదుపరి లాక్‌డౌన్‌లు ఎత్తివేయడంతోపాటు.. అన్ని రకాల ఆంక్షలనూ ప్రభుత్వం తొలగించింది. అయినప్పటికీ వినియోగదారులు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇందుకు ఇటీవల జనంలోకి చొచ్చుకుపోయిన సోషల్ మీడియాపై అధికంగా ఆధారపడుతున్నారు. దీంతో ఫిజికల్‌గా స్టోర్ల సందర్శనకంటే ఈకామర్స్‌వైపే మొగ్గుచూపుతున్నారు. ఈ నేపథ్యంలో మహమ్మారి కాలంలో జోరందుకున్న డోర్ డెలివరీ వ్యవస్థ రానురాను బహుముఖాలుగా విస్తరించింది. ఫలితంగా నిత్యావసరాలు మొదలు విచక్షణ ప్రకారం కొనుగోళ్లు చేపట్టే వస్తువుల విషయంలోనూ ఆన్‌లైన్‌కే ఓటు వేస్తున్నారు.



భారీ వృద్ధి బాటలో

లాక్‌డౌన్ రోజుల్లో కూరగాయలు, ఫాస్ట్‌ఫుడ్ తదితర నిత్యావసరాల కోసం కాంటాక్ట్‌లెస్ డోర్ డెలివరీలకు అలవాటుపడిన ప్రజలు తదుపరి కాలంలో టీవీసెట్ల దగ్గర్నుంచి ఫ్రిజ్‌లు, ఏసీలు, వాషింగ్ మెషీన్లు తదితర వినిమయ వస్తువులను సైతం ఈ కామర్స్ సైట్ల ద్వారా కొనుగోలు చేసేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఈ ట్రెండ్ లాక్‌డౌన్ రోజులకుమించి కనిపిస్తోంది. ప్రధానంగా మెట్రో నగర ప్రాంతాలలో ఈకామర్స్ ద్వారా కొనుగోళ్లు భారీగా ఎగశాయి. ఇంటినుంచే కొనుగోలు చేయగలగడం, డోర్‌డెలివరీ సౌకర్యం, విభిన్న ప్రొడక్టుల అందుబాటు తదితర సానుకూలతలు కీలకపాత్రను పోషిస్తున్నాయి. ఫ్రాస్ట్‌ఫ్రీ ఫ్రిజ్‌లు, 55 అంగుళాలకుమించిన టీవీలు వంటి ప్రీమియం ఉత్పత్తుల అమ్మకాలు 2023లో రెట్టింపయ్యాయి. కాగా, గతేడాదిలో ఎఫ్‌ఎంసీజీ విభాగ అమ్మకాలు అంతక్రితం ఏడాది(2022)తో పోలిస్తే ఊపందుకున్నాయి.

ఫుడ్ డెలివరీలోకి టాటా న్యూ

ముంబై: టాటా గ్రూప్ రూపొందించిన మల్టీపర్పస్ సూపర్ యాప్ టాటా న్యూ వచ్చే ఏడాది రెండో వసంతంలోకి అడుగుపెట్టనుంది. ఈ నేపథ్యంలో డిజైన్‌ను సరికొత్తగా మార్చే యోచనలో ఉంది. అంతేకాకుండా ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీలోకి ప్రవేశించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఇందుకు ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్(ఓఎన్‌డీసీ)ను వినియోగించుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ వివరాల ప్రకారం సాంకేతిక అంశాల కారణంగా యూజర్ ఇంటర్‌ఫేస్ (యూఐ)ను బ్లాక్ నుంచి వైట్ బ్యాక్‌గ్రౌండ్‌లోకి మార్చనుంది. 2022 ఏప్రిల్ 7న టాటా గ్రూప్ సూపర్ యాప్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. తొలుత క్లోజ్‌డ్ యూజర్ గ్రూప్‌తో టాటా న్యూ యాప్ ప్రారంభంకాగా.. రెండు నగరాల(బెంగళూరు, ఢిల్లీ)కే పరిమితమైంది. ప్రస్తుతం ఓఎన్‌డీసీతోపాటు మ్యాజిక్‌పిన్ సహకారం ద్వారా ఫుడ్ డెలివరీ సర్వీసులను ప్రవేశపెట్టనుంది. గతేడాది ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ కారణంగా మ్యాజిక్‌పిన్ ఫుడ్ ఆర్డర్లు రెట్టింపయ్యాయి. కాగా.. గత నెలలో కొత్త సీఈవోగా సీఈవో నవీన్ తహిల్యానికి బాధ్యతలు అప్పగించడంతోపాటు పలు మార్పులకు టాటా న్యూ తెరతీసింది. వివిధ బిజినెస్ చీఫ్‌లతో నవీన్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. కంపెనీలో పరిస్థితులపై ఉద్యోగులతో సర్వే చేపట్టారు.



ఆఫీసు స్పేస్ డిమాండ్ కొనసాగొచ్చు: కొలియర్స్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ కొనసాగొచ్చని రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ కంపెనీ కొలియర్స్ ఇండియా తెలిపింది. 2024 జనవరి – మార్చిలో బెంగళూరు, ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్, పుణే నగరాల్లో ఆఫీస్ స్పేస్ డిమాండ్ వార్షిక ప్రాతిపదికన 35% వృద్ధి చెందవచ్చని తాజాగా అంచనా వేసింది. ఈ ఆరు ప్రధాన నగరాల్లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ 1.36 కోట్ల చదరపు అడుగుల స్థాయిలో ఉండవచ్చని అంటోంది. గత ఏడాదిలో ఇదే కాలానికి ఈ నగరాల్లో మొత్తం 1.01 కోట్ల చదరపు అడుగుల కార్యాలయ స్థలాల లీజు ఒప్పందాలు కుదిరాయని వెల్లడించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-3-2024	
విశాఖ	415-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400-00
విజయవాడ	400-00
రిటైల్ ధర (డజను)	72.00
25-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	395-00
వరంగల్	397-00
రిటైల్ ధర	4.25

ఈ-గేమింగ్ కట్టడిపై కేంద్రం కసరత్తు

స్వతంత్ర నియంత్రణ వ్యవస్థ ఏర్పాటుకు యోచన

న్యూఢిల్లీ: దేశీయంగా ఆన్‌లైన్ గేమింగ్ రంగాన్ని కట్టడి చేసేందుకు స్వతంత్ర నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయడంపై కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార మంత్రిత్వ శాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా నేషనల్ లా యూనివర్సిటీ, ఈ-గేమింగ్ ఫెడరేషన్ కలిసి పరిశ్రమవర్గాలతో సంప్రదింపులు జరుపుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వానికి నిర్దిష్ట ప్రతిపాదనలను సమర్పించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. పరిశ్రమ మెరుగైన నిర్వహణ కోసం నియంత్రణ ఉండక తప్పదని ఎన్‌ఎల్‌యూ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాఘవ్ పాండే తెలిపారు. అయితే, ఇటు పరిశ్రమ వృద్ధికి దోహదపడటం, అటు నియంత్రించడం మధ్య సమతౌల్యం కూడా ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమ, ఇతర నియంత్రణ సంస్థలతో సంప్రదింపులతో పాటు నియంత్రించాల్సిన అంశాలపై సమగ్ర అధ్యయనంతోనే తగిన విధానాలను రూపొందించడానికి వీలవుతుందని చెప్పారు. ఆన్‌లైన్ గేమింగ్‌కి సంబంధించి గేమింగ్ సంస్థలే స్వీయ నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలంటూ గతంలో చేసిన ప్రతిపాదనను కేంద్రం పక్కన పెట్టిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. దేశీయంగా డ్రీమ్11, మొబైల్ ప్రీమియర్ లీగ్, డెల్టాటెక్ గేమింగ్, నజారా, గేమ్స్24 గీ7 వంటి పలు సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి.



3 బిలియన్ డాలర్ల మార్కెట్..

ప్రస్తుతం భారత గేమింగ్ మార్కెట్ దాదాపు 3 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంది. ఇందులో 80 శాతం వాటా రియల్ మనీ ప్లాట్‌ఫాంలదే ఉంటోంది. అమెరికా, బ్రెజిల్‌ను కూడా దాటేసి భారత్ ప్రపంచంలోనే అతి పెద్ద గేమింగ్ మార్కెట్‌గా మారినట్లు గేమింగ్ కంపెనీ విన్‌జో ఇటీవల ఒక నివేదికలో పేర్కొంది. భారత్‌లో 56.8 కోట్ల మంది గేమర్స్ ఉండగా, 2023లో 950 కోట్ల పైచిలుకు గేమింగ్ యాప్ డౌన్‌లోడ్స్ నమోదైనట్లు వివరించింది. ఇంతటి భారీ స్థాయిలో విస్తరించిన ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమ.. మనీలాండరింగ్ స్కాములు, భారీ పన్నుల భారం మొదలైన సమస్యలతో సతమతమవుతోంది. తమ పరిశ్రమకు నియంత్రణ సంస్థను ఏర్పాటు చేస్తే సక్రమంగా నడుస్తున్న వాటికి ఇలాంటి సమస్యలు తగ్గగలవని గేమింగ్ కంపెనీలు భావిస్తున్నాయి. దీంతో కంపెనీలు కలిసి స్వీయ నియంత్రణ సంస్థలను (ఎస్‌ఆర్‌బీలు) ఏర్పాటు చేసుకోవచ్చంటూ కేంద్రం ప్రతిపాదించింది. అయితే, బడా సంస్థలు సదరు ఎస్‌ఆర్‌బీలను ప్రభావితం చేయడానికి, అవి నిజంగానే స్వతంత్రంగా పని చేయడానికి అవకాశాలు తక్కువగా ఉండొచ్చని భావించి స్వతంత్ర నియంత్రణ సంస్థ ఏర్పాటుపై దృష్టి సారించింది.

గుండె సంరక్షణకు లీ హెల్త్ ఔషధం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: న్యూట్రాసూటికల్స్ తయారీ సంస్థ లీ హెల్త్ డొమెయిన్ గుండె సంరక్షణకై సహజ సిద్ధ మూలికలతో లైఫోస్టెరాల్ సాఫ్ట్ జెల్ క్యాప్సూల్స్‌ను తయారు చేసింది. వెల్లుల్లి సారం, గామా ఒరిజనోల్, ఫైటోస్టెరాల్, లైకోపీన్, పసుపులో ఉండే కుర్కుమిన్, మెంతికూర, నల్ల మిరియాల నుంచి తీసిన పైపెరిన్‌తో వీటిని రూపొందించామని లీ హెల్త్ డొమెయిన్ డైరెక్టర్ ఆళ్ల లీలా రాణి తెలిపారు. 'అత్యంత శక్తివంతమైన ఈ సమ్మేళనాలు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్‌ను సమతుల్యం చేస్తాయి. క్రమరహిత హృదయ స్పందనలను స్థిరీకరిస్తాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సాయపడతాయి' అని చెప్పారు. అమెజాన్, లీ హెల్త్ డొమెయిన్, ఫార్మసీలలో లైఫోస్టెరాల్ లభిస్తుంది.



అమెరికాలో తొలిసారిగా అమూల్ పాలు

న్యూఢిల్లీ: అమూల్ పాలు తొలిసారిగా విదేశీ మార్కెట్లలో లభించనున్నాయి. వారం రోజుల్లో అమెరికాలో అమూల్ పాలను ప్రవేశపెట్టనున్నట్లు గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ (జీసీఎంఎంఎఫ్) ఎండీ జయేన్ మెహతా తెలిపారు. 'మేము దశాబ్దాలుగా డెయిరీ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నాం. కానీ తాజా పాలను భారత్ వెలుపల ప్రవేశపెట్టడం మాత్రం ఇదే ప్రథమం. అమూల్ తాజా, గోల్డ్, శక్తి, స్లిమ్ ఎన్ ట్రిమ్ ఉత్పత్తులను వారం రోజుల్లో ప్రవేశపెడతాం' అని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం 108 ఏళ్ల చరిత్ర గల పాల సహకార సంఘం మిషిగాన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (ఎంఎంపీఏ)తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు వివరించారు. పాల సేకరణ, ప్రాసెసింగ్ ఎంఎంపీఏ చేపడుతుందని, అమూల్ బ్రాండ్ పేరిట మార్కెటింగ్ తమ సంస్థ చేపడుతుందని మెహతా చెప్పారు. ముందుగా న్యూయార్క్, న్యూజెర్సీ, షికాగో, వాషింగ్టన్, డల్లాస్, టెక్సాస్ తదితర ప్రాంతాల్లో అమూల్ పాలు లభిస్తాయి. వచ్చే 3-4 నెలల్లో బ్రాండింగ్, మార్కెటింగ్‌పై ప్రధానంగా దృష్టి పెట్టనున్నట్లు మెహతా చెప్పారు. రాబోయే రోజుల్లో పనీర్, పెరుగు, మజ్జిగ వంటి ఉత్పత్తులను కూడా ప్రవేశపెడతామని తెలిపారు. జీసీఎంఎంఎఫ్ ఇప్పటికే 50 దేశాలకు పాల ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది.



భవిత

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్ కోసం — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇస్రో-ఎన్‌ఆర్‌ఎస్‌సీ, హైదరాబాద్‌లో ఉద్యోగాలు

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో).. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్‌ఆర్‌ఎస్‌సీ)లో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 71
» **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ సైంటిస్ట్-20, ప్రాజెక్ట్ సైంటిస్ట్1-06, ప్రాజెక్ట్ సైంటిస్ట్ బి-04, ప్రాజెక్ట్ అసోసియేట్1-02, ప్రాజెక్ట్ అసోసియేట్2-12, జేఆర్‌ఎఫ్-27.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి.
» **పనిచేయాల్సిన ప్రదేశాలు:** షాద్‌నగర్, రంగారెడ్డి జిల్లా, జీడిమెట్ల, బాలానగర్, హైదరాబాద్, రీజనల్ రిమోట్ సెన్సింగ్ కేంద్రాలు-నాగ్‌పూర్, న్యూఢిల్లీ, కోల్‌కతా, జోధ్‌పూర్, బెంగళూరు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.04.2024
» **వెబ్‌సైట్:** https://www.nrsc.gov.in

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్‌లోని 352 కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో(కేజీబీవీ) 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరు, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఇంటర్మీడియట్‌లో అర్హులైన బాలికల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** అనాథలు, బడి బయట ఉన్న పిల్లలు, బడి మధ్యలో మానేసిన వారు (డ్రాపౌట్స్), పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దారిద్ర్యరేఖకు(బీపీఎల్) దిగువన ఉన్న బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,20,000, పట్టణ ప్రాంతాల్లో రూ.1,40,000 మించకూడదు.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తారు.ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మేసేజ్ ద్వారా సమాచారం అందిస్తారు. అడ్మిషన్లు పొందిన వారి వివరాలను ఆయా పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో ప్రదర్శిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.04.2024
» **వెబ్‌సైట్:** https://apkgbv.apcfss.in

ఏయూఈఈటీ-2024

విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి సెల్ఫ్ సపోర్ట్ విధానంలో వివిధ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఏయూ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్(ఏయూఈఈటీ-2024) నిర్వహించనుంది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** బీటెక్‌లో ప్రవేశం కోసం కనీసం 45 శాతం మార్కులతో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో 10+2 ఉత్తీర్ణులవ్వాలి(రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు 40శాతం ఉండాలి).
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **పరీక్ష కేంద్రాలు:** విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కడప.
» **ఆలస్య రుసుం లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.04.2024.
» **హాల్ టికెట్ డౌన్‌లోడ్ ప్రారంభం:** 03.05.2024
» **ప్రవేశ పరీక్ష తేది:** 05.05.2024.
» **వెబ్‌సైట్:** https://audoa.andhrauniversity.edu.in

టీఎస్ ఎల్‌పీసెట్-2024

హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్య-శిక్షణ మండలి.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి లేటరల్ ఎంట్రీ ఇన్ టూ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎల్‌పీసెట్)-2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రాష్ట్రంలోని పాలిటెక్నిక్/ఇన్‌స్టిట్యూషన్స్(ప్రభుత్వ/ఎయిడెడ్/అన్ ఎయిడెడ్/ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు)ల్లో రెండో సంవత్సరం డిప్లొమా కోర్సుల్లో ప్రవేశపరీక్ష ద్వారా అడ్మిషన్స్ కల్పిస్తారు.

» **డిప్లొమా విభాగాలు:** సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, ప్యాకేజింగ్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ టెక్నాలజీ.
» **అర్హత:** కనీసం 60శాతం మార్కులతో రెండేళ్ల ఐటీఐ కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్(డీఈటీ) నిర్వహించే బ్రిడ్జ్ కోర్సు పూర్తి చేసి ఉండాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.04.2024.
» **ప్రవేశపరీక్షతేది:** 20.05.2024.
» **వెబ్‌సైట్:** www.sbtet.telangana.gov.in

సీటెట్‌కు సన్నద్ధమవ్వండిలా!

సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్.. సీటెట్‌గా సుపరిచితం! ఉపాధ్యాయ అర్హత పరీక్షగానూ గుర్తింపు! బీఈడీ,డీఈడీ ఉత్తీర్ణులు ఇందులో అర్హత సాధిస్తే.. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పాఠశాలలు, సీబీఎస్‌ఈ అనుబంధ స్కూల్స్, ఎన్‌సీటీఈ గుర్తింపు ఉన్న పాఠశాలల్లో.. ఉపాధ్యాయ ఉద్యోగాలకు పోటీ పడే అవకాశం లభిస్తుంది! సీటెట్ నిర్వాహక సంస్థ సీబీఎస్‌ఈ.. తాజాగా సీటెట్-జూలై-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. పరీక్ష తేదీని సైతం ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో.. సీటెట్-జూలై-2024 వివరాలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్‌పై ప్రత్యేక కథనం..

» సీటెట్ జూలై-2024 నోటిఫికేషన్ విడుదల
» జాతీయ స్థాయిలో జూలై 7న సీటెట్ నిర్వహణ
» పేపర్-1, పేపర్-2లుగా సీటెట్
» సీటెట్ స్కోర్‌కు శాశ్వత గుర్తింపు

ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం-ఉపాధ్యాయ వృత్తిలో చేరాలనుకునే వారికి బీఈడీ, డీఈడీ, బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్)తోపాటు సీటెట్‌లోనూ అర్హత ఉండాలి. సీబీఎస్‌ఈ అనుబంధ పాఠశాలలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, ఆర్మీ పబ్లిక్ స్కూల్స్ వంటి వాటిలో అడుగు పెట్టాలంటే సీటెట్ ఉత్తీర్ణత తప్పనిసరిగా మారింది. సీబీఎస్‌ఈ సీటెట్ పరీక్షను పేపర్-1, పేపర్-2లుగా నిర్వహిస్తుంది.

అర్హతలు

- ఆయా పేపర్‌ను అనుసరించి డీఈడీ, బీఈడీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి.
- **పేపర్-1:** పాఠశాలల్లో ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధించాలనుకునే వారు పేపర్-1కు హాజరు కావాలి.
- **పేపర్-2:** ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు టీచింగ్ కోసం పేపర్-2లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.
- రెండు స్థాయిల్లోనూ బోధించాలనుకునే వారు రెండు పేపర్లకు హాజరై ఉత్తీర్ణత సాధించాలి.

150 మార్కులకు పేపర్-1 పరీక్ష

పేపర్-1 పరీక్ష అయిదు విభాగాల్లో ఉంటుంది. అవి..చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి (30 ప్రశ్నలు-30 మార్కులు), మ్యాథమెటిక్స్ (30 ప్రశ్నలు-30 మార్కులు),ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ (30 ప్రశ్నలు-30 మార్కులు),లాంగ్వేజ్-1 (30 ప్రశ్నలు-30 మార్కులు),లాంగ్వేజ్-2(30 ప్రశ్నలు-30 మార్కులు). మొత్తం 5 విభాగాల్లో 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. పరీక్ష సమయం రెండున్నర గంటలు. లాంగ్వేజ్-1, లాంగ్వేజ్-2 విభాగాలకు సంబంధించి అభ్యర్థులకు 20 లాంగ్వేజ్‌లు అందుబాటులో ఉన్నాయి. వాటిలో తమకు ఆసక్తి ఉన్న లాంగ్వేజ్‌లు రెండింటిని ఎంచుకోవాల్సి ఉంటుంది.



పేపర్-2 ఇలా

రెండున్నర గంటల వ్యవధిలో 150 మార్కులకు పేపర్ 2 నిర్వహిస్తారు. మొత్తం అయిదు విభాగాల్లో పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష ఉంటుంది. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు-30 మార్కులకు, మ్యాథమెటిక్స్, సైన్స్ 60 ప్రశ్నలు-60 మార్కులకు (లేదా) సోషల్ స్టడీస్/సోషల్ సైన్స్ 60 ప్రశ్నలు-60 మార్కులకు, లాంగ్వేజ్-1, 30 ప్రశ్నలు-30 మార్కులకు, లాంగ్వేజ్-2, 30 ప్రశ్నలు-30 మార్కులకు పరీక్ష ఉంటుంది.

60 శాతం మార్కులు తప్పనిసరి

సీటెట్ పేపర్-1, పేపర్-2లలో తప్పనిసరిగా కనీస అర్హత మార్కులు పొందాలనే నిబంధన విధించారు. అభ్యర్థులు కనీసం అరవై శాతం మార్కులతో (90 మార్కులు) ఉత్తీర్ణత సాధించాలి.

శాశ్వత గుర్తింపు

సీటెట్‌లో ఉత్తీర్ణత పొందితే ఆ స్కోర్‌కు జీవితకాల గుర్తింపు కల్పించే విధానం అమలవుతోంది. దీంతో ఒకసారి ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే.. ఎప్పుడైనా టీచింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఏప్రిల్ 2
- **సీటెట్ తేదీ:** 2024, జూలై 7 (పేపర్-2: 9:30-12; పేపర్-1: 2 - 4:30 వరకు)
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** గుంటూరు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్
- **వివరాలకు వెబ్‌సైట్:** https://ctet.nic.in

బెస్ట్ స్కోర్ సాధించేలా

చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి

బోధన, అభ్యసనంకు సంబంధించి ఎడ్యుకేషనల్ సైకాలజీ మీద ప్రాథమిక స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు ప్రధానంగా శిశువు సైకాలజీ సంబంధించిన అంశాలపై ఎక్కువ దృష్టిసారించాలి. వికాస దశలు, వికాస అంశాలైన శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలు మొదలైన అంశాలను క్షుణ్నంగా చదవాలి. శిశువు ప్రవర్తనలో మార్పునకు సంబంధించిన అభ్యాసం, అభ్యసన బదలాయింపు అంశాలను చదవాలి. సైకాలజీ అంశాలను చదివేటప్పుడు కీలక భావనలు, సాంకేతిక పదాలు, సిద్ధాంతాలు-సూత్రాలు, ప్రతిపాదించిన శాస్త్రవేత్తలు, వారి గ్రంథాలు తదితర విషయాలను విశ్లేషణాత్మకంగా చదవాలి. ఇక పెడగాజి అంటే బోధన శాస్త్రం. ఇందులో సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం- నాయకత్వం- గైడెన్స్-కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి. ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పొందాలి. పెడగాజీలోని భావనలు, సిద్ధాంతాలు, నిబంధనలను విశ్లేషిస్తూ అధ్యయనం చేస్తేనే ఏ కోణంలో ప్రశ్న అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది.

లాంగ్వేజ్ పేపర్లకు ఇలా

అభ్యర్థులు తాము బోధించాలనుకునే భాషలో నిర్వహించే లాంగ్వేజ్-1 విభాగంలో రాణించేందుకు.. అదే విధంగా మరో ఇతర లాంగ్వేజ్ నైపుణ్యాన్ని పరీక్షించే లాంగ్వేజ్-2 పేపర్‌లో రాణించేందుకు ఆయా భాషా విభాగాలకు సంబంధించి స్కూల్ స్థాయిలోని సబ్జెక్ట్ పుస్తకాలను పూర్తిగా చదవాలి. సాధారణంగా లాంగ్వేజ్-2కు సంబంధించి ఎక్కువ మంది అభ్యర్థులు ఇంగ్లిష్‌ను ఎంచుకుంటున్నారు. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డైరెక్ట్ అండ్ ఇన్ డైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్, వొకాబ్యులరీ.. ఇలా అన్ని అంశాలపైనా అవగాహన పెంపొందించుకుంటే రాణించవచ్చు.

అభ్యర్థులు నిర్దిష్టంగా ఒక ప్రామాణిక పుస్తకాన్ని ఎంచుకుని సిద్ధం కావాలి. పెడగాజికి సంబంధించి టీచింగ్ మెథడ్స్, అప్రోచెస్, టెక్నిక్స్, లాంగ్వేజ్ స్కిల్స్, ఇంగ్లిష్ నేపథ్యం మీద ప్రశ్నలు వస్తాయి.

మ్యాథమెటిక్స్

ఈ సబ్జెక్ట్‌కు సంబంధించి పేపర్-1లో ఒకటి నుంచి నుంచి అయిదో తరగతి స్థాయిలో.. పేపర్-2లో ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉండే కాన్సెప్ట్‌లపైనే ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నల క్లిష్టత ఇంటర్ స్థాయిలో ఉంటుంది.

ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

ఈ విభాగంలో రాణించేందుకు బోటనీ బేసిక్ అంశాలతోపాటు, పర్యావరణం, సైన్స్ ఇన్ డైలీ లైఫ్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

సైన్స్

ఈ విభాగంలో మార్కుల కోసం మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు పుస్తకాలు ఔపోసన పట్టాలి. పేపర్-2 కోసం ప్రత్యేకంగా ఆరు నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు చదవాలి. గత సీటెట్‌లో ఈ విభాగంలో ప్రశ్నలు కాసింత క్లిష్టంగానే ఉన్నాయని చెప్పొచ్చు. కాబట్టి అభ్యర్థులు ఆయా అంశాల బేసిక్స్, అప్లికేషన్స్ వంటి వాటిపై ప్రత్యేక అధ్యయనం చేయాలి.

సోషల్ స్టడీస్

ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. భూగోళ శాస్త్రంలో ఒక ప్రాంతం గురించి చదువుతున్నప్పుడు ఆ ప్రాంతానికి సంబంధించిన అన్ని అంశాలను చదివాలి. వాతావరణ,భౌగోళిక పరిస్థితులు,నదులు.. వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. అదేవిధంగా సివిక్స్, ఎకనామిక్స్ అంశాలను సమకాలీన అంశాలతో అప్‌డేట్ చేసుకుంటూ చదవాలి.



రామయ్య పెళ్లికొడుకాయనే..

భద్రాచలం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి పెళ్లి వేడుకలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు, వేద పండితుల సతీమణులతో పాటు ఈఓ రమాదేవి పసుపుకొమ్ములు దంచే కార్యక్రమంతో పనులకు శ్రీకారం చుట్టారు. ప్రతి ఏడాది ఫాల్గుణ పౌర్ణమి రోజున ఈ వేడుకలు ప్రారంభించడం ఆనవాయితీ. ముందుగా మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఉత్సవమూర్తులను ఉత్తర ద్వారం వద్దకు తీసుకొచ్చి ఆసీనులు చేశారు. ఆ తర్వాత ఆలయంలో వైభవంగా వసంతోత్సవం, డోలోత్సవం నిర్వహించారు. ఆయా వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



యాదాద్రిలో హోలీ సేవ..

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో సోమవారం హోలీ పండుగ సందర్భంగా ఆచార్యులు విశేష పూజలను నిర్వహించారు. సాయంత్రం శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకరించి, ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం పడమటి రాజ గోపురం ముందు గల వేంచేపు మండపంలో అధిష్ఠించి ప్రత్యేక పూజలు చేసి, వేద పారాయణం చేశారు. ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు హోలీ వేడుక విశేషాన్ని భక్తులకు వివరించారు. పూజల తర్వాత శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులపై రంగులు చల్లి, ఆ తర్వాత భక్తులపై చల్లారు. ఈ వేడుకలో ఆలయ ఆచార్యులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



ధర్మపురిలో వైభవంగా తెప్పోత్సవం

ధర్మపురి: జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మపుష్కరిణిలో సోమవారం సాయంత్రం ఉగ్రనృసింహుడి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజున ఉత్సవమూర్తులను ఆలయం నుంచి బ్రహ్మ పుష్కరిణి వరకు మంగళవాయిద్యాల మధ్య తీసుకెళ్లారు. కోనేరులో హంస వాహనంపై తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భోగ మండపంలోని ఊయలపై స్వామివార్లకు డోలోత్సవం నిర్వహించారు. ఈ వేడుకలో ఆచార్యులు, అధికారులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, డీసీఎమ్మెస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

ఫార్మసిస్ట్‌గా నమోదుకు వారు అర్హులే

ఎంఎల్‌టీ, బ్రిడ్జి కోర్సు అభ్యర్థులకు హైకోర్టులో ఊరట



సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఒకేషనల్ బోర్డు పరిధిలో మెడికల్ లేబరేటరీ టెక్నీషియన్ (ఎంఎల్‌టీ), బ్రిడ్జి కోర్సులు పూర్తి చేసిన వారు ఫార్మసిస్ట్‌లుగా నమోదుకు అర్హులేనని హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. పిటిషనర్లందరినీ ఫార్మసిస్టులుగా నమోదు చేయాలని తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌ను ఆదేశించింది. ఎంఎల్‌టీ, బ్రిడ్జి కోర్సులకు ఆమోదం లేదంటూ ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్‌కు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాసిన లేఖ చెల్లదని స్పష్టం చేసింది. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఒకేషనల్ బోర్డు జారీ చేసిన ఎంఎల్‌టీ, బ్రిడ్జి కోర్సులకు ఎడ్యుకేషన్ రెగ్యులేషన్స్ 5(5) ప్రకారం ఆమోదం లేదని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండి యా 2011లో ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్‌కు లేఖ రాసింది. ఫార్మసీ డిప్లొమా కోర్సులో ఇంటర్మీడియట్ (ఒకేషనల్ కోర్స్) అర్హత ఉన్న అభ్యర్థులెవరినీ చేర్చుకోవద్దని ఆదేశించింది. దీంతో జేఎన్‌టీయూలో బీ ఫార్మసీకి అర్హత పొందిన ఒకేషనల్ విద్యార్థులను ఫార్మసిస్టులుగా నమోదు చేసేందుకు ఏపీ ఫార్మసీ కౌన్సిల్ నిరాకరించింది. దీన్ని సవాల్ చేస్తూ పలువురు విద్యార్థులు వేర్వేరు సంవత్సరాల్లో హైకోర్టులో 18 పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లన్నింటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం విచారణ చేపట్టి.. ఒకేషనల్ కోర్సు చేసినా ఫార్మసిస్టులుగా నమోదుకు అర్హులేనని తీర్పు వెలువరించింది.

బార్ అసోసియేషన్ బరి.. హోరాహోరీ

రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో ఈ నెల 28న ఎన్నికలు

సాక్షి, హైదరాబాద్: సాధారణ ఎన్నికలను తలపించేలా రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో బార్ అసోసియేషన్ ఎన్నికల కోలాహలం నెలకొంది. ఏ కోర్టులో చూసినా ప్రచారాలు జోరుగా సాగుతున్నాయి. తమకే ఓటు వేయాలని అభ్యర్థులతోపాటు ప్యానెళ్లు సోషల్ మీడియా ద్వారా కూడా విజ్ఞప్తి చేస్తున్నాయి. ఈ నెల 28నే ఎన్నికలు ఉండటం.. మరో రెండు రోజులే సమయం ఉండటంతో తమకు ఓటు వేసి గెలిపిస్తే ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు చేపడతామో చెబుతూ ప్రచారం సాగిస్తున్నారు. కోర్టుల్లో కీలక పదవుల్లో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కూడా ఒకటి. బార్ అండ్ బెంచ్ సమన్వయంలో ఈ అసోసియేషన్లు కీలకపాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి ఉన్నతమైన స్థానం ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఎన్నికలను తెలంగాణ బార్ కౌన్సిల్ పర్యవేక్షిస్తుంది. గతంలో రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో కోర్టులోని బార్ అసోసియేషన్‌కు ఒక్కోసారి ఎన్నికలు జరగ్గా ఇప్పుడు అన్ని అసోసియేషన్ల ఎన్నికలు ఒకేసారి నిర్వహించేలా ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 1న కొత్త అసోసియేషన్ ప్రమాణస్వీకారం చేస్తుంది.

ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు



రాష్ట్రవ్యాప్తంగా అన్ని బార్ అసోసియేషన్లకు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రస్తుత కమిటీలకు సూచనలిచ్చాం. ఎన్నికల మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని చెప్పాం. ఎన్నికల నిర్వహణ కోసం అడ్‌హాక్ కమిటీలను కూడా ఏర్పాటు చేశాం.

– బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి

‘ఫ్రీ రీచార్జ్’ పేరుతో మోసాలు

అప్రమత్తంగా ఉండాలని సూచన

సాక్షి, హైదరాబాద్: ‘ఉచితంగా రూ.555 రీచార్జిని పొందండి..జియో ప్రారంభించి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ ఆఫర్ ఇస్తున్నాం’ అంటూ మెసేజీలు పంపుతున్నారు సైబర్ నేరగాళ్లు. ఉచిత ఆఫర్లను నమ్మి వారి వలకు చిక్కే అమాయకులకు మెసేజ్ లింకులను పంపి వారి నుంచి వ్యక్తిగత, బ్యాంకు ఖాతాలు, ఆధార్, పాన్ నంబర్లు సహా పలు వివరాలు సేకరిస్తూ మోసగిస్తున్నట్టు సైబర్ భద్రత నిపుణులు తెలిపారు. ఇలాంటి అనుమానాస్పద మెసేజీలను నమ్మవద్దని, అందులోని లింక్‌లపై ఎట్టిపరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని వారు హెచ్చరిస్తున్నారు. ఫ్రీ రీచార్జ్ ఆఫర్ల పేరిట వచ్చే వాట్సాప్ మెసేజీలు నకిలీవని గ్రహించాలని వారు సూచిస్తున్నారు.

రామగుండంలో మళ్లీ నిలిచిన విద్యుత్ ఉత్పత్తి



రామగుండం: పెద్దపల్లి జిల్లా రామగుండంలోని 62.5 మెగావాట్ల బీ-థర్మల్ విద్యుత్ కేంద్రంలో సోమవారం విద్యుత్ ఉత్పత్తి మళ్లీ నిలిచిపోయింది. మిల్స్ విభాగంలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. మరో రెండురోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఈ నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడం విస్మయం కలిగిస్తోంది. కాగా, ఈ నెలలో ప్రతీ మూడు, నాలుగు రోజులకోసారి బాయిలర్ ట్యూబ్స్, మిల్స్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడం, ప్లాంట్‌ను షట్‌డౌన్ చేయడం, విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడం సర్వసాధారణంగా మారింది. మరో వైపు విద్యుత్ పునరుద్ధరణలో ఇంజనీర్లు నిమగ్నమయ్యారు

రాష్ట్రంలో తగ్గిన విద్యుత్ వినియోగం

ఈ నెల 8న రికార్డుస్థాయిలో 15,623 మెగావాట్ల పీక్ డిమాండ్


తాజాగా 13,769 మెగావాట్లకు డిమాండ్ పతనం..

వేసవితాపం, వ్యవసాయ అవసరాలు తగ్గడమే కారణం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పడిపోయింది. ఈ నెల 8న రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా 15,623 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదు కాగా, తాజాగా ఆదివారంనాటికి 13,769 మెగావాట్లకు తగ్గిపోయింది. అకాలవర్షాలతో వేసవితాపం కొంత తగ్గగా, వ్యవసాయ విద్యుత్ వినియోగమూ స్వల్పంగా తగ్గింది. దీంతో గత రెండు వారాలుగా గరిష్ట విద్యుత్ డిమాండ్ తగ్గుముఖం పట్టిందని ట్రాన్స్‌కో వర్గాలు తెలిపాయి. పదిరోజుల నుంచి రోజువారీ గరిష్ట విద్యుత్ డిమాండ్ 13,100–14,200 మెగావాట్ల మధ్య నమోదవుతోంది.

ఏప్రిల్ తొలివారం గడిస్తే...

గతేడాది మార్చి 30న అత్యధికంగా 15,497 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదు కాగా, ఈ నెల 8న 15,623 మెగావాట్లకు దాటింది. ప్రస్తుత వేసవిలో గరిష్ట డిమాండ్ 16,000–16,500 మెగావాట్ల మధ్య ఉంటుందని అంచనా. యాసంగి పంటలు పొట్టకొస్తే.. మళ్లీ నీటి అవసరాలు పెరిగి మరికొన్ని రోజుల్లో విద్యుత్ డిమాండ్ పుంజుకుంటుంది. మార్చి నెలాఖరులోగా లేక ఏప్రిల్ తొలివారంలో రికార్డుస్థాయిలో డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు. ఏప్రిల్ రెండోవారానికి పంటలు కోత దశకు వస్తాయి. దీంతో వ్యవసాయ విద్యుత్ వాడకం చాలావరకు తగ్గి విద్యుత్ డిమాండ్ సాధారణ స్థితికి చేరుకుంటుంది. పరిస్థితులు ఇలానే ఉంటే ఈ వేసవిలో విద్యుత్‌కొరత, కోతలు లేకుండానే గట్టెక్కే అవకాశాలున్నట్టు ట్రాన్స్‌కో వర్గాలు పేర్కొంటున్నాయి.



పవర్ బ్యాంకింగ్ అదుర్స్

డబ్బు అవసరం లేనప్పుడు బ్యాంకులో దాచుకొని అవసరానికి తీసుకుంటాం. సరిగ్గా ఇదే తరహాలో తెలంగాణ విద్యుత్ సంస్థలు అవలంబిస్తున్న ‘పవర్ బ్యాంకింగ్’ విధానం అద్భుత ఫలితాలిస్తోంది. వేసవిలో విద్యుత్ లభ్యత పెంచడంతోపాటు ఎక్స్ఛేంజీల నుంచి అధిక ధరకు విద్యుత్ కొనుగోళ్ల నుంచి కొంతవరకు ఉపశమనం కల్పిస్తోంది. రోజూ రూ.వందల కోట్లు ఆదా అవుతున్నాయి. సాధారణంగా ఉత్తరాది రాష్ట్రాల్లో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వ్యవసాయ విద్యుత్ అవసరాలు పెరిగి విద్యుత్ డిమాండ్ భారీగా ఉంటుంది. దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం వేసవి ప్రారంభమైన తర్వాత ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో అత్యధిక విద్యుత్ డిమాండ్ ఏర్పడుతుంది. ప్రస్తుతం ఉత్తరాది రాష్ట్రాల్లో మిగులు విద్యుత్ లభ్యత ఉండగా, దక్షిణాది రాష్ట్రాల్లో విద్యుత్ కొరత ఉంది. పవర్ బ్యాంకింగ్ ద్వారా ఉత్తరప్రదేశ్ నుంచి 1000 మెగావాట్లు, మధ్యప్రదేశ్ నుంచి 300 మెగావాట్లు, పంజాబ్ నుంచి 200 మెగావాట్లు కలిపి రోజుకు 1,500 మెగావాట్ల వరకు విద్యుత్ గత రెండు నెలలుగా రాష్ట్రానికి సరఫరా అవుతోంది. మన దగ్గర సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో డిమాండ్ తగ్గిపోయి మిగులు విద్యుత్ ఉంది. ఆ సమయంలో యూపీ, మధ్యప్రదేశ్, పంజాబ్‌లకు రాష్ట్రం ఆ విద్యుత్‌ను సరఫరా చేసింది. దీంతో ఉభయపక్షాలు అత్యధిక డిమాండ్ నెలకొని ఉండే సమయాల్లో అధికధర విద్యుత్ కొనుగోళ్ల నుంచి ఉపశమనం పొందుతున్నాయి. ఈ పద్ధతి గత కొన్నేళ్లు కొనసాగిస్తుండగా, ఈ ఏడాది కొత్తగా యూపీ నుంచి సరఫరా ప్రారంభమైంది.

రోజూ రూ.30 కోట్లకు పైగా కొనుగోళ్లు

వేసవిలో పెరిగిన విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి ఓపెన్ యాక్సెస్ విధానంలో పవర్ ఎక్స్ఛేంజీల నుంచి రోజూ 40 మిలియన్ యూనిట్ల(ఎంయూ)ల వరకు విద్యుత్‌ను రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు కొనుగోలు చేస్తున్నాయి. ఇందుకు రోజూ రూ.30–రూ.35 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నాయి. విద్యుత్ గరిష్ట డిమాండ్ 16,000 మెగావాట్లకు చేరితే నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగించడానికి రోజువారీ విద్యుత్ కొనుగోళ్ల వ్యయం ఒక్కసారిగా రూ.100 కోట్లకు పెరుగుతుంది. గతేడాది వేసవిలో 4,5 రోజులపాటు రోజుకు రూ.100 కోట్ల వ్యయంతో విద్యుత్ కొనుగోలు చేశారు.

కార్చిచ్చుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అడవుల్లో వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలపై అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆందోళన వ్యక్తం చేశారు. వేసవి మొదలైనప్పటి నుంచి వరుసగా జరుగుతున్న అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ మధ్యకాలంలో అమ్రాబాద్, కవ్వాల్, తాడ్వాయి, ఇల్లందు తదితర ప్రాంతాల్లో అటవీ ప్రమాదాలు జరుగుతున్నట్లు సమాచారం వచ్చిందని మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రమాదాల వల్ల వన్యప్రాణులతో పాటు విలువైన అటవీ సంపదకు ఎక్కువగా నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. అలాగే అటవీ శాఖ వద్ద ఉన్న అటవీ అగ్ని ప్రమాద నివారణ యంత్రాల గురించి అధికారులతో మంత్రి ఆరా తీశారు. ప్రస్తుతం అటవీ అగ్ని ప్రమాదాల నివారణ కోసం ఉన్న పరికరాలు ఎన్ని? ప్రమాదాలను అరికట్టడానికి ఇంకా ఏం చేయాలి? అన్న అంశాలపై చర్చించారు. ఈ మేరకు పీసీసీఎఫ్ ఆర్.ఎం.డోబ్రియాల్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి.. అగ్ని ప్రమాదాల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎన్నికల తర్వాత రెగ్యులర్ డీఎంఈ, డీహెచ్ పోస్టుల భర్తీ

వైద్య, ఆరోగ్యశాఖ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్య శాఖలో కొత్త పోస్టుల ఏర్పాటుకు సర్కారు కసరత్తు ప్రారంభించింది. పూర్తిస్థాయి వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) సహా ప్రజారోగ్య సంచాలకులు, వైద్య విధాన పరిషత్ కమిషనర్, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ పోస్టులను భర్తీ చేస్తామని వెల్లడించింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన జారీచేసింది. సీనియారిటీ ఆధారంగా డీపీసీ ద్వారా నియమిస్తామని తెలిపింది. రాష్ట్ర విభజన తర్వాత ఆయా పోస్టులన్నీ ఏపీకే కేటాయించారు. అయితే తెలంగాణ రాష్ట్రానికి ఆ పోస్టులను సృష్టించలేదు. దీంతో వీటికి ఇన్‌చార్జులనే నియమిస్తూ పోయారని ప్రభుత్వం తెలిపింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈ ప్రక్రియను ఇప్పటికిప్పుడు చేయలేమని, ఎన్నికల అనంతరం చేస్తామని పేర్కొంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల ప్రకారం ఆయా పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.